


ESTD: 1999
www.voodayam.com

# వుదయం

కరీంనగర్ 07-09-2026 సోమవారం | సంపుటి : 14 | సంచిక :260 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on




## ప్రపంచాన్ని శాసించే స్థాయికి
# భారతీయ యువత ఎదగాలి

### భారత్ ఆర్థిక ప్రగతి అద్భుతం
### రక్షణ రంగ ఎగుమతుల్లో నూతన రికార్డులు
### గ్లోబల్ లీడర్‌గా భారత్ ఎదుగుదల



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 (ఎఎంఎస్) :** న్యూఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (SRCC) శతాబ్ది వేడుకల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభనుద్దేశించి ఆయన ప్రసంగించారు. 21వ శతాబ్దపు యువత ఆశయాలను, వారి ఉత్సాహాన్ని కొనియాడారు. డ్రోన్ టెక్నాలజీలో ఆవిష్కరణలు, యూనికార్న్ల సృష్టి, అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సొల్యూషన్స్‌తో యువత దూసుకుపోతోందని ప్రశంసించారు. గత తరాల కంటే మరింత పెద్ద కలలు కనాలని, ప్రపంచాన్ని నడిపించే గ్లోబల్ కన్సల్టింగ్, అకౌంటింగ్, ఫైనాన్షియల్, లీగల్ సంస్థలను స్థాపించి సత్తా చాటాలని యువతకు ప్రధాని పిలుపునిచ్చారు.

**భారత ఆర్థిక వ్యవస్థ అజేయం**

ప్రపంచ దేశాలు ప్రస్తుతం భారత్ పాలనా గతిశీలతను, వేగంగా అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న హోదాను కొనియాడుతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం, ప్రపంచ వాణిజ్య అడ్డంకులు ఎదురవుతున్నప్పటికీ, దేశం 7.8 శాతం త్రైమాసిక వృద్ధిని సాధించడం భారతదేశ అంతర్గత గట్టి సామర్థ్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు. చిన్న లక్ష్యాలతో ముందుకు సాగే వ్యక్తిని కానని, దేశం కోసం ఎప్పుడూ భారీ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం తన సర్వశక్తులూ ఒడ్డుతానని ప్రధాని అన్నారు.

**'మేక్ ఇన్ ఇండియా' విజయాలు**

భారత్‌ను భారీ దిగుమతిదారు నుంచి ప్రముఖ ఎగుమతిదారుగా మార్చడంలో 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం అద్భుతమైన విజయం సాధించిందని ప్రధాని తెలిపారు. నేడు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 2.5 లక్షల కోట్ల రూపాయలకు పైగా చేరాయని, దేశీయ రక్షణ రంగ ఉత్పత్తి ఆల్ టైమ్ హైగా దాదాపు 2 లక్షల కోట్ల రూపాయలకు చేరుకుందని వివరించారు. 2013-14లో కేవలం 600 నుంచి 700 కోట్ల రూపాయలుగా ఉన్న రక్షణ రంగ ఎగుమతులు, నేడు 40 వేల కోట్ల రూపాయలకు ఎగబాకాయని గుర్తుచేశారు.

**అభివృద్ధిలో వేగం**

దేశంలో మౌలిక వసతుల కల్పన, విధానాల అమలు గతంలో దశాబ్దాల పాటు పట్టేదని, నేడు అదే వేగం కొన్ని సంవత్సరాలకే పరిమితమైందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. రైల్వే నెట్‌వర్క్ వేగవంతమైన విద్యుద్దీకరణ, పెరుగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (FTAs) దేశ యువతకు సరికొత్త అవకాశాలను తెరుస్తున్నాయని పేర్కొన్నారు. భారతదేశంలో తొలి ఎలక్ట్రిక్ రైలు 1925లోనే నడిచినప్పటికీ, 2014 నాటికి 30 శాతానికంటే తక్కువ రైల్వే లైన్లు మాత్రమే విద్యుద్దీకరణకు నోచుకున్నాయని తెలిపారు. తమ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రత్యేక చొరవతో కేవలం 12 ఏళ్లలోనే దాదాపు వంద శాతం రైల్వే లైన్ల విద్యుద్దీకరణను పూర్తి చేశామని ప్రధాని సగర్వంగా వెల్లడించారు.

## 12 వేల ఉద్యోగాల భర్తీ
## 250 కొత్త బ్రాంచ్‌లు

**హైదరాబాద్:** దేశీయ రంగంలో అగ్రగామిగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) తన సేవలను దేశవ్యాప్తంగా మరింత విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు 12 వేల కొత్త నియామకాలను చేపట్టడంతో పాటు, కొత్తగా 250 బ్రాంచ్‌లను ప్రారంభించనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి (సీఎస్ శెట్టి) వెల్లడించారు. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు, బ్యాంక్ అవసరాలను నిశితంగా పరిశీలించి ఈ ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# నిర్లక్ష్యంపై ఉక్కుపాదం



### నిందితుడిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్న పోలీసులు
### పకడ్బందీగా దర్యాప్తు పూర్తి చేసి త్వరలోనే ఛార్జిషీట్ దాఖలు
### బాధిత కుటుంబానికి సత్వర న్యాయం అందించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ
### ఆసుపత్రి యాజమాన్య భద్రతా ఏర్పాట్లు, నిబంధనలపై సమగ్ర దర్యాప్తు
### బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ప్రభుత్వం
### ఆర్థిక సహాయంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు
### బాధిత కుటుంబానికి అండగా ఉంటాం


**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (వుదయం) :** హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుపై జరిగిన హత్యాచార ఘటనను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అత్యంత తీవ్రంగా పరిగణించారు. ఈ దుర్ఘటనపై తక్షణమే మెజిస్టీరియల్ విచారణకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనకు దారితీసిన అసలు పరిస్థితులు ఏమిటి, బాధితురాలు నివసిస్తున్న వసతి గృహం వద్ద భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి, సంబంధిత ఆసుపత్రి యాజమాన్య నిర్వహణలో ఏమైనా లోపాలు, నిర్లక్ష్యం ఉన్నాయా అనే కోణాలపై విచారణ జరపాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే, మహిళా ఉద్యోగుల భద్రత కోసం నిబంధనల ప్రకారం పాటించాల్సిన ప్రోటోకాల్స్ అన్నీ సక్రమంగా అమలయ్యాయా లేదా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కేసులో నిందితుడిని పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో, దర్యాప్తు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా ముగించాలని సీఎం తేల్చిచెప్పారు. ఫోరెన్సిక్ నివేదికలు, ఇతర సాంకేతిక ఆధారాల సేకరణను శరవేగంగా పూర్తి చేసి, త్వరలోనే సమగ్ర ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా పోలీసు ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు కేసు పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. బాధిత కుటుంబానికి సత్వరంగా న్యాయం చేకూర్చేందుకు వీలుగా ఈ కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు బదిలీ చేసి విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందుకోసం న్యాయ, పోలీసు మరియు ప్రాసిక్యూషన్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎక్కడా ఎలాంటి జాప్యం జరగకుండా చూసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ దుర్ఘటనలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని ముఖ్యమంత్రి భరోసానిచ్చారు. ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల మేరకు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క) నేరుగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం తరఫున తక్షణ ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు, బాధితుల కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని అధికారులను ముఖ్యమంత్రి గారు ఆదేశించారు.

## ఉద్యమకారుల హామీలు నీటి మూటలే



**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (వుదయం)** సోషల్ మీడియా వేదికగా తనపై అసభ్యకరంగా వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను కేవలం సస్పెండ్‌తో సరిపెట్టడంపై తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడిని సర్వీస్ నుంచి పూర్తిగా తొలగించి, వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఆమె రాష్ట్ర డీజీపీని డిమాండ్ చేశారు. తక్షణమే కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని అంతర్జాతీయ వేదికలపై ఎండగడుతామని హెచ్చరించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణసేన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలపై అసభ్యంగా ప్రవర్తించే వారిపై ఏ విధమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలో భారతీయ న్యాయ సంహిత (BNS) స్పష్టమైన సెక్షన్లు చెబుతున్నాయని, ఇవి డీజీపీకి తెలియదా అని కవిత నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతున్నా, గతంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలన్నీ కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని ఆరోపించారు.

## ఇంతే కదా...!




## రోడ్లపై కాదు..
# అసెంబ్లీకి వచ్చి చర్చించండి



**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (వుదయం)** బీఆర్ఎస్ నేతలు రోడ్లపై మాట్లాడటం మాని, అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొంటే అన్ని అంశాలపై సమాధానం చెబుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న కేసీఆర్ సభకు వచ్చి సలహాలు, అనుభవాలను పంచుకోవాలని ఆయన హితవు పలికారు. పీసీసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన మహాధర్నాలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో పాటు సీనియర్ నేతలు జగ్గారెడ్డి, వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి జవాబుదారీతనంతో ప్రజలకు సేవ చేస్తోందని తెలిపారు. విపక్షాలు సోషల్ మీడియా వేదికగా చేస్తున్న విష ప్రచారాలను గట్టిగా తిప్పికొట్టాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కేవలం కాంగ్రెస్ కార్యకర్తలే చేస్తున్నారా అని ప్రశ్నించారు. పేదలందరికీ ఇళ్ల వద్ద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని గుర్తుచేశారు. గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు సరిగ్గా రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, అదొక దౌర్భాగ్య పాలన అని తీవ్రస్థాయిలో విమర్శించారు. నేడు బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు కూడా రేషన్ కార్డులు పొందుతున్నారని, సన్నబియ్యం అందుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేవలం రెండున్నరేళ్ల కాలంలోనే రైతుల ఖాతాల్లోకి రూ. 1.60 లక్షల కోట్లు జమ చేశామని శ్రీధర్ బాబు వెల్లడించారు. తాము ఇచ్చిన ఆరు గ్యారంటీలను రాబోయే ఎన్నికల లోపు సంపూర్ణంగా అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. రూ. 8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మారిన రాష్ట్రాన్ని గత ప్రభుత్వం తమకు అప్పగించిందని, ఆ అప్పులకు అసలు, వడ్డీలు చెల్లిస్తూనే మరోవైపు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.

# కాంగ్రెస్ పాలన అట్టర్‌ఫ్లాప్

### ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయండి
### అసెంబ్లీ సమావేశాలకు తప్పకుండా హాజరుకావాలి



**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (వుదయం) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పూర్తిగా అట్టర్‌ఫ్లాప్ అయిందని, చేతకానితనంతోనే సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలోనూ, బయటా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీ (BRSLP) సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. రేపటి నుంచి ప్రారంభమయ్యే ఉభయసభల సమావేశాలకు ప్రజా ప్రతినిధులంతా తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలోనూ క్రియాశీలకంగా పాల్గొని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీల ప్రజా వ్యతిరేక విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్నది 'థర్డ్ క్లాస్' పాలన అని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలలోనూ ఘోరంగా విఫలమైందని కేసీఆర్ ఆరోపించారు. 'తెలంగాణ రైజింగ్' కాదని, రాష్ట్రం అన్ని విధాలా 'డౌన్‌ఫాల్' అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ పతనం ఖాయమని, ఈ విషయం ఆ పార్టీ నేతలకూ అర్థం కావడంతోనే విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నారని, తన చావును కోరుతూ పదే పదే మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సభలో స్పీకర్ వ్యవహరిస్తున్న తీరు పూర్తిగా పక్షపాత ధోరణిలో, అప్రజాస్వామికంగా ఉందని కేసీఆర్ ఆక్షేపించారు. ఏది ఏమైనా ప్రజా సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ వేదికగా ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేయాలని ఆయన పార్టీ నేతలకు సూచించారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ కీలక నేతలు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ కష్టాలకు చెక్

### ఎన్‌హెచ్-44, రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్లపై సీఎస్ ప్రత్యేక దృష్టి



**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (వుదయం)** రాష్ట్ర రాజధానిలో రవాణా వ్యవస్థను మరింత సుగమం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు ప్యారడైజ్ జంక్షన్ వద్ద నిర్మించతలపెట్టిన ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ శ్రీ సర్ఫరాజ్ అహ్మద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులతో కలిసి ఆయన ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫార్మ్ రోడ్ వరకు ఎన్‌హెచ్ 44 పైనున్న మార్గంతో పాటు, ప్యారడైజ్ నుంచి బొల్లారం, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, శామీర్‌పేట్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు (ORR) జంక్షన్ వరకు ఎస్‌హెచ్ 1 (రాజీవ్ రహదారి) పై నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల బ్లూప్రింట్‌ను అధికారులు సీఎస్‌కు వివరించారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన అలైన్‌మెంట్, ప్రయాణ కనెక్టివిటీ, భూసేకరణ ప్రక్రియ, మౌలిక వసతుల కల్పనపై వారు చర్చించారు. ఈ కారిడార్లు అందుబాటులోకి వస్తే సికింద్రాబాద్, బొల్లారం, శామీర్‌పేట్ తదితర ప్రాంతాల మధ్య ప్రయాణం మరింత వేగవంతం కానుంది. ఉత్తర ప్రాంతం నుంచి నేరుగా ఓఆర్ఆర్‌కు అనుసంధానం లభించడంతో పాటు ప్రధాన మార్గాల్లో నిత్యం వేధించే ట్రాఫిక్ రద్దీ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సికింద్రాబాద్-శామీర్‌పేట్ కారిడార్‌లో భవిష్యత్ అవసరాలను అంచనా వేసి పనులను వేగవంతం చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. ప్రాజెక్టు అమలులో ఎదురయ్యే భూసేకరణ ఇబ్బందులు, విద్యుత్, తాగునీటి లైన్ల మార్పిడి, వివిధ శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలను వేగంగా పరిష్కరించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. మెట్రో రైలు, రహదారులు, ఓఆర్ఆర్ వ్యవస్థలన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానమయ్యేలా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో మెట్రో రైలు, హెచ్ఎండీఏ, ఆర్అండ్‌బీ శాఖల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఇజ్రాయెల్‌పై ఇరాన్ భారీ ప్రతీకార దాడికి కుట్ర

**జెరూసలేం:** అమెరికా మద్దతుతో తమ దేశంపై దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు ఇరాన్ ఉవ్విళ్లూరుతోంది. తమ దేశాధినేతల మరణానికి కారణమైన శత్రువులను మట్టుబెడతామని గతంలోనే పలుమార్లు హెచ్చరించిన టెహ్రాన్ ప్రభుత్వం, ఇప్పుడు ఆచరణలో కక్షసాధింపునకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో ఇజ్రాయెల్ నిఘా వర్గాలు వెల్లడించిన సంచలన విషయాలు అంతర్జాతీయంగా కలకలం రేపుతున్నాయి. ఇజ్రాయెల్‌పై సర్వనాశనకర స్థాయిలో భారీ దాడులు చేపట్టేందుకు ఇరాన్ భీకర ప్రణాళికలు రచిస్తోందని ఇజ్రాయెల్ నిఘా నివేదికలు స్పష్టం చేశాయి.

**నలువైపుల నుంచి ముప్పేట దాడికి కుట్ర**

ఇజ్రాయెల్‌ను అన్ని వైపుల నుంచి ఏకకాలంలో లక్ష్యంగా చేసుకునేందుకు ఇరాన్ తన మిత్రపక్షాలైన హెజ్‌బొల్లా, హమాస్, యెమెన్‌లోని హూతీలతో పాటు ఇరాక్‌లోని సాయుధ ముఠాలతో జట్టు కడుతోందని నిఘా వర్గాలు ఆరోపించాయి. భవిష్యత్తులో జరగబోయే ఈ దాడి తీవ్రత 2023 అక్టోబర్ 7 నాటి హమాస్ దాడిని మించిపోయే అవకాశం ఉందని హెచ్చరించాయి. ఇందులో భాగంగా ఇరాన్‌కు చెందిన శక్తివంతమైన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) తన బలగాలను లెబనాన్‌లోని హెజ్‌బొల్లా, హమాస్, హూతీ మిలిటెంట్లతో కలిసి మోహరించాలని భావిస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రముఖ పత్రిక ఒక సంచలన కథనాన్ని వెలువరించింది. గత 2023 అక్టోబర్ 7 దాడిలో హమాస్ అనుకున్న లక్ష్యాలను పూర్తిగా సాధించలేకపోయింది. దీంతో ఈసారి తన మిత్రదేశాలన్నింటినీ ఏకం చేసి ఇజ్రాయెల్‌పై విరుచుకుపడేలా ప్లాన్ మారుస్తోంది. హమాస్ నాయకత్వంలో ఇటీవల వచ్చిన మార్పులు కూడా ఈ పరిణామాలకు కారణమయ్యాయి.



# చందాపూర్ గ్రామంలో బోనాల పండుగలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**అచ్చంపేట, సెప్టెంబర్ 06: (వుదయంప్రతినిధి)**

అచ్చంపేట నియోజకవర్గం చందాపూర్ గ్రామంలో ఆదివారం ఘనంగా జరిగిన బోనాల పండుగ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు బోనాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న గువ్వల బాలరాజు గ్రామ దేవతలు ఎల్లమ్మ, పోషమ్మ, మారేమ్మ, పెద్దమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చిన్నమారూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఏర్పాటు



- **మండల అధ్యక్షులు కేతపాగ గోపాల్**

**చిన్నంబావి మండలం 06 ( వుదయం రిపోర్టర్ )**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, చిన్నంబావి మండల అధ్యక్షుడు కేతాపగ గోపాల్ మాదిగ ఆధ్వర్యంలో చిన్నమారూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంపంగి మద్దిలేటి, రామచంద్రయ్య, చిన్నమారూర్ గ్రామ సర్పంచ్ మద్దూరి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షునిగా మద్దూరి శివకుమార్, ఉపాధ్యక్షునిగా చారకొండ రాజేష్, ప్రధాన కార్యదర్శిగా సులిగిరి శేఖర్, అధికార ప్రతినిధిగా మద్దూరి విజయ్, సలహాదారుడిగా మాజీ సర్పంచ్ మద్దూరు రామచంద్రయ్యను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా గుంపు నాగశేషులుతో పాటు పలువురిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కేతపగా గోపాల్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనతో పాటు మాదిగల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఎమ్మార్పీఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. గ్రామస్థాయిలో సంఘాన్ని మరింత బలోపేతం చేసి, ప్రతి కార్యకర్త ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి వి. కోటేష్, పెద్దమారూర్ గ్రామ అధ్యక్షుడు మొలకలపల్లి శివ మహేష్, చిన్న కురుమయ్య, పాలమూరు యూనివర్సిటీ పవన్ కుమార్ తో పాటు పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ



**సురేష్ కుమార్ షెట్కర్**
**మనూరు , వుదయం**

మానూర్,మండల దోసపల్లి గ్రామానికి,చెందిన,బిరాదర బస్వరాజ్ గారి కూతురి వివాహ, వేడుకలో ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ పాల్గొని,నూతన వధూవరులు, ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు

ఈ, కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, సీనియర్, నాయకులు బీఎస్ వీర్ శెట్టి,సర్పంచ్ సంగమేశ్ పటేల్, సర్పంచ్ దత్తు,భారత్ పటేల్ సర్పంచ్,లింగప్ప పటేల్, నాగ్, శెట్టి కన్నె ,సంతోష్,

నర్సింలు,తదితరులు కలరు

# సమాజంలో జర్నలిస్టులో పాత్ర ఎంతో కీలకం



**కల్వకుర్తి సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి)**

సమాజంలో జరిగే అన్ని విషయాలను ప్రపంచానికి చాటి చెప్పే క్రమంలో జర్నలిస్టులు పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకం అయిందని వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వి 108 ఏ గవర్నర్ గోల్డెన్ స్టార్ కల్మిచర్ల రమేష్ అన్నారు. ఆదివారం జర్నలిస్టు డే సందర్భంగా కల్వకుర్తి వాసవి క్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గవర్నర్ ప్రస్తుత సమాజంలో నెలకొన్న పరిస్థితులు అందులో జర్నలిస్టుల పాత్ర పై వివరంగా మాట్లాడారు. ఏది ఏమైనా సమస్యలను వెలుగులోకి తెచ్చి సమాజంలోని అన్ని వర్గాల సమస్యల పరిష్కారంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులు అభినందనీయులని కల్మిచర్లరమేష్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు చిగుళ్లపల్లి శ్రీధర్, కొండూరు కృష్ణయ్య, పోలా శ్రీధర్, కూన సంతోష్, కల్వా ఆంజనేయులు, పోలా నరేష్ తదితరులను శాలువాతో సహకరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ బాదం రాఘవేందర్, క్లబ్ అధ్యక్షుడు బాదం హరీష్ లు మాట్లాడుతూ సమాజంలో మంచి చెడును తమ కలాల ద్వారా వెలికితిస్తూ అందరికీ అన్నివేళలా అండగా నిలిచే జర్నలిస్టుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షురాలు బాదం సాయి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ అసమర్ధత పాలనలో
# పెరిగిపోతున్న నిరుద్యోగం

- **జాబ్ క్యాలెండర్ అమలు చేయకుండా యువతను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**
- **స్థానిక యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.**

**ఆనగంటి వెంకటేష్ డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

**సంగారెడ్డి,వుదయం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత విధానాల వల్లన దేశంలో, రాష్ట్రంలో రోజు రోజుకు నిరుద్యోగం పెరిగిపోతుందని, తక్షణమే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలపై నోటిఫికేషన్స్ వేయాలని ప్రభుత్వాలను డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు.భారత ప్రజాతంత యువజన సమాఖ్య సంగారెడ్డి జిల్లా 4వ మహాసభలు కొండాపురం మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిధిగా హాజరైన డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ దేశ యువతకు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా 12 సంవత్సరాలు గడుస్తున్నా కోట్లాది మంది నిరుద్యోగ యువతకు తీవ్ర నిరాశ,అన్యాయం మాత్రమే మిగిల్చిందని,ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ ఉద్యోగ అవకాశాలను తగ్గిస్తుండగా, మరోవైపు నీట్,రైల్వే, బ్యాంకింగ్ వంటి పోటీ పరీక్షల్లో వరుసగా ప్రశ్నపత్రాల లీకులు జరుగుతూ విద్యార్థి,యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని అన్నారు.కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లోనే సుమారు పది లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆ పోస్టులన్నింటిని భర్తీ చేయాలని,నిరుద్యోగ యువతకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేసారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు నిరుద్యోగులందరికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని,జాబ్ క్యాలెండర్ ప్రకటించి నోటిఫికేషన్లు వేసి ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఎన్నికల మేనిఫెస్టోలో యూత్ డిక్లరేషన్ ని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయిన ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ తో పాటు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. సమగ్రమైన వివరాలతో జాబ్ క్యాలెండర్ను ప్రకటించి ఉద్యోగాల భర్తీకై నోటిఫికేషన్లను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వేయాలన్నారు. అదేవిధంగా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించే అంతవరకు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి 4000 రూపాయలు ఇవ్వాలని,స్వయం ఉపాధి రుణాలపై రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించి లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడం లేదు. దరఖాస్తులకే పరిమితం కాకుండా అర్హులైన నిరుద్యోగ యువత అందరికి రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా స్వయం ఉపాధి రుణాలు అందించాలన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకై డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.డివైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి జయరాజు, మాజీ నాయకులు అతిమేలా మాణిక్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కఠినమైన చర్యలు తీసుకోవాలని, నిరంతర నిషా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి విద్యార్థి, యువత ప్రాణాలను రక్షించాలని అన్నారు. సంగారెడ్డి జిల్లాలో అనేక పరిశ్రమలు ఉన్న స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం లేదన్నారు. ఇక్కడి వనరులను అన్నిటిని ఉపయోగించుకొని పరిశ్రమలు స్థానికత పేరుతో ఉద్యోగాలు ఇవ్వకుండా స్థానిక యువతను మోసం చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వమే స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

మహాసభల సందర్భంగా కొండాపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం నుండి భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం డివైఎఫ్ఐ జెండాను జిల్లా కార్యదర్శి అనిల్ ఆవిష్కరించారు. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి అనిల్,నాయకులు ఎం.శ్రీకాంత్,ప్రశాంత్, జె.శ్రీకాంత్, బాబురావు,వాణి, రమేష్, సాయికుమార్, అర్జున్,ప్రజా సంఘాల నాయకులు రాజయ్య,నాగభూషణం,రాజు, నాగరాజు లతో పాటు 100 మంది యువత పాల్గొన్నారు.





# అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ దశాబ్ద పాలన

- **రేవంత్ రెడ్డిపై హరీష్ విమర్శలు సిగ్గుచేటు**
- **దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని బిఆర్ఎస్ మోసం**
- **ఇంటికో ఉద్యోగం ఏమైందని ప్రశ్నించిన నాయకులు**
- **దుబ్బాకను అభివృద్ధి చేస్తానని హరీష్ రావు చెప్పడం హాస్యాస్పదం**

**అక్బర్ పేట భూంపల్లి సెప్టెంబర్ 6 ( వుదయం ప్రతినిధి )**

అబద్ధాల పునాదులపై దశాబ్ద కాలం తెలంగాణలో పాలన చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుచేటని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సంయుక్త శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూండా శంకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా అక్బర్ పేటభూంపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఇంటికో ఉద్యోగం ఇస్తామని, దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పి మోసం చేసింది బీఆర్ఎస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా హరీష్ రావు దుబ్బాక నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు.

దుబ్బాక నియోజకవర్గంపై కపట ప్రేమ చూపుతూ ఇక్కడి నిధులను దండుకున్నది నిజం కాదా అని నిలదీశారు. రైతులను అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తే సహించబోమని, రాబోయే ఎన్నికల్లో ఓటుతో ప్రజలు గుణపాఠం చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలూరు కమలాకర్,

జిల్లా కార్యదర్శి సురేందర్ రెడ్డి,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కూతురు కుమారస్వామి, బేగంపేట సర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు మధు,నాగరాజు,గణేష్,రవీందర్ రెడ్డి, బాలరాజు,తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటికీ 'బాకీ కార్డుల' పంపిణీ..

- **దౌలాపూర్ గ్రామంలో కాంగ్రెస్ మోసపూరిత పాలనను కడిగిపారేసిన బిఆర్ఎస్ శ్రేణులు!**

**సిద్ధిపేట/జగదేవపూర్, సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి)**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అబద్ధపు హామీలు, అమలుకు నోచుకోని 'బాండ్ పేపర్' వాగ్దానాలపై బిఆర్ఎస్ పార్టీ విరుచుకుపడింది. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం

దౌలాపూర్ గ్రామంలో ఆదివారం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు 'బాకీ కార్డుల పంపిణీ' కార్యక్రమాన్ని నిర్వహించి, ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు పడిన బాకీలను, మోసపూరిత వైఖరిని పూసగుచ్చినట్లు వివరించారు. గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి నాయకత్వంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఏకమై నిరసన బావుటా ఎగురవేశారు. ఈ సందర్భంగా రాచమల్ల ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ.."ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా బాండ్ పేపర్లు రాసిచ్చి తీవ్రంగా మోసం చేశారు. పింఛన్ ₹4,000 చేస్తామని, రైతుబంధు ₹7,500 ఇస్తామని, కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ఆశచూపి ఓట్లు దండుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చాక కేసీఆర్ హయాంలో రైతులకు కొండంత అండగా ఉన్న 'రైతు బీమా' లాంటి ప్రతిష్ఠాత్మక పథకాలను తొక్కేసి నిర్వీర్యం చేశారు. కేసీఆర్ అనే పేరే లేకుండా చేయాలనే కుట్రపూరిత వైఖరితో వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి. ఇప్పటికే సగం కాలం ముగిసిపోతోంది, మరో ఏడాది దాటితే కాంగ్రెస్ ప్రభుత్వానికి కాలం చెల్లినట్లే! ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తన బుద్ధి మార్చుకోవాలి" అని ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు జూపల్లి మధు, ఆకారం నర్సింలు, రాళ్ళ నర్సింలు, బిఆర్ఎస్ నాయకులు మహేందర్ యాదవ్, జూపల్లి నర్సింలు, జూపల్లి భాస్కర్ కార్యకర్తలు మల్లన్న, పెద్దులు, ఆర్ ఎంపీ నర్సింలు, బాలరాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# విలేకరిపై పోలీస్ అధికారి దురుసు ప్రవర్తన

**జోగిపేట, చిలిపిచేడ్, సెప్టెంబర్ 6 (వుదయం):**

విలేఖరివైతే నా నాకేంటి దూరస్తుగా ప్రవర్తించిన ఏఎస్ఐఆందోల్ ఆందోల్ జోగిపేట్ వుదయం ఆదివారం ఆందోల్ మండల పరిధిలోని మెదక్ జిల్లా చిలిపిచేడ పోలీసుల దురుసు ప్రవర్తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ విలేకరితో చిలిప్‌చెడ్ మండల పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ రాములు దురుసుగా, అసభ్యకరమైన భాషలో మాట్లాడిన ఘటన వివాదాస్పదంగా మారింది. విలేకరి తెలిపిన వివరాల ప్రకారం.. తాను హెల్మెట్ ధరించి బైక్ నడుపుతున్నప్పటికీ, వెనుక నుంచి వచ్చిన ఓ కానిస్టేబుల్ తన ఫొటో తీశారని పేర్కొన్నారు. దీనిపై కానిస్టేబుల్‌ను ఫొటో ఎందుకు తీశారని ప్రశ్నించగా, ఫైన్ పడిన తర్వాత పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫొటో డిలీట్ చేసుకోవాలని చెప్పినట్లు తెలిపారు.తాను హెల్మెట్ ధరించినప్పటికీ ఫొటో ఎందుకు తీశారని ప్రశ్నించడంతో అక్కడే ఉన్న ఏఎస్ఐ రాములు జోక్యం చేసుకుని, "ఎందుకు అడుగుతున్నావు.. నువ్వెవరు.. విలేకరి అయితే ఏంటి?" అంటూ దురుసుగా మాట్లాడారని, అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ "ఏం చేసుకుంటావో చేసుకో" అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారని విలేకరి ఆరోపించారు.ఈ విషయంపై సంబంధిత ఎస్ఐకి ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా, డ్యూటీలో ఉన్న సిబ్బందిని సమర్థిస్తూ సరిగా స్పందించలేదని విలేకరి తెలిపారు. విలేకరులతో పోలీసు అధికారులు గౌరవంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, విధి నిర్వహణలో భాగంగా ప్రశ్నించినందుకు అసభ్యకరంగా మాట్లాడటం సరికాదని పలువురు పాత్రికేయులు అభిప్రాయపడుతున్నారు.ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి విలేకరితో అసభ్యకరంగా మాట్లాడినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని జర్నలిస్టులు కోరుతున్నారు.





# విద్యుత్ సరఫరా చేయాలని రైతుల రాస్తారోకో

**దామరగిద్ద సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి)**

సమయానికి విద్యుత్ సరఫరా కాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామంలో రైతులు రోడ్డెక్కారు.వ్యవసాయానికి నిర్ణీత సమయం మేరకు 12 గంటల విద్యుత్ అందించాలని తరచూ కోతలు విధించకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రాస్తారోకో నిర్వహించారు.రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ నారానోళ్ల నారాయణ, ఎస్ఐ నరేష్ స్పందించారు. విద్యుత్ శాఖ ఏఈ అనిల్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆందోళన ప్రాంతానికి పిలిపించారు.

ఈ సందర్భంగా రైతుల తరఫున మొగలప్ప, అశోక్ విద్యుత్ కోతల కారణంగా సాగులో ఎదురవుతున్న ఇబ్బందులను ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. కరెంట్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల సమస్యలను విన్న ఏఈ అనిల్‌కుమార్ వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు నిర్ణీత సమయం మేరకు కరెంట్ అందేలా చూస్తామని స్పష్టం చేశారు. ఏఈ హామీతో రైతులు రాస్తారోకోను విరమించారు. ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.







## జహీరాబాద్–బడెంపేట పాదయాత్రకు
# ఘనంగా సంఘీభావం

**జహీరాబాద్ వుదయం**

జహీరాబాద్ నుండి బడెంపేట వరకు కొనసాగిన పాదయాత్రకు దారి మధ్యలో ష.బ్ర.108 వీరేశ్వర శివాచార్య మహాస్వామి ధనసిరి ఆధ్వర్యంలో ఘనంగా సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా జహీరాబాద్ యువజన నాయకులు శ్రీ సురేష్ షెట్కర్ గారి ఆధ్వర్యంలో పాదయాత్రలో పాల్గొన్న వారికి పండ్లు, పాలు, మంచినీరు పంపిణీ చేశారు. పాదయాత్రికులకు అవసరమైన సేవలు అందిస్తూ కార్యక్రమానికి తమ మద్దతును తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం సలహాదారులు అన్మిశెట్టి జయప్రకాశ్, యువజన అధ్యక్షులు బుగ్గనగారి మల్లికార్జున్, వీరేశం, చంద్రకాంత్, నీలకంఠప్ప, గుణాకర్, మల్లేశం, రోహిత్, శివరాజ్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రికులకు సేవ చేయడం ద్వారా సమాజ ఐక్యత, భక్తి భావం, పరస్పర సహకారాన్ని చాటిచెప్పారని నిర్వాహకులు తెలిపారు.

## బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో
# దుబ్బాకకు తీరని అన్యాయం



- **కాంగ్రెస్ అభివృద్ధిని ఓర్వలేకే హరీష్ రావు ధర్నాలు**
- **మోసపూరిత మాటలు ప్రజలు నమ్మరని వెల్లడి**
- **దుబ్బాకపై కపట ప్రేమ మానుకోవాలని హితవు**

**దుబ్బాక, సెప్టెంబర్ 6, వుదయం:**

బీఆర్ఎస్ గత 10 సంవత్సరాల పాలనలో దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే మాజీ మంత్రి హరీష్‌రావు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మచ్చ శ్రీనివాస్, గడీల జనార్దన్ రెడ్డి మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి వారు నిరసన వ్యక్తం చేశారు. రైతు ధర్నా పేరుతో బీఆర్ఎస్ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు దుబ్బాక నియోజకవర్గానికి రావాల్సిన నిధులను సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ ప్రాంతాలకే మళ్లించి అభివృద్ధి చేశారని, దుబ్బాక ప్రజల గొంతు కోశారని విమర్శించారు. హరీష్ రావు రైతు ధర్నాల పేరుతో దుబ్బాకలో తిరుగుతూ మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని, దుబ్బాక ప్రజలు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, హరీష్ రావు మాటలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. దుబ్బాక అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయి, రామచంద్రారెడ్డి, అనంతుల శ్రీనివాస్, శివకుమార్, పిట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను
# గడపగడపకు తీసుకెళ్తాం



- **మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్**

**గజ్వేల్, సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి)**

కాంగ్రెస్ ప్రభువం అధికారంలోకి వచ్చి 1000 రోజులు (33 నెలలు) పూర్తయినా ఎన్నికల హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శిస్తూ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు అహ్మదీపూర్ గ్రామంలో ఇంటింటికీ 'బాకీ కార్డు'లను పంపిణీ చేశారు. ఎన్నికల ముందు 6 గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, కేసీఆర్ హయాంలో నడిచిన సంక్షేమ పథకాలను ఎత్తివేస్తూ ప్రజలను మోసం చేస్తోందని ఈ సందర్భంగా ఆరోపించారు. రైతుబంధు, రైతుబీమాపై స్పష్టత లేకపోవడం, రుణమాఫీ, రైతుభరోసా, ఎరువులు, కరెంట్ సక్రమంగా ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. మహాలక్ష్మి పథకం కింద ఒక్కో మహిళకు ₹82,500 బాకీ పడ్డారని, కళ్యాణలక్ష్మితో తులం బంగారం ఇస్తామన్న హామీని పక్కనపెట్టి పథకాన్నే ఎత్తివేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుదేలైందని, రానున్న రోజుల్లో ప్రతి గడపలో ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బ్యాగారి ప్రభాకర్, మాజీ సర్పంచ్ చాడ శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజామోద్దీన్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డివైఎఫ్ఐ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎం.ఆది ఎన్నిక.

**చిన్నంబావి మండలం 06 ( వుదయం రిపోర్టర్ )**

అమరచింత మండల కేంద్రంలో జరిగిన భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ ) వనపర్తి జిల్లా మూడవ మహాసభల్లో నూతన కమిటీలోకి ఎం.ఆది జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. యువత ఎదుర్కొంటున్న విద్య, నిరుద్యోగం, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ వంటి సమస్యలపై నిరంతరం పోరాడేందుకు డివైఎఫ్ఐ ముందుండాలని ఈ సందర్భంగా నూతన కమిటీ పిలుపునిచ్చింది. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, విద్యార్థులు నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎం.ఆది మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన డివైఎఫ్ఐ నాయకత్వానికి, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. యువత సమస్యల పరిష్కారం కోసం మరింత చురుకుగా పనిచేస్తానని, విద్యార్థులు మరియు నిరుద్యోగ యువతను సంఘటితం చేసి హక్కుల సాధన కోసం పోరాటాలను బలోపేతం చేస్తానని తెలిపారు.





# గ్రేటర్ హైదరాబాద్



## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల మహాధర్నా




- NPS రద్దు చేసి OPS పునరుద్ధరించాలి

**ముషీరాబాద్, సెప్టెంబర్ 06 (వుదయం)**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల ప్రధాన డిమాండ్‌తో హైదరాబాద్‌లో సౌత్ జోన్ స్థాయిలో భారీ మహాధర్నా నిర్వహించారు.కొత్త పెన్షన్ విధానం NPSను రద్దు చేసి.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం OPSను పునరుద్ధరించాలంటూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమాఖ్య డిమాండ్ చేసింది.ఉద్యోగుల పదవీ విరమణ అనంతర భవిష్యత్ భద్రతకు OPS ఎంతో కీలకమని నాయకులు పేర్కొన్నారు. NPS విధానం కారణంగా ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భద్రతపై అనిశ్చితి నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎయిర్ ఫోర్స్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ హకీంపేట్ ప్రతినిధులు మహాధర్నాలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ మహాధర్నాలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ, ఎయిర్ ఫోర్స్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ రంజీత్ గౌడ్, CITU రాష్ట్ర కార్యదర్శి ఉమేష్, AIDEF జనరల్ సెక్రటరీ సి. శ్రీకుమార్, CCGEW జనరల్ సెక్రటరీ వెంకటేశన్, కన్ఫెడరేషన్ చైర్మన్ నాగేశ్వర్ రావు, CCGEW జనరల్ సెక్రటరీ అజీజ్ తదితరులు పాల్గొని ఉద్యోగుల డిమాండ్లకు మద్దతుగా తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. NPS విధానం ఉద్యోగుల పదవీ విరమణ జీవితానికి పూర్తి స్థాయి భరోసా కల్పించడం లేదని, ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన డిమాండ్లపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. NPSను రద్దు చేసి OPSను పునరుద్ధరించే వరకు పోరాటం ఆపేది లేదని నాయకులు స్పష్టం చేశారు. ఉద్యోగుల భవిష్యత్ భద్రత కోసం.. OPS సాధించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మహాధర్నా వేదికగా హెచ్చరించారు.

## నేతకాని వర్గానికి ప్రత్యేక గుర్తింపు కల్పించాలి

- గ్రూప్-2 లేదా ఎస్టీ జాబితాలో చేర్చాలి
- నేతకాని పరివర్తన పోరాట సమితి

**ముషీరాబాద్, సెప్టెంబర్ 06(వుదయం)**




నేతకాని సామాజిక వర్గాన్ని గ్రూప్2 లేదా ఎస్టీ జాబితాలో చేర్చి ప్రత్యేక గుర్తింపు కల్పించాలని నేతకాని పరివర్తన పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు.నేతకాని సామాజిక వర్గం ఏళ్లుగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉందని, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం లేక తీవ్రంగా నష్టపోతున్నామని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ హక్కులు, సమస్యల పరిష్కారం కోసం శాంతియుత ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి తమ డిమాండ్లను తెలియజేశారు.

నేతకాని వర్గానికి ప్రత్యేక కేటగిరీ/గుర్తింపు కల్పించడంతో పాటు విద్య, ఉద్యోగాలు, ఉపాధి, సంక్షేమ పథకాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే నేతకాని అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, విద్యార్థులకు విద్యా సదుపాయాలు, యువతకు ఉపాధి అవకాశాలు, పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని నాయకులు కోరారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే, భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు చేపడతామని నేతకాని పరివర్తన పోరాట సమితి నాయకులు హెచ్చరించారు.



## కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలి

- కాంగ్రెస్ నాయకులు

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ ,(వుదయం ప్రతినిధి ),**

కేసీఆర్ ప్రతిపక్ష నేతగా ప్రజల సమస్యలపై బాధ్యత వహించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ ఆయన వెంటనే ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన భారీ ధర్నా కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, ప్రగతి నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతి రెడ్డి ), కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ, ఐఎన్టీయుసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### రాబోయేది ఇక మన ప్రభుత్వమే.. ఇది ప్రజా పాలనా కాదు

## వెయ్యి రోజుల పీడా పాలన ..



- రేవంత్ రెడ్డి రాక్షస పాలనకు త్వరలోనే చరమగీతం..ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిరంతర పోరాటం..
- పోరు బాట కార్యక్రమంలో తీవ్రంగా ధ్వజమెత్తిన పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు/ అమీనాపూర్ సెప్టెంబర్ 06, వుదయం,**

పోరాడి సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా నిలిచిందని.. గత రెండున్నర సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టిందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వ 420 మోసపూరిత హామీలు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న పోరుబాట కార్యక్రమంలో భాగంగా.. ఆదివారం బిహెచ్ఈఎల్ చౌరస్తా నుంచి ఇస్నాపూర్ వరకు భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రంలో మహిళలతో కలిసి భారీ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు ఇలా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ విధానాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

కేసీఆర్ హయాంలో సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిందని, పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు తెలంగాణను దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దారని అన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం గతంలో అమలైన అనేక సంక్షేమ పథకాలను నిలిపివేసిందని తీవ్రంగా ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తోందని తెలిపారు. ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని,

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. "రాబోయేది మన ప్రభుత్వమే.. ప్రతి సంక్షేమ పథకాన్ని తిరిగి అమలుపరుస్తాం. ప్రజల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధే బీఆర్ఎస్ లక్ష్యం" అని పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెబుతారని, ప్రజా వ్యతిరేక పాలనకు త్వరలోనే చరమగీతం పాడటం ఖాయమని గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్లు సపానా దేవ్, మెట్టు కుమార్ యాదవ్, అంజయ్య, మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పిటిసిలు శ్రీకాంత్ గౌడ్, బాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్, మాజీ ఎంపీపీ గాయత్రి పాండు, ఉపేందర్, మేరాజ్ ఖాన్, పృథ్వీరాజ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, ఆటో కార్మికులు, మహిళలు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### రాజకీయ పార్టీలు కురుమ కులాన్ని

## ప్రత్యేకంగా గుర్తించాలి



- ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో కురుమ మహా ధర్నా

**ముషీరాబాద్, సెప్టెంబర్ 06(వుదయం)**

రాజకీయ పార్టీలు కురుమ కులాన్ని ప్రత్యేకంగా గుర్తించి, తమ రాజకీయ ప్రాతినిధ్యానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద కురుమ మహా ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. కురుమ కులానికి ప్రత్యేక గుర్తింపు, రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

అలాగే ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తన రాజకీయ స్వార్థం కోసం యాదవులను కురుమ కులంలో కలిపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎగ్గి మల్లేశం కురుమ కుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ కురుమ సమాజానికి ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. "మేము గొల్ల కురుమలం కాదు.. మేము కురుమ కులస్థులం. మా కులానికి ప్రత్యేక గుర్తింపు కావాలి. మా పేరు పక్కన 'కురుమ' అని గర్వంగా పెట్టుకునే హక్కు మాకు ఉంది" అంటూ నాయకులు స్పష్టం చేశారు.కురుమల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమిస్తామని, తమ కుల గుర్తింపును ఎవరూ మార్చలేరని నాయకులు హెచ్చరించారు. రాజకీయ పార్టీలు కురుమ సమాజం డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు.

## నిజాంపేట్‌లో చెత్త సమస్య పై బీఆర్ఎస్ నేతల ఆందోళన



**నిజాంపేట్, సెప్టెంబర్ 6,(వుదయం ప్రతినిధి ),**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో డీజిల్ లేక చెత్త వాహనాలు నిలిచిపోవడంతో పారిశుధ్య సమస్య తీవ్రంగా మారిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించక

పోవడంతో దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు చెత్తను సేకరించి నిజాంపేట్ సర్కిల్ కార్యాలయం ముందు వేసి నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించి కాలనీల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జీహెచ్ఎంసీలో విలీనమైన తర్వాత నిజాంపేట్ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ఎన్నిసార్లు ఫోన్ చేసినా కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్, నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్పందించడం లేదని ఆరోపించారు. ప్రజలకు కనీస పారిశుధ్య సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం,

అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు.గతంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఏదైనా సమస్యపై ట్వీట్ చేస్తే 15 నిమిషాల్లోనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకునేవారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి వద్దే మున్సిపల్ శాఖ ఉన్నప్పటికీ సమస్యలను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.

నిజాంపేట్ లో మున్సిపల్ శాఖ అధికారులు బలహీన వర్గాల మీద తమ ప్రతాపం చూపించడం కాకుండా, కాలనీల్లో పేరుకుపోతున్న చెత్త, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీరు వంటి ప్రజల మౌలిక సమస్యలపై దృష్టి పెట్టాలని, పారిశుధ్య సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం

అని హెచ్చరించారు.

### 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై

## బీఆర్ఎస్ నేత ఎం.ఎన్. శ్రీనివాస్ ఫైర్

- హామీల అమలులో కాంగ్రెస్ విఫలం.. ప్రజలను మోసం చేసింది: ఎం.ఎన్. శ్రీనివాస్

**ముషీరాబాద్, సెప్టెంబర్ 06 (వుదయం)**




ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.ఎన్. శ్రీనివాస్ తీవ్రస్థాయిలో విమర్శించారు. దోమల్‌గూడ పూల్‌బాగ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై మండిపడ్డారు.100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. దాదాపు 1000 రోజుల పాలనలో కూడా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. సంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టి ప్రతిపక్ష నేతలపై విమర్శలు చేయడానికే ప్రభుత్వం పరిమితమైందని అన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగరంలో చేపట్టిన అభివృద్ధి, మౌలిక వసతులు, విశ్వనగర ప్రతిష్ఠను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రస్తుతం నగరంలో నేరాలు, అత్యాచా పోరాడిన కేసీఆర్‌పై విమర్శలు చేయడం మానేసి, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పిన తర్వాతే రాజకీయ విమర్శలు చేయాలని సూచించారు."కేసీఆర్ తన కోసం తెలంగాణ సాధించలేదు.. ప్రజల కోసం పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు" అని ఎం.ఎన్. శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడే భాషపై ప్రజల్లో అసంతృప్తి ఉందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పెట్టి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలని హితవు పలికారు.రానున్న రోజుల్లో బీఆర్ఎస్ మరింత బలపడుతుందని, కేసీఆర్ నాయకత్వంలో పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల హామీలను విస్మరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఎం.ఎన్. శ్రీనివాస్ హెచ్చరించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఉద్యమకారుడు కల్వ గోపీ, సీనియర్ నాయకులు నారాయణ్, జి. విట్టల్, బాలేకరి రాములు, బండ జుగేందర్, బాలేకరి రమేష్, ఆటో శ్రీను, సుధాకర్, మధు, శివ, గాసన్ వెంకటేష్, టి. సంతోష్, పాస్‌పోర్ట్ శ్రీను, రమణ, సూరి తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్‌ను విమర్శించే

## నైతిక హక్కు కూన శ్రీశైలం గౌడ్‌కు లేదు



- మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్

**బాచుపల్లి, సెప్టెంబర్ 6,(వుదయం ప్రతినిధి ),**

ప్రజల కోసం పోరాడుతున్న నాయకుడిపై చౌకబారు ఆరోపణలు మానుకోవాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ అన్నారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కూన శ్రీశైలం గౌడ్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన రాజకీయ జీవితాన్ని అంకితం చేసి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ పై విమర్శలు చేసే ముందు కూన శ్రీశైలం గౌడ్ తన రాజకీయ ప్రస్థానాన్ని, ప్రజల కోసం తాను చేసిన సేవలను ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని ధనరాజ్ యాదవ్ సూచించారు.

కేసీఆర్‌ను ప్రజల నుంచి దూరం చేయడం ఎవరి వల్లా కాదని, కేసీఆర్ ప్రజలకు దూరంగా ఉన్నారని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని ఆయన అన్నారు.

తెలంగాణ ప్రజల హృదయాల్లో కేసీఆర్ కు ఉన్న స్థానం ఏమిటో ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు.

### ఇందిరాపార్క్ మహా ధర్నాలో

## శంకర్ పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు

- కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్

**శంకర్‌పల్లి సెప్టెంబర్ 06 (వుదయం)**



మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన భారీ మహా ధర్నాలో శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకటరెడ్డి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మడపకు చంద్రమౌళి పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు శంకర్‌పల్లి మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మహా ధర్నాకు హాజరై పార్టీ నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులతో ఇందిరాపార్క్ పరిసరాలు సందడిగా మారాయి.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేగా, ప్రతిపక్ష నేతగా తన బాధ్యతలను నిర్వర్తించాల్సిన కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడకుండా పదవిలో కొనసాగడం సరికాదని పేర్కొంటూ, కేసీఆర్ వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

మహా ధర్నాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శంకర్పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొల్లారం వెంకటరెడ్డితో శంకర్‌పల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.i కార్యక్రమంలో సంకేపల్లి గోపాల్,డి.సి.సి. గోపాల్ రెడ్డి,శంకర్ పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి ,గోపులారం సర్పంచ్ రవీందర్ రెడ్డి, గోపులారం మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్,రావులపల్లి కలాన్ సువర్ణ కృష్ణ మూర్తి,ఉపసర్పంచ్ ,వెంకట్ రెడ్డి,అలకంగూడ మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి,టంగుటూరు సర్పంచ్ కృష్ణ రెడ్డి,టంగుటూరు ఉపసర్పంచ్,గోపులారం మాజీ ఎంపిటీసీ సత్యనారాయణ రెడ్డి,టంగుటూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,శంకర్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యకులు బొల్లారం ప్రశాంత్ రెడ్డి, మొకిల విలేజ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గండ్ర సత్యం,పాల్గొనారు.

### శంకర్ పల్లి మండలం ప్రొద్దుటూరు

## గ్రామంలో ఇంటెన్స్ రివిజన్..



- .పాల్గొన్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్..

**శంకర్ పల్లి సెప్టెంబర్ 06 (వుదయం)**

శంకర్ పల్లి మండలం పొద్దుటూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక ఇంటెన్స్ రివిజన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఎస్ ఐ ఆర్ కు సంబంధించి ప్రత్యేక హియరింగ్ కార్యక్రమాన్ని ఎంపీడీవో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండ లక్ష్మీ నరసింహ, గ్రామపంచాయతీ కార్యదర్శి, సంబంధిత బి ఎల్ ఓ లు పాల్గొన్నారు. ఎస్ ఐ ఆర్ నమోదుకు సంబంధించి జారీ చేసిన నోటీసులపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉష
ఉదయం సాహిత్యం

# ఓ మనిషీ ఎవరు నీవు..?

ఓ మనిషీ ఎవరు నీవు..?
తెలుసుకో...తెలుసుకో
ముందు తెలుసుకో...

నీవు కరుణామయుడివా?
కన్నీటి చుక్కలను ముత్యాలుగా
మార్చే సమతామమతా స్వరూపివా?

నీవు కనిపించక
కాటేసే కాలసర్పానివా?
చిరునవ్వు వెనుక విషదంతాల్ని
దాచుకున్న మాయా మృగానివా?

ఓ మనిషీ ఎవరు నీవు..?
ఓ మనిషీ ఎవరు నీవు..?
తెలుసుకో... తెలుసుకో
ముందు తెలుసుకో

నీవు ఆపద్బాంధవుడివా?
నీవు అనాధ రక్షకుడివా...?
ఆపదలో అండగా
నిలిచే ఆత్మీయుడివా?

నీవు ఆశ్రయంలేని అనాధల్ని
అక్కున చేర్చుకునే అభయదాతవా?
ఆపన్న హస్తాల కోసం
ఎదురుచూసే ఆశాజీవివా...?
ఓ మనిషీ ఎవరు నీవు..?
ఓ మనిషీ ఎవరు నీవు..?
తెలుసుకో...తెలుసుకో...
ముందు తెలుసుకో


నీవు ఆస్తిపరుడివా...?
అంతులేని ధనదాహంతో
అంతరంగాన్ని
కోల్పోయిన అజ్ఞానివా..?

నీవు తిన్నది
అరగని కోటీశ్వరుడివా...?
కడుపు నిండినా
కరుణేలేని కాఠిన్యపు ఖైదీవా?
ఓ మనిషీ ఎవరు నీవు..?
ఓ మనిషీ ఎవరు నీవు..?
తెలుసుకో...తెలుసుకో
ముందు తెలుసుకో

నీవు ఆకలికి అలమటించే
అస్థిపంజరానివా...?
ఒక్క ముద్ద కోసం మానవత్వపు
తలుపులు తట్టే ఆకలి ప్రతిమవా?

నీవు సంసారివా... సన్యాసివా...?
బంధాల మధ్య బ్రతుకుతున్నావా?—
బంధనాల్ని దాటి
బ్రహ్మచైతన్యం వెదుకుతున్నావా?

నీవు బహుదూరపు బాటసారివా...?
గమ్యమెరుగక
యాతనపడే యాత్రికుడివవా..?
నీవు నాయకుడివా...
అనుచరుడివా?
నీవు విద్యార్థివా... గురుదేవునివా?



నీవు అక్షరాలకు
ఊపిరినిచ్చే కవివా..?
కళాపోషకుడివా?
లేక కళలకు కరతాళ
ధ్వనులు చేసే రసికుడివా?
నీవు బృహత్ గ్రంథాల
రచయితవా...లేక పాఠకుడివా?

నీవు వేదపండితుడిగా...?
వేదాలలోతు తెలిసిన జ్ఞానజ్యోతివా..?
లేక వెర్రి వెంగళప్పవా...? ఎవరు
నీవు...?

నీవు నటుడివా... దర్శకుడివా...?
నీవు యజమానివా... బానిసవా...?

నీవు నీరువా...? నిప్పువా...?
చిగురింపజేస్తావా—చిదిమేస్తావా?

నీవు నిజానివా...! అబద్ధానివా...?
నీ మాట సత్యమా ఆణిముత్యమా
లేక మాయమాటల మసక అద్దమా?
నీవు రాతికి ప్రతిరూపానివా...?
నీతికి నిజాయితీకి నిదర్శనమా..?

నీవు కొంపలు కాల్చి కూల్చే
కోతివా...?
నీడలా నడిచే నీ నిజాయితీకి
నీవే నిత్య సంతకం కావాలి!

నీవు భక్తుడివా...?
భగవంతునికి ప్రతిరూపానివా...?
జీవిని ప్రేమించే ప్రతి హృదయంలో
దైవత్వం దివ్యదీపమై వెలుగుతుంది!



పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

## ఉప్పెనై రావాలి...

వాన కురవలేదు
కప్పల పెళ్లి చేస్తుండ్రు
ముత్యాలమ్మకి
మొక్కుతుండ్రు
మౌఢ్యం శాస్త్రానికి
తూగదు
నూటెనిమిది నోటి
వాక్కులతో
సానుకూల తరంగాలే
సృష్టించబడితే
'అన్నమో రామచంద్రా'
ఆర్తనాదాలతో
ఉప్పెనలే రావాలిగా!

పదకొండు గుండాల్లో
ప్రజాధనాన్ని పోసి
మబ్బును మభ్య పెట్టే
యాగానికి
పూనుకున్నాడు ఏలిక
ఇంధనం లేక జనం విలవిల
కట్టెలు రేపు మండుతాయి
గుండాల్లో
పాడి లేక ఊరు


బక్కచిక్కింది
ఆజ్యం మంటకు
తోడై ఉవ్వెత్తున
ఎగుస్తుంది
పౌష్టికాహారం కొరవడి
అచేతనంలో బాల్యం
గుమ్మడికాయలు
పగులుతాయి విరివిగా
కట్టుకునే బట్ట లేక ఎందరో
పట్టు వస్త్రాలు అగ్నికి
ఆహుతి అవుతుంటే
నిశ్చేష్టులై చూడాలంతే!

పెట్టుబడికి చెట్టు కొండ
గుట్ట అర్పించాక
వాన ఎట్లు కురియు?
నల్లని ఆవులు నల్లని
ధోవతులు
నల్లని మబ్బులను
ఏమార్చుతాయనే
నమ్మికలో
జనాన్ని ఏమార్చే
ప్రజాస్వామ్యమా,
జోహార్లు!

# వాస్తవిక జీవితానికి ప్రతీక.. లంద...

జీవితంలో నుండే కథలు పుడతాయి. డా.పొన్నాల బాలయ్య రచించిన 'లంద'నవలలో మూడు తరాల మాదిగల జీవితం ఉంది. సమాజంలో వారు ఎట్లా బతికిండ్రు వారి జీవన విధానం ఏమిటి? అనేది సవివరంగా తెలిపిన నవలఇది.కాలానుగుణంగా తమను తాము మార్చుకోవాలన్న తపన సందేశం ఈ నవల మొత్తంలో కనిపిస్తుంటుంది. లంద అనే పేరుకు అర్థం ఏమిటన్నది నవల చదివితేనే తెలిసింది. జంతు చర్మాన్ని నానబెట్టే గోళాన్ని లంద అంటారు. తోలును మెత్తగా చేయడానికి, శాగవారిన టేకుచెక్కలాంటి రంగు రావడానికి, నీసు వాసన పోవడానికి వెనుక ఎంత పెద్ద ప్రక్రియ దాగుందో, ఎంత శ్రమచేస్తారో తెలుస్తుంది. ఇదొక ప్రయోగశాల. వివిధ వృత్తుల వారికి వినియోగపడే వస్తువులను చేసే ఉత్పత్తి కేంద్రం. తమ కుల ఆస్తిత్వ చిహ్నమైన 'లంద'ను లోకానికి పరిచయం చేయడం, తమ జాతి సాంస్కృతిక ఔన్నత్యాన్ని ఎలుగెత్తి చాడటం, సామాజిక చైతన్యం, తమ వాస్తవిక జీవనాన్ని ప్రతిబింబించడం తన వంతు బాధ్యతగా రచయిత ఎత్తుకున్నాడు.ఇక నవలలోని కథ – రామయ్య, బొందయ్య, అజయ్ ముగ్గురు మూడు తరాలకు ప్రతినిధులు. రామయ్య ఏ మార్పు లేకుండా తన జీవితంలో తాను ఒదిగిపోయిండు. సచ్చిన ఎద్దును మోస్తున్నప్పుడు ఎద్దు బరువుకు యాష్టపడి "ఈ మోసుడు పాడుగాను ఎన్ని తంతెలైనా తప్పక పాయెరా!" అని గుణుగుతాడు.

ఎల్లవ్వ "గడియ రికావులేదు గవ్వ కూడేసింది లేదాయే! అన్ని పాత పొక్కలేనాయే! ఈ కట్టం పాడుగాను ఈ బతుకు నాశిడెంగాను" అని బాధతో కుమిలిపోతుంది. కష్టాలు తీరుతాయని కొమరెల్లి జాతరకు పోతే అక్కడ కుల మడిగి అంటొద్దు ముట్టొద్దు అని ఆంక్షలు పెడతారు. అక్కడ ఒంటిమీదికి దేవుడొచ్చి, అగ్గిగుండంలోకి దిగిన కొడుకు బొందయ్యను పొట్టుపొట్టుగా సచ్చేట్టు కొడతారు. బొందయ్య పుట్టుకే కష్టంపుట్టుక .చచ్చిపోయి పుట్టాడని బొందతవ్వి పెట్టగానే ఏడుపు లంకించుకుంటడు. అందుకే బొందయ్య అని పేరు. సాహసవంతుడిగా పనిమంతుడుగా పెద్ద జీతగానిగా ఎదిగిండు. ఇతని జీవితమంతా సంఘర్షణే.కమ్యూనిస్టులను రాత్రుల్లో కలుస్తున్నాడని,సంఘంతో సోపతి ఉందని తెలిసి, దొర మనుషుల్ని పంపిస్తే,వారిని కొట్టి తప్పించుకొని భయంతో బొంబాయికి పారిపోతాడు. భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తూ, అక్కడ అంబేద్కర్ పోరాటాల గురించి విని ఉత్తేజితు డవుతాడు. అంబేద్కర్ లేబర్ సంఘం పెట్టి కూలీల కష్టాలు





చూస్తూ, న్యాయం ధర్మం కోసం పనిచేస్తుంటాడు.

అయితే అక్కడ కూడా కష్టాలే పలకరించి, చేదు అనుభవాలతో ఇక బతకలేని పరిస్థితిలో మళ్లీ ఊరికి తిరిగి వస్తాడు. లందగోలం కాడ మాదిగ పిల్లలతో బతుకమ్మలు ఆడిస్తాడు. జ్ఞానం లేకనే మనం ఇట్లా అయ్యామని, మన పిల్లలనన్నా బాగా చదివించుకోవాలని చెప్పే అతను నడీడులోనె మరణించాడు. బొందయ్య భార్య ఈరవ్వ మూడు తరాల కష్టాలను నష్టాలను చూసింది మోసింది. బొందయ్య చిన్న కొడుకు అజయ్ పెద్దవాడై, దళిత ఉద్యమంతో ప్రభావితుడై, తనకంటూ గుర్తింపును తెచ్చుకున్నాడు. విద్యార్థి నాయకుడిగా జేఏసీని ఏర్పాటు చేసి, తెలంగాణ ఉద్యమంలోనూ పాల్గొన్నాడు. బస్వాపూర్ లో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ. యూనివర్సిటీలో బీఫ్ ఫెస్టివల్ నిర్వహించడం అజయ్ సాధించిన విజయాలు. చైతన్యవంతమైన నేటితరం అజయ్ జీవితం కొనసాగుతూ ఉంది ఇదీ కథ. ఈ నవల కేవలం బాధలను కష్టాలను మాత్రమే ఏ కరువు పెట్టలేదు. ప్రకృతి పరిసరాలు, ఆటలుపాటలు, పెండ్లి, చావు, పండుగలు, విందులు, జాతరలు పూజలు ఏది విడిచిపెట్టకుండా రచయిత ఆయా సన్నివేశాలకు తగిన జానపద పాటలను కూడా చేర్చి శిల్పవంతంగా కళ్ళకు కట్టేలా వివరించాడు.

ఈ నవలలో భాష కూడా ప్రత్యేకమైనదే! తెలంగాణ భాష ముఖ్యంగా మాదిగ వాడల జీవద్భాషలో రచన ప్రవాహంలా సాగిపోతుంది. డక్కలి, నుల్కసందయ్యల పుట్టుక గురించిన కథలు ఆసక్తికరంగా ఉన్నాయి. నవలలో మరో ఆకర్షణ అందమైన వర్ణనలు.ఉల్లాకు కొత్తిమీర ఏసి పెట్టిన ఎండుతునకల దప్పడాన్ని రచయిత ఎంతో రుచికరంగా వర్ణించాడు. బొందయ్య పెండ్లి సందడి ఎంత రమ్యంగా ఉందో, బొందయ్య చనిపోయినప్పుడు ఆ ఏడుపులు అంత ఆర్ద్రతగా హృదయాలు ద్రవించేట్టుగా వర్ణించాడు. వాగువర్ణన చూడండి. "మొస మొస మొసపోసుకుంట, నుర్గులు కక్కుంట, నాగుపాము నడివంకలు కొడవలి పిడివంకలతోటి ఆ వొడ్డు ఈ వొడ్డు పట్టుకొని సుడులు తిరుగుకుంట పడమటి దిక్కు వురికురికి పోటెత్తి పారుతుంది మోయ తుమ్మెద వాగు"

ఆయా సందర్భాలలో ఒదిగిపోయిన సామెతలు పదబంధాలు కూడా నవలకు మరింత బలాన్నిచ్చాయి. మచ్చుకు ఒకటి రెండు – గమ్మొండ్లింటికి పోయిన మనిషి మాదిగింటికి పోయిన కుక్క జల్ది రావంటరు/ సన్నాయి లేని పెండ్లి చేయరాదు ఆడపిల్లలేని సావు సావరాదు/ గోసిల పాపము పెట్టుకొని కాశికి పోతేంది!/పని పాతర పెట్టి ఎటో జాతర పోయినట్టు/లంద నవల పూర్తిగా మాదిగల జీవితాన్నే తెలుపుతున్నప్పటికీ, అణగారిన వర్గాల సమిష్టి అనుభవాలకు ఇది ప్రతీక. రచయిత తన అనుభవాలతో ఈ నవలను బలమైన స్వచ్ఛమైన ఒక సాంస్కృతిక జీవన కథగా మలిచారు. రచయిత కృషికి అభినందనలు.

# సాహిత్యం సమాజానికి అద్దం మాత్రమే కాదు.. మార్పునకు ఆయుధం!

తెలంగాణ నేల నుంచి వినిపించే అక్షర స్వరం.. ప్రజల జీవితాల నుంచి పుట్టిన సాహిత్య చైతన్యం సాహిత్యం అంటే పదాలను అందంగా పేర్చడం కాదు.. ఒక కాలాన్ని, ఒక సమాజాన్ని, ఒక మనిషి అంతరంగాన్ని అక్షరాల్లో భద్రపరచడం. ఒక కథలో ఒక కుటుంబం కనిపించినా.. దాని వెనుక ఒక సామాజిక వాస్తవికత ఉంటుంది. ఒక కవితలో ఒకరి ఆవేదన వినిపించినా.. దాని వెనుక ఒక తరపు అనుభవం ఉండవచ్చు. అందుకే సాహిత్యం సమాజానికి అద్దం మాత్రమే కాదు.. అవసరమైనప్పుడు ప్రశ్నించే స్వరం, చైతన్యాన్ని రగిలించే శక్తి, మార్పుకు దారి చూపించే సాధనం. తెలంగాణ సాహిత్యం.. నేల నుంచి పుట్టిన స్వరం తెలంగాణ సాహిత్యానికి పల్లె జీవితం ఒక ముఖ్యమైన జీవన మూలం. చెరువు, చేనులు, కూలీ జీవితం, పండుగలు, జాతరలు, కుటుంబ సంబంధాలు, సామాజిక అసమానతలు, ప్రజా ఉద్యమాలు.. ఇవన్నీ సాహిత్యానికి వస్తువులయ్యాయి. తెలంగాణ సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఈ నేల చరిత్రను, ప్రజల జీవన విధానాన్ని, స్థానిక భాషా సంపదను కూడా అర్థం చేసుకోవాలి.

**సురవరం ప్రతాపరెడ్డి.. చరిత్రకు అక్షర రూపం**

తెలంగాణ సాహిత్య చరిత్రను మాట్లాడేటప్పుడు సురవరం ప్రతాపరెడ్డి కృషిని ప్రత్యేకంగా గుర్తించాలి. సాహిత్యం, చరిత్ర, సామాజిక పరిశీలనలను అనుసంధానించిన ఆయన కృషి తెలంగాణ సమాజపు స్వీయ అవగాహనకు బలమైన పునాది వేసింది. ఒక ప్రాంత చరిత్ర అంటే కేవలం రాజులు, రాజకీయ సంఘటనలు మాత్రమే కాదని.. సాధారణ ప్రజల జీవితం, ఆచారాలు, సంస్కృతి, సామాజిక వ్యవస్థలు కూడా చరిత్రలో భాగమేనని ఆయన పరిశోధనా దృష్టి తెలియజేస్తుంది.

**వట్టికోట ఆళ్వారుస్వామి.. ప్రజా జీవితానికి అద్దం**


వట్టికోట ఆళ్వారుస్వామి రచనల్లో తెలంగాణ సమాజంలోని వాస్తవికత, పేద ప్రజల జీవితం, సామాజిక అసమానతలు, అణచివేతకు గురైన వర్గాల అనుభవాలు ప్రతిఫలిస్తాయి. ఆయన రచనా ప్రత్యేకత ప్రజల జీవితాలను దూరం నుంచి చూడకుండా.. వారి మధ్యనుంచి కథను నిర్మించడంలో ఉంది. అందుకే ఆయన రచనలు ఒక కాలపు సామాజిక పరిస్థితులకు సాహిత్య సాక్ష్యాలుగా కూడా నిలుస్తాయి.

**కాళోజీ.. ప్రజల భాషలో ప్రజల మనసు**

తెలంగాణ సాహిత్యాన్ని ప్రజా చైతన్యంతో అనుసంధానించిన ప్రముఖ స్వరాల్లో కాళోజీ నారాయణ రావు ఒకరు. ఆయన రచనల్లో సాధారణ మనిషి, సామాజిక అన్యాయం, స్వేచ్ఛ, పౌరహక్కులు, మానవ గౌరవం వంటి అంశాలు బలంగా కనిపిస్తాయి. కాళోజీ ప్రత్యేకత ఆయన ఆలోచనలోనే కాదు.. ఆ ఆలోచనను ప్రజలకు దగ్గరైన భాషలో వ్యక్తం చేయడంలో ఉంది. సాహిత్యం పండితుల గదుల్లో మాత్రమే ఉండకూడదని, ప్రజల జీవితాల్లోకి వెళ్లాలని ఆయన రచనా స్వరం సూచిస్తుంది.

**దాశరథి.. కవిత్వంలో ప్రతిఘటన, ఆత్మగౌరవం**

దాశరథి కృష్ణమాచార్యులు తెలంగాణ కవిత్వంలో స్వేచ్ఛ, ఆత్మగౌరవం, ప్రతిఘటనకు బలమైన స్వరం ఇచ్చిన కవి. ఆయన రచనల్లో కవిత్వం కేవలం సౌందర్యానుభూతికి పరిమితం కాకుండా..





సమాజంలోని అన్యాయాన్ని ప్రశ్నించే సాధనంగా మారుతుంది. ప్రజల ఆకాంక్షలకు భాష ఇవ్వడం, అణచివేతకు వ్యతిరేకంగా నిలబడటం, మార్పు కోసం స్పందించడం ఆయన కవిత్వంలోని ప్రధాన లక్షణాలుగా కనిపిస్తాయి.

**దాశరథి రంగాచార్య.. పల్లె జీవితం సాహిత్యంగా మారినప్పుడు**

దాశరథి రంగాచార్య రచనల్లో తెలంగాణ గ్రామీణ సమాజం, పేద ప్రజల జీవితం, సామాజిక నిర్మాణం, ఆచారాలు, మారుతున్న కాలం వంటి అంశాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఆయన రచనల్లో పల్లె కేవలం కథకు నేపథ్యం కాదు.. కథలోనే ఒక ప్రధాన పాత్రగా మారుతుంది. గ్రామీణ ప్రజల భాష, జీవన విధానం, సామాజిక సంబంధాలను సహజంగా సాహిత్యంలోకి తీసుకురావడం ఆయన రచనలకు ప్రత్యేకతను ఇచ్చింది.

**అంపశయ్య నవీన్.. మారుతున్న మనస్తత్వానికి ప్రతిబింబం**

అంపశయ్య నవీన్ రచనల్లో వ్యక్తి అంతర్మథనం, యువతలోని సంఘర్షణ, మధ్యతరగతి మనస్తత్వం, సామాజిక మార్పుల ప్రభావం వంటి అంశాలు కనిపిస్తాయి. దీనితో తెలంగాణ సాహిత్యం పల్లె జీవితం, సామాజిక పోరాటాలకే పరిమితం కాకుండా.. వ్యక్తి అంతరంగంలోని సంఘర్షణలను కూడా తన పరిధి లోకి తీసుకుంది. సమాజం మారిన కొద్దీ సాహిత్యం అడిగే ప్రశ్నలు కూడా మారుతాయని ఆయన రచనా ప్రపంచం సూచిస్తుంది.

**అలిశెట్టి ప్రభాకర్.. నగర జీవితపు మరో ముఖం**

తెలంగాణ ఆధునిక కవిత్వంలో అలిశెట్టి ప్రభాకర్ వంటి కవుల రచనలు నగర జీవితం, సామాన్య మనిషి అనుభవాలు, ఆధునిక జీవన ఒత్తిళ్లు, సామాజిక వ్యంగ్యం వంటి అంశాలకు ప్రత్యేక వ్యక్తీకరణను అందించాయి. తెలంగాణ సాహిత్యం అంటే కేవలం పల్లె, జానపదం మాత్రమే కాదని.. హైదరాబాద్ వంటి నగరాల విస్తరణతో వచ్చిన కొత్త జీవన విధానాలు కూడా సాహిత్య వస్తువులవుతాయని ఈ ధోరణి చూపించింది.

**గద్దర్.. పాట ప్రజా స్వరంగా మారినప్పుడు**

తెలంగాణ సాంస్కృతిక చైతన్యాన్ని చర్చించేటప్పుడు గద్దర్ పేరు ప్రత్యేకంగా నిలుస్తుంది. ఆయన గేయాల్లో శ్రమజీవుల జీవితం, సామాజిక అసమానత, నిరసన, మార్పు ఆకాంక్ష వంటి అంశాలు ప్రజా ప్రదర్శనతో కలిశాయి. పాటను కేవలం వినోదంగా కాకుండా ప్రజా చైతన్యానికి సాధనంగా ఉపయోగించిన ఆయన సాంస్కృతిక ప్రయాణం సాహిత్యం పుస్తకపు పుటలను దాటి ప్రజల మధ్య ఎలా జీవించగలదో చూపించింది.

**బతుకమ్మ పాట.. మహిళల మౌఖిక సాహిత్య సంపద**

తెలంగాణ సాహిత్యాన్ని రచయితల పేర్లతో మాత్రమే అర్థం చేసుకోవడం అసంపూర్ణం. బతుకమ్మ పాటలు, జానపద గేయాలు, సామెతలు, పొడుపుకథలు, ఒగ్గు కథలు వంటి మౌఖిక సంపదలో ప్రజల అనుభవాలు తరతరాలుగా ప్రయాణించాయి. ముఖ్యంగా బతుకమ్మ పాటల్లో కుటుంబ జీవితం, ప్రకృతి, పుట్టింటి జ్ఞాపకాలు, సామాజిక సంబంధాలు, పండుగ సంస్కృతి వంటి అనేక అంశాలు కనిపిస్తాయి. ఇక్కడ రచయిత ఒక వ్యక్తి కాకపోవచ్చు.. ఒక సమాజమే సృష్టికర్తగా ఉంటుంది.

**తెలంగాణ మాండలికం.. యాస కాదు, జీవన చరిత్ర**

తెలంగాణ మాండలికంలోని స్థానిక పదాలు, సామెతలు, పలుకుబడులు, వృత్తి పదజాలం ఈ నేల జీవన విధానాన్ని మోసుకెళ్తున్నాయి. ఒక ప్రాంతపు పాత్ర తన సహజ భాషలో మాట్లాడినప్పుడు ఆ పాత్ర మరింత నిజమైనదిగా అనిపిస్తుంది. అందుకే మాండలికాన్ని తక్కువ స్థాయి భాషగా చూడటం సరికాదు. అది ఒక ప్రాంతపు సామాజిక అనుభవానికి భాషా రూపం. ఒక స్థానిక పదం కనుమరుగైతే.. దాని వెనుక ఉన్న జీవన సందర్భం కూడా మసకబారే అవకాశం ఉంది.

**ఒకే తెలంగాణ కాదు.. అనేక తెలంగాణలు**

తెలంగాణ సాహిత్యాన్ని ఒకే నిర్వచనంలో బంధించలేం. కాళోజీలో ప్రజా చైతన్యం కనిపిస్తుంది. దాశరథిలో ప్రతిఘటన, ఆత్మగౌరవం కనిపిస్తుంది. సురవరం రచనల్లో చరిత్ర, సామాజిక పరిశీలన కనిపిస్తాయి. వట్టికోటలో సామాజిక వాస్తవికత బలంగా కనిపిస్తుంది. దాశరథి రంగాచార్య రచనల్లో గ్రామీణ జీవితం సజీవమవుతుంది. అంపశయ్య నవీన్ రచనల్లో వ్యక్తి అంతర్మథనం, ఆధునిక సమాజపు సంఘర్షణలు కనిపిస్తాయి. అలిశెట్టి ప్రభాకర్ కవిత్వంలో నగర అనుభవానికి ప్రత్యేక స్వరం కనిపిస్తుంది. గద్దర్ గేయాల్లో ప్రజా చైతన్యానికి ఉద్యమ స్వరం వినిపిస్తుంది. ఈ భిన్నత్వమే తెలంగాణ సాహిత్యానికి అసలైన సంపద.

**కొత్త తరం.. కొత్త కథలు**

నేటి తెలంగాణలో కూడా అనేక కొత్త సాహిత్య వస్తువులు పుట్టుకొస్తున్నాయి. గ్రామాల నుంచి నగరాలకు వలసలు, రైతుల మారుతున్న జీవితం, మహిళల విద్య–ఉద్యోగ అనుభవాలు, యువత డిజిటల్ జీవనం, హైదరాబాద్ నగర విస్తరణ, మారుతున్న కుటుంబ సంబంధాలు, పర్యావరణ సమస్యలు, కొత్త మధ్యతరగతి ఆశలు.. ఇవన్నీ రాబోయే తరాల రచయితలకు ముఖ్యమైన అంశాలు. పాత సాహిత్యాన్ని గౌరవిస్తూ కొత్త జీవితాన్ని కూడా అక్షరాల్లో నమోదు చేయాలి.

**డిజిటల్ యుగం.. తెలుగు సాహిత్యానికి కొత్త అవకాశం**

డిజిటల్ ప్రపంచం సాహిత్యానికి సవాలు మాత్రమే కాదు.. గొప్ప అవకాశం కూడా. పాత పుస్తకాలను డిజిటలైజ్ చేయవచ్చు. అరుదైన జానపద గీతాలను రికార్డు చేయవచ్చు. వృద్ధ కళాకారుల అనుభవాలను భద్రపరచవచ్చు. స్థానిక పదజాలానికి డిజిటల్ నిఘంటువులు రూపొందించవచ్చు. యువత కథలు, కవితలు, పుస్తక పరిచయాలు, స్థానిక చరిత్రలను కొత్త మాధ్యమాల్లోకి తీసుకెళ్లవచ్చు. అయితే వేగం పెరిగినంత మాత్రాన ప్రతి వైరల్ వాక్యం సాహిత్యం కాదు. మంచి రచనకు ఆలోచన, అనుభవం, భాషపై పట్టు, పరిశీలన, బాధ్యత అవసరం.


**సంపాదకీయ నిర్ణయం**

తెలంగాణ సాహిత్యం ఒకే గొంతు కాదు.. అనేక గొంతుల సమ్మేళనం. అది పల్లె పాటలో ఉంది. బతుకమ్మ గేయంలో ఉంది. ఒగ్గుకథలో ఉంది. కాళోజీ ప్రశ్నలో ఉంది. దాశరథి ప్రతిఘటనలో ఉంది. సురవరం పరిశోధనలో ఉంది. వట్టికోట వాస్తవికతలో ఉంది. దాశరథి రంగాచార్య పల్లె ప్రపంచంలో ఉంది. అంపశయ్య నవీన్ అంతర్మథనంలో ఉంది. అలిశెట్టి ప్రభాకర్ నగర అనుభవంలో ఉంది. గద్దర్ ప్రజా గేయంలో ఉంది. రచయితల పేర్లను గుర్తుంచుకోవడం మాత్రమే సరిపోదు. వారి రచనల వెనుక ఉన్న కాలాన్ని, సమాజాన్ని, ఆలోచనను అర్థం చేసుకోవాలి. ఎందుకంటే ఒక రచయిత తన కాలాన్ని రాస్తాడు.. గొప్ప రచయిత తన కాలాన్ని ప్రశ్నిస్తాడు. ఒక కవి తన భావాన్ని వ్యక్తం చేస్తాడు.. ప్రజల భావానికి స్వరం ఇచ్చిన కవి తరాల జ్ఞాపకంలో నిలుస్తాడు. తెలంగాణ స్వరాలను చదవడం అంటే తెలంగాణను చదవడం. తెలంగాణను చదవడం అంటే ఒక సమాజపు జ్ఞాపకాలను చదవడం. ఆ జ్ఞాపకాలను నిలబెట్టడం అంటే తెలుగు సాహిత్యాన్ని మరింత సంపన్నం చేయడం. అక్షరం నిలిస్తే చరిత్ర నిలుస్తుంది. సాహిత్యం నిలిస్తే సంస్కృతి నిలుస్తుంది. ప్రజల స్వరం నిలిస్తే సమాజపు జ్ఞాపకం నిలుస్తుంది. కలం కదలాలి.. కొత్త కథలు పుట్టాలి.. పాత జ్ఞాపకాలు భద్రపడాలి.. తెలంగాణ నేల పలుకు తెలుగు సాహిత్యంలో నిరంతరం వినిపించాలి.



ఎం రవీందర్
7901503777

## ఇంద్రధనుస్సులు!



షాడో ప్రగతినీ సూడో
అభివృద్ధినీ

వంటింటి పత్రికల్లో వండి
వడ్డిస్తే

లొట్టలేసుకు తింటానికి వాళ్లేం

కరుడుగట్టిన ఫ్యూడల్
సమాజపు

వెట్టికి పుట్టిన చాకిరి పిట్టలేం
కాదు

తొక్కి పడేస్తే కుక్కిన పేనుల్లా

పడుండటానికి మన కాలపు

తోలు మందపు కీలుబొమ్మలూ
కాదు

వాళ్లు ఈతరం జెన్ ఆల్ఫా
తూనీగలు!

అప్పుడే పూసిన మందార
మొగ్గల్లా

ఇప్పుడిప్పుడే రాజుకుంటున్న
నిప్పు కణికలు!

మీ బిజీ షెడ్యూల్ ప్యాకేజీల
రహస్య

మంతనాల గుట్టు
పసికట్టలేకున్నా

మీ నట్టింటి చూరుకు
వేలాడుతూ

మీ భుజాలమీదెక్కి అల్లరిచేసే

కల్లా కపటం తెలియని బుల్లి
పిచ్చుకలు!

వాళ్లు అన్నీ చూస్తున్నారు

ఏ బడి మడిలో ఏ చదువుల
పంటకు

ఏ చీడ పడుతుందో

ఏ అధికార్ల ముందు అలిగి
కూర్చుంటే

ఏ చీడపీడ ఎలా
విరగడవుతుందో

వాళ్లు ఎక్కాలు వల్లించినంత
సులభంగా

గుక్కతిప్పుకోకుండా
చెప్పేయగలరు

ఇంతకీ వాళ్లు ఏం
అడుగుతున్నారు!

మీ కార్లూ, మీ బంగ్లాలూ

మీ బోషాణపెట్టెల్లోని కరెన్సీ
కట్టలూ కాదు కదా!

మీ సుఖమయ గమనానికి

అనువైన విమానాశ్రయాలో

సీడ్ యాక్సెస్ రోడ్లో, స్టీల్
బ్రిడ్జిలో కాదు కదా

బతుకు పాఠాల అన్వేషణలో

నిత్యం నింగిని చీల్చుకుంటూ

రెక్కలు తెగేలా ఎగురుతున్నా

అందనంత దూరానికి
విసిరేయబడ్డ

చదువుల తీరాలను తిరిగి మళ్లీ

తమ దరికి చేర్చమంటున్నారు

రాళ్లూ రప్పల మధ్య బురద
కాల్వల్లో

ఈదులాడుతూ సాగాల్సి
వస్తున్న

అధ్వాన్నపు అక్షర దారుల్ని

కాస్త కాంక్రీట్ పోసి
సరిచేయమంటున్నారు

తరగతి గదుల్లో దాహార్తిని తీర్చే

నిర్మలమైన నీటి వసతుల్నీ

ఆరోగ్యకరమైన విసర్జన శాలల్నీ
నిర్మించి

మానసిక బుద్ధి కుశలతతో
పాటు

దైహిక శుద్ధి సఫలతనూ

సమకూర్చమంటున్నారు

బుల్లి పిచ్చుకలవన్నీ బుల్లి బుల్లి
కోర్కెలే కదా!

అవి కూడా అలక్ష్యానికి గురైతే

ఆగ్రహించకేం చేస్తారు!

అదిగో...! కుంభవృష్టిని సైతం

లెక్కచేయని దున్నపోతుల్ని

తోక మెలిదిప్పి
రంకెలేయించగల

జెన్ జీ యువత కూడా
రంగంలోకి దిగింది

చూస్తోంటే రంగురంగుల
ఇంద్రధనుస్సులు

ఎక్కడో గగనతలమ్మీద కాదు

ఇక్కడే మన బోధనాశాలల

ఇంటికప్పుల మీదే

వెల్లివిరుస్తాయన్న ఆశ
అంకురిస్తోంది!



# జాతీయం-అంతర్జాతీయం



## భవాని బోంపెల్లికి నేషనల్ టీచర్ అవార్డు

- **సులభతర బోధన పద్ధతులకు వరించిన పురస్కారం**
- **ఢిల్లీలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అందజేత**
- **సమాన అవకాశాల సాకారానికి విద్యే ప్రధాన సాధనం**
- **రాష్ట్రపతి వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 06 (ఎ.ఎం.ఎస్):** తెలంగాణ కామారెడ్డికి చెందిన ఉపాధ్యాయురాలు భవాని బొంపెల్లి ప్రతిష్ఠాత్మకమైన 'నేషనల్ టీచర్స్ అవార్డు2026'ను అందుకున్నారు. చిన్నారులకు చదువును ఆనందంగా మార్చడంతో పాటు బాలికల భద్రతపై ఆమె వినూత్న పద్ధతుల్లో అవగాహన కల్పిస్తోన్న ఆమెకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డును అందజేశారు. మాజీ రాష్ట్రపతి సర్వే పల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా--- శనివారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఇందులో భాగంగా 27 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఆరు సంస్థల నుంచి మొత్తం 48 మంది టీచర్లు ఈ అవార్డులను అందుకున్నారు. కామారెడ్డి జిల్లా గాంధారిలోని ఎంపీపీఎస్ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా భవాని బొంపెల్లి సేవలందిస్తున్నారు. ప్రధానంగా చిన్నారులకు క్లిష్టమైన అంశాలను కూడా రైమ్స్, యాక్టివిటీస్, జోయ్ ఫుల్ లర్నింగ్ పద్ధతుల్లో(ప్లే అండ్ డిజిటల్) సులభంగా అర్థమయ్యేలా బోధించడం భవాని ప్రత్యేకత. ముఖ్యంగా ఆడ పిల్లల వ్యక్తిగత భద్రతకు సంబంధించిన 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్' అంశాన్ని చిన్నారులకు భయం కలిగించకుండా పాటలు, రైమ్స్‌తో అవగాహన కల్పించే ప్రయత్నం ప్రత్యేక గుర్తింపు పొందారు.

గణితాన్ని, అచ్చులుహల్లులు, ఇతర అంశాలను భవాని ఇన్నోవేషన్ పద్ధతిలో బోధిస్తున్నారు. ఎడ్యుకేషన్ వీడియోస్‌తో పాఠాలు చెప్పే ఆమె, 'యూట్యూబ్ పంతులమ్మ' గానూ గుర్తింపు పొందారు. మండల, జిల్లా స్థాయిల్లో గుర్తింపు పొందడంతో పాటు 2025లో తెలంగాణ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని భవాని అందుకున్నారు. హైదరాబాద్ ప్రొఫెసర్ కీర్తి చంద్ర సాహు కు జాతీయ పురస్కారం తెలంగాణకు చెందిన ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ కీర్తి చంద్ర సాహు కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకున్నారు. అలాగే మంగళగిరి ప్రొఫెసర్ డాక్టర్ అరుణ్ బాబుకు పీడియాట్రిక్స్ విభాగంలో ఈ నేషనల్ అవార్డు వరించింది. కాగా.. నేషనల్ టీచర్స్ డే పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాసంస్థలు (హెచ్‌ఈఐ), పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 21 మంది అధ్యాపకులను కేంద్ర విద్యాశాఖ 'జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు2026 కు ఎంపిక చేసింది. ఇందులో కేంద్ర ఉన్నత విద్యాసంస్థల



నుంచి 12 మంది, రాష్ట్ర విశ్వవిద్యాలయాల నుంచి ఐదుగురు (మూడు ప్రభుత్వ, రెండు ప్రయివేట్ కళాశాలలు), పాలిటెక్నిక్ కళాశాలల నుంచి నలుగురికి (రెండు ప్రభుత్వ, రెండు ప్రయివేట్ కళాశాలలు) అవార్డులు ప్రకటించింది. కాగా--- తొలుత పాఠశాల ఉపాధ్యాయులకు మాత్రమే ప్రకటించిన ఈ వార్డులను--- 2023 తరువాత ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులను ప్రోత్సహించే ఉద్దేశంతో వీటిని విస్తరించారు.

రాజ్యాంగంలోని సమాన అవకాశాల సాకారానికి విద్యే ప్రధాన సాధనంః రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యాంగంలోని సమాన అవకాశాల ఆదర్శాన్ని సాకారం చేసుకోవడానికి విద్య అత్యంత ప్రభావవంత సాధనమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఉపాధ్యాయుల కృషితోనే ప్రాథమిక పాఠశాల డ్రాపౌట్ రేటు దాదాపు జీరో పడిపోయిందని అభినందించారు. నేషనల్ టీచర్స్ అవార్డ్ 2026 ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ప్రసంగించారు. విద్యా వ్యవస్థకు పాఠశాలలే విద్యా పునాదులని గుర్తు చేశారు. నాణ్యమైన విద్యతోనే అభివృద్ధి భారత్ సాధ్యమవుతుందన్నారు. దేశాభివృద్ధిలో వైద్యా నైపుణ్యం, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. విజ్ఞాన శక్తిగా ఎదగడంతో పాటు, భారత్ ను ప్రపంచ నైపుణ్య రాజధానిగా నిలపడం దేశ ప్రాధాన్యత అని పిలుపునిచ్చారు. జ్ఞానమే గొప్ప శక్తి వనరు అని నొక్కి చెప్పారు. విద్య మనకు స్వతంత్ర్యంగా ఆలోచించడానికి, సరైన నిర్ణ యాలు తీసుకోవడానికి, దేశ ప్రగతికి అర్థవంత మైందన్నారు. అంకింతభావం కలిగిన ఉపాధ్యా యులేదేశ నిర్మాణంలో ముందుంటారని అన్నారు. ప్రాథమిక తరగతి గదుల్లో--- పిల్లల మేధో, శారీరక, నైతిక వికాసంపై శ్రద్ధగా దృష్టి సారించడం ద్వారా, ఉపాధ్యాయులు భవిష్యత్ తరాలకు ఉత్తమ విద్యా ర్థులుగా, బాధ్యతాయుత మైన పౌరులుగా తీర్చిదిద్ద గలరన్నారు. మహిళల హక్కులు, విద్య పురోగతలో సావిత్రిబాయి పూలే పోషించిన కీలక పాత్రను రాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.



- **హెగ్‌సెత్‌తో విభేదాలే కారణం?**
- **ఇరాన్ తో యుద్ధం వేళ అమెరికా రక్షణశాఖలో కీలక పరిణామం**

## యూఎస్ ఆర్మీ సెక్రెటరీ డ్యాన్ డ్రిస్కోల్ రాజీనామా

**వాషింగ్టన్, సెప్టెంబరు 06 :** ఇరాన్‌తో యుద్ధం వేళ అమెరికా రక్షణ శాఖలో కీలక పరిణామం చోటుచేసుకుంది. యూఎస్ ఆర్మీ సెక్రెటరీ డ్యాన్ డ్రిస్కోల్ తన పదవికి రాజీనామా చేశారు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను కలిసి ఆర్మీ ప్రస్తుత పరిస్థితులను వివరించిన అనంతరం ఆయన తన రించినట్లు తెలిపారు.

ప్రస్తుతం అమెరికా సైన్యం ఇరాన్‌తో ఆరు నెలలుగా కొనసాగుతున్న సుదీర్ఘ పోరాటంలో తలమునకలై ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నత స్థాయి సైనిక అధికారులు వరుసగా వైదొలగడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే నేవీ సెక్రెటరీ జాన్ ఫెలన్ కూడా పలు లోని పలు కీలక విషయాలను నేరుగా వైట్ హౌస్‌తో, ముఖ్యంగా ఉపాధ్యక్షుడి కార్యాలయంతో చర్చిస్తుండేవారు. పీట్ హెగ్‌సెత్‌తో కాకుండా ఆయన నేరుగా ప్రభుత్వ పెద్దలతో సంబంధాలను కొనసాగించడం రక్షణ మంత్రికి నచ్చలేదని తెలుస్తోంది.

అలాగే, పెంటగాన్ నాయకత్వంపై కూడా హెగ్‌సెత్ తరచూ అనుమానాలు వ్యక్తం చేస్తూ వచ్చారు. మిలిటరీ అధికారుల విధేయతను శంకిస్తూ ఆయన తీసుకున్న నిర్ణయాలు డిపార్ట్‌మెంట్‌లో చిచ్చు పెట్టాయి. ఇందులో భాగంగానే, డ్రిస్కోల్‌కు అత్యంత సన్నిహితుడు, అప్పటి ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అయిన జనరల్ రాండి జార్జ్‌తో పాటు మరో ఇద్దరు జనరల్స్‌ను హెగ్‌సెత్ ఇటీవల పదవుల నుంచి తప్పించారు. తన సహచరుడి తొలగింపు డ్రిస్కోల్‌కు తీవ్ర మనస్తాపం కలిగించింది. ప్రభుత్వానికి ఉన్న అధికారాల రీత్యా తాను దానిని అంగీకరించాల్సి వచ్చిందని డ్రిస్కోల్ గతంలో పేర్కొన్నారు. ఈ పరిణామం తర్వాత ఇద్దరి మధ్య గ్యాప్ అంతకంతకూ పెరుగుతూ వచ్చినట్టు సమాచారం. డ్రిస్కోల్ రాజీనామాను వైట్ హౌస్ ధ్రువీకరించినప్పటికీ, అంతర్గత కలహాల గురించి ఎటువంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

రాజీనామా లేఖను సమర్పించినట్టు అంతర్జాతీయ మీడియా రాసుకొచ్చింది. ఒకవైపు ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు, మరోవైపు రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధం తీవ్రమవుతున్న వేళ అమెరికా ఆర్మీ చీఫ్ రాజీనామా అంశం చర్చనీయాంశంగా మారింది. మరోపక్క డ్యాన్ డ్రిస్కోల్ రాజీనామాను వైట్ హౌస్ ధ్రువీకరించింది. ఈమేరకు వైట్ హౌస్ ప్రతినిధి అన్నా కెల్లీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్మీలో రక్షణ సంసిద్ధతను పెంపొందించడంలో, సైనిక కార్యక్రమాలను విజయవంతం చేయడంలో డ్రిస్కోల్ అద్భుతమైన నాయకత్వాన్ని ప్రదర్శించారని కొనియాడారు. ప్రెసిడెంట్ ట్రంప్ 'మేక్ అమెరికా స్ట్రాంగ్ అగైన్' అనే ఎజెండాను ఆర్మీ విభాగంలో విజయవంతంగా అమలు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. అంతేకాక రష్యాఉక్రెయిన్ మధ్య శాంతి చర్చల్లోనూ ఆయన అమెరికా తరఫున కీలకంగా వ్యవహ విభేదాల కారణంగా తన పదవికి రాజీనామా చేయగా, తాజాగా డ్యాన్ డ్రిస్కోల్ నిష్క్రమణతో పెంటగాన్ వర్గాల్లో ఆందోళన నెలకొంది.

డ్యాన్ డ్రిస్కోల్ రాజీనామాకు ఆధిపత్య పోరే అని లుకలుకలు వినిపిస్తున్నాయి. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్‌తో కొన్ని నెలలుగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు, ఆధిపత్య పోరే ఈ అనూహ్య నిర్ణయానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇద్దరి మధ్య అధికార పరిధులు, నిర్ణయాలు తీసుకునే తీరుపై తీవ్రమైన ఘర్షణ వాతావరణం నెలకొన్నట్టు సమాచారం. మరోపక్క ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో డ్రిస్కోల్‌కు ఉన్న అత్యంత సన్నిహిత సంబంధాలే ఈ విభేదాలకు అసలు కారణంగా తెలుస్తోంది. డ్రిస్కోల్, జేడీ వాన్స్ ఇద్దరూ యాలే లా స్కూల్ మేట్స్. నాటి నుంచి మంచి స్నేహితులుగా కొనసాగుతున్నారు. ఈ సాన్నిహిత్యం కారణంగా డ్రిస్కోల్ రక్షణ శాఖ పరిధి

## కనిపించటం లేదని అంత్యక్రియలు

- **జైల్లో బతికే ఉన్నాడని తెలిసి ఆశ్చర్యం**
- **ఆనందంలో కుటుంబ సభ్యులు**

**చండీఘర్, సెప్టెంబరు 06 (ఎ.ఎం.ఎస్) :** పంజాబ్‌లోని కపుర్తలాలో వింత ఘటన చోటుచేసుకుంది. కనిపించకుండా పోయిన తమ కుమారుడు చనిపోయాడని భావించి ఓ కుటుంబం అంత్యక్రియలు నిర్వహించింది. కపుర్తలాకు చెందిన రవి కుమార్ ఆగస్టు 5న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆగస్టు 11న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పూర్తిగా కాలిపోయిన ఓ యువకుడి మృతదేహం లభించగా, పోలీసులు చూపించిన ఫొటోల ఆధారంగా అది రవిదేనని కుటుంబం నిర్ధారించింది. ఆగస్టు 13న అంత్యక్రియలు నిర్వహించింది. అయితే, సెప్టెంబర్ 2న కపుర్తలా సెంట్రల్ జైలు నుంచి కుటుంబానికి ఫోన్ వచ్చింది. రవి కుమార్ జైలులో ఉన్నాడని సిబ్బంది తెలిపారు. అనుమానాస్పదంగా తిరుగుతున్నాడనే కేసులో జలంధర్ పోలీసులు అతడిని అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు వెల్లడైంది. సెప్టెంబర్ 3న జైలుకు వెళ్లిన కుటుంబ సభ్యులు తమ కుమారుడిని బతికే ఉన్నాడని చూసి ఆనందించారు. అయితే, తాము అంత్యక్రియలు నిర్వహించింది ఎవరికి? అనే ప్రశ్న ఇప్పుడు మిగిలిపోయింది.





### ఆ బిల్లులోని నిబంధనను
## రద్దు చేయండి

- **ఇజ్రాయిల్‌తో సంబంధాలపై అమెరికా పౌర హక్కులు, న్యాయవాద బృందాలు**
- **ఆ దేశ కాంగ్రెస్ కు బహిరంగ లేఖ**

**వాషింగ్టన్, సెప్టెంబరు 06 :** అమెరికా - ఇజ్రాయిల్ మధ్య సైనిక సాంకేతిక సంబంధాలను మరింత బలోపేతం చేసే రక్షణ బిల్లులోని ఓ నిబంధనను రద్దు చేయాలని పలు పౌర హక్కులు, న్యాయవాద బృందాలు కాంగ్రెస్‌ను కోరాయి. ఈ నిబంధన ప్రకారం---సైనిక సాంకేతికత అభివృద్ధిని, ఇతర భాగస్వామ్యాలను వేగవంతం చేయడం ద్వారా ఇరు దేశాల రక్షణ రంగాల మధ్య సహకారాన్ని మరింత పెంచుతారు. ఈ బిల్లు జూలైలో ప్రతినిధులసభ ఆమోదం పొందింది. ఇప్పుడు సెనెట్ ఆమోదం పొందాల్సి ఉంది. 2027 జాతీయ రక్షణ అధికార చట్టంలోని సెక్షన్ 219గా ఈ నిబంధనను పిలుస్తారు. ఇజ్రాయిల్ పరిశ్రమతో ఉమ్మడి భాగస్వామ్యాలు, లైసెన్సింగ్ ఒప్పందాలు, అమెరికా ఆధారిత సహ - ఉత్పత్తి భాగస్వామ సం వ్యవస్థల ఏర్పాటుకు ఇది వీలు కల్పిస్తుంది.

అమెరికాకు చెందిన పౌర హక్కుల బృందాలు, న్యాయవాదులు గురువారం ఉభయ సభల సాయుధ సేవల కమిటీల నేతలకు లేఖలు రాస్తూ ఇజ్రాయిల్ రక్షణ రంగంతో మరింత భాగస్వామ్యం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. సంబంధిత నిబంధనను తొలగించాలని కోరారు. ఈ లేఖపై 56 బృందాల నాయకులు సంతకాలు చేశారు. ఈ బృందాలలో అమ్నెస్టీ ఇంటర్నేషనల్, పౌర హక్కుల నెట్‌వర్క్, లాయర్స్ గిల్డ్, అరబ్ - యూదుల హక్కుల పరిరక్షణ గ్రూపులు ఉన్నాయి. 'అమెరికా ప్రయోజనాలు ఇజ్రాయిల్ ప్రయోజనాలతో అంతకంతకూ దూరమవుతున్న వేళ, ఇజ్రాయిల్‌కు బేషరతు మద్దతుపై అమెరికా ప్రజలలో వ్యతిరేకత పెరుగుతున్న వేళ మన రక్షణ 'సాంకేతిక వ్యవస్థలో ఇజ్రాయిల్ ప్రభావాన్ని పెంచడం అత్యంత ప్రమాదకరం' అని వారు ఆ లేఖలో వివరించారు.

## పాఠశాలల ఆరంభం.. జాతీయ దృఢత్వానికి నిదర్శనం...

- **నేర్చుకోవాలనే జిజ్ఞాస ఉంటే ఏవీ అడ్డుకోలేవు**
- **విద్యార్థులకు క్యూబా అధ్యక్షులు డియాజ్ కానెల్ ఉద్బోధ**

**హవానా, సెప్టెంబరు 06 :** "విద్యార్థులతో తరగతి గదులు, టీచర్లతో పాఠశాలలు క్యూబాలో వున్నంత కాలమూ దేశం వుంటుంది, మాతృభూమి వుంటుంది. విప్లవం కూడా వుంటుంది. సోషలిజం కూడా వుంటుంది." అని క్యూబా అధ్యక్షులు, క్యూబా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ ఫస్ట్ కార్యదర్శి అయిన డియాజ్ కానెల్ వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయుడు మెండివ్ యువ మార్టికి బోధిస్తున్న పాఠశాల ఆనవాళ్ళను కలిగివున్న ప్రదేశమైన పాత హవానాలోని ప్రముఖ పాసియో డెల్ ప్రాడియోలో క్యూబా అధ్యక్షుని పత్రికా బృందంతో డియాజ్ కానెల్ మాట్లాడారు. ఈ ఏడాది విద్యా సంవత్సరాన్ని ప్రారంభించడం ప్రతి ఒక్కరి గురుతర బాధ్యత అని కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన వ్యాఖ్యానించారు. క్యూబా విప్లవ యోధుడు ఫైడెల్ కాస్ట్రోకు ఇది ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. చుట్టూ పిల్లలు, టీనేజర్లు, యువకులు అందరూ గుమిగూడి వుండగా ఆయన ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మూడు ముఖ్య అంశాలను విలేకర్లతో పంచుకున్నారు. అందులో మొదటిది ఈ ఏడాది పాఠశాల విద్యా సంవత్సరం ప్రారంభంతో తరగతి గదుల్లో నెలకొన్న విజయమని ప్రస్తావించారు. రెండవది, సమిష్టి ప్రయత్నంతో సాధించిన ఫలితాలని అన్నారు. ఇక మూడవదిమార్పులు, పరివర్తనలతో మునిగిపోయిన సమయంలో బోధనలో, అభ్యాసంలో మనం ఎదుర్కొంటున్న సవాలు అని అన్నారు.

అమెరికా సుదీర్ఘ ఆంక్షల కారణంగా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, ఇంధన కొరత, ఉపాధ్యాయులు, ఇతర సామాగ్రి, పరికరాలు ఇలా అన్నీ కొరతగానే వున్నా 202627 విద్యా సంవత్సరానికి పాఠశాలలను తిరిగి ప్రారంభించాలన్న క్యూబా దృఢ నిశ్చయాన్ని అధ్యక్షులు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. విద్య పట్ల విప్లవానికి వున్ననిబద్ధత, జాతీయ దృఢత్వానికి ఇదొక నిదర్శనంగా కనిపిస్తోంది. ఎంతటి ప్రతికూల పరిస్థితులె దురైనా విద్యను కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు. తరగతి



గదుల్లోనే విజయం నెలకొంటుందని అన్నారు. విద్యా వ్యవస్థను ఎలాగైనా సుస్థిరంగా కొనసాగించాలని ఉపాధ్యాయులు, కుటుంబాలు, కమ్యూనిటీలు, సంస్థలు, వ్యవస్థలు ఇలా అన్నీ భావించాయని, వారందరి సమిష్టి కృషి ఫలితమే ఈ రోజని వ్యాఖ్యానించారు. దేశాన్ని, విప్లవాన్ని, సోషలిజాన్ని పరిరక్షించుకోవాలంటే ముందుగా విద్యను పరిరక్షించుకోవడం అత్యంత అవశ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వర్గానికి కూడా అధ్యక్షుడు ఒక విజ్ఞప్తి చేశారు. 'మీ మీ కుటుంబాల్లో మీరు అత్యంత సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నారని మాకు తెలుసు, మీ అవసరాలను తీర్చేలా మీ వేతనాలు లేవు, అయినాఈ సమయంలో మీ నిబద్ధత, అంకిత భావం మాకు చాలా అవసరం." అని పేర్కొన్నారు. కేవలం విజ్ఞానాన్ని అందించే వారు మాత్రమే కాదు మన ఉపాధ్యాయులు, అంతకు మించి ఒక జాతిగా, ప్రజలుగా మనకు అత్యంత దృఢత్వాన్ని అందించే వారని కొనియాడారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, 'కేవలం మీ కోసమే ఇదంతా' అని అన్నారు. మనకు నేర్చుకునే సమయంలో ఏవి వున్నా లేకపోయినా మన అభ్యాసానికి, నేర్చుకోవాలనే మన జిజ్ఞాసకు అవేమీ అడ్డురాదని ఆయన స్పష్టం చేశారు.

### ఎనిమిది హైకోర్టులకు
## కొత్త సీజేలు



- **సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు మేరకు నిర్ణయం**
- **కేంద్రం ఉత్తర్వులు**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 06 (ఎ.ఎం.ఎస్) :** దేశంలోని న్యాయవ్యవస్థలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుల మేరకు ఎనిమిది హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను (సీజే) నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాల వివరాలను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కొలీజియం సిఫార్సు చేసిన కొద్ది రోజులకే కేంద్రం వేగంగా స్పందించి ఈ నియామక ప్రక్రియను పూర్తి చేయడం గమనార్హం.

నియామకాల వివరాల్లోకి వెళితే.. ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ వల్లూరి కామేశ్వరరావును పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు.

అదేవిధంగా బాంబే హైకోర్టుకు చెందిన జస్టిస్ రవీంద్ర వి. ఘుగే కలకత్తా హైకోర్టుకు నేతృత్వం వహించనున్నారు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కుమార్ అగర్వాల్‌ను రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేష్ చంద్ర త్రిపాఠి బాంబే హైకోర్టు కొత్త సీజేగా బాధ్యతలు చేపట్టనున్నారు.

## కేరళలో ఘోర రోడ్డు ప్రమాదం



- **ముగ్గురు మృతి**

**తిరువునంతపురం, సెప్టెంబరు 06 (ఎ.ఎం.ఎస్) :** కేరళలోని త్రిసూర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శనివారం అర్ధరాత్రి గురువాయూర్‌కున్నంకుళం రహదారిపై వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మృతులను ఎడక్కళియూర్‌కు చెందిన మునీర్ (35), ఆయన భార్య సఫ్నా (25), వారి మూడేళ్ల కుమారుడు యామిల్ ఐబాక్‌గా పోలీసులు గుర్తించారు. పెళ్లి వేడుకకు హాజరై ఇంటికి తిరిగి వస్తున్న కుటుంబం ఫోన్ మాట్లాడేందుకు రోడ్డుపక్కన బైక్ ఆపిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.

## కాంగోలో అగ్ని ప్రమాదం


- **22 మంది మృతి**

**కిన్షాసా, సెప్టెంబరు 06 :** కాంగో రాజధాని కిన్షాసాలోని లింగ్వాలా ప్రాంతంలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 22 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. వివాహ వేడుక జరుగుతున్న భవనంలో మంటలు చెలరేగాయి. ఇరుకైన మార్గాల కారణంగా లోపల ఉన్నవారు బయటకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం తెల్లవారుజాము వరకు మంటలు కొనసాగాయి. మేయర్ నార్బర్ట్ ముషింగా మృతుల సంఖ్య 22గా ఉందని, ఇది మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన ఉప ప్రధాని, అంతర్గత వ్యవహారాల మంత్రి జాక్వెమిన్ షబానీ ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

### జార్ఖండ్ విద్యాశాఖ
## మంత్రి కన్నుమూత

- **గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన సుదివ్య కుమార్ సోను**

**రాంచీ, సెప్టెంబరు 06 (ఎ.ఎం.ఎస్) :** జార్ఖండ్ ఉన్నత, సాంకేతిక విద్యాశాఖ మంత్రి, జేఎంఎం సీనియర్ నేత సుదివ్య కుమార్ సోను(56) గుండెపోటుతో కన్నుమూశారు. ఆదివారం తెల్లవారుజామున గిరిడీహ్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. గిరిడీహ్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్న సుదివ్య కుమార్ సోను.. జార్ఖండ్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఉన్నత, సాంకేతిక విద్య, పట్టణాభివృద్ధితో పాటు పర్యాటకం, కళలుసంస్కృతి, క్రీడలు,



యువజన వ్యవహారాలు వంటి శాఖలను కూడా పర్యవేక్షించారు. ఆయన మృతిపై సీఎం హేమంత్ సోరేన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్

**- నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.**



**చిలుకూరు సెప్టెంబర్ 06:(వుదయం)**

సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంసీతారాంపురం సమీపంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడకూడదని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉచిత నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తోందని తెలిపారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున అంతర్జాతీయ స్థాయి వసతులతో కూడిన రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి వెల్లడించారు. ఒకే క్యాంపస్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పనులు నిర్ణీత ప్రమాణాల ప్రకారం పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కోదాడ జడ్చర్ల రోడ్డు నాలుగు లైన్ల నుంచి ఆరు లైన్లు చేపిస్తానని హామీ ఇచ్చారు, కార్యక్రమంలో, కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, జిల్లా ఎస్పీ నరసింహ,అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు,

## నెక్కొండ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్

**విద్యార్థులకు మెరుగైన విద్యా, వసతి సౌకర్యాలు అందించాలి. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్.**

**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 6.**



నెక్కొండ మండల కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి సౌకర్యాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.కలెక్టర్ తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు అందుతున్న బోధన తీరును, వారి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారు చదువుతున్న అంశాలు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గదులు, భోజనశాల, వంటశాల తదితర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, పౌష్టికాహారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. వంటశాల,భోజనశాల పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసంపై కూడా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి ఎదిగేలా ఉపాధ్యాయులు నిరంతరం మార్గనిర్దేశం చేయాలని సూచించారు.పాఠశాల, జూనియర్ కళాశాల నిర్వహణకు సంబంధించిన అంశాలను సంబంధిత అధికారులతో సమీక్షించిన కలెక్టర్, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, డీటీడీవో నారాయణరెడ్డి, నెక్కొండ తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో, డీఎస్‌డీవో హమీద్, సంబంధిత ఎంపీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎనుమాముల ఈవీఎం గోదాంను త్రైమాసిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 6**

త్రైమాసిక తనిఖీలో భాగంగా ఆదివారం ఎనుమాముల మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాంలో అమలులో ఉన్న భద్రతా చర్యలు, నిర్వహణ ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. ఎన్నికల సామాగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తనిఖీ లో డియార్వో విజయలక్ష్మి, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కదలాలి

**– ఎంపీ డా. కడియం కావ్య భూటాన్‌లో సౌత్ ఏషియా పార్లమెంటరీ సదస్సు**



**వరంగల్, సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి) :**

ప్రకృతిని కాపాడుతూ అభివృద్ధి సాధించడమే నిజమైన సుస్థిర అభివృద్ధి అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనేందుకు దక్షిణాసియా దేశాలు సరిహద్దులను దాటి సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భూటాన్ రాజధాని థింపూలో జరిగిన 'సౌత్ ఏషియా పార్లమెంటరీ డైలాగ్ ఆన్ ఎన్విరాన్‌మెంట్, క్లైమేట్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్' సదస్సులో ఎంపీ కావ్య పాల్గొని మాట్లాడారు. సదస్సులో ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ.... మహిళల ఆరోగ్యంపై ప్రభావం: తీవ్ర వాతావరణ పరిస్థితులు గర్భిణులు, మహిళల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, దీనికోసం లింగసంవేదనతో కూడిన 'హీట్ యాక్షన్ ప్లాన్స్' రూపొందించాలని సూచించారు.ఇందిరా మహిళా శక్తి ప్రస్తావన, తెలంగాణలో 'ఇందిరా మహిళా శక్తి' ద్వారా మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్ల నిర్వహణతో స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి, ఆర్థిక సాధికారత సాధ్యమవుతున్నాయని ఉదాహరించారు. క్లైమేట్ స్మార్ట్ వ్యవసాయం, మారుతున్న ఉష్ణోగ్రతలకు అనుగుణంగా వాతావరణాన్ని తట్టుకునే విత్తనాలు, ఆధునిక సాగు పద్ధతులు, పరిశోధనలను దక్షిణాసియా దేశాలు పరస్పరం పంచుకోవాలన్నారు. భారత్ అనుభవాల మార్పిడి, పునరుత్పాదక ఇంధనం, హరిత అభివృద్ధిలో భారత్ చేపడుతున్న మార్గదర్శక కార్యక్రమాల అనుభవాలను పొరుగు దేశాలతో పంచుకునేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.నేడు తీసుకునే నిర్ణయాలే రేపటి తరాల భవిష్యత్తును నిర్ణయిస్తాయని, ఆర్థికాభివృద్ధితో పాటు ప్రకృతి వనరులను కాపాడటం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కావ్య పేర్కొన్నారు.

## తాత్కాలిక ఉద్యోగాల భర్తీకి రాత పరీక్ష నిర్వహణ



**– పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్**

**జనగామ, సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి) :**

జనగామ మున్సిపాలిటీలో తాత్కాలిక ప్రాతిపదికన అన్‌స్కిల్డ్ శానిటేషన్ వర్కర్లు, ఎలక్ట్రీషియన్లు, హెవీ వెహికల్ డ్రైవర్లు పోస్టుల భర్తీకి ఆదివారం రోజున జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో రాత పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించారు. అన్‌స్కిల్ శానిటేషన్ వర్కర్ పోస్టులు (30)కాగా, ఇందులో భాగంగా (45) దరఖాస్తులు రాగా, (34) మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎలక్ట్రీషియన్ పోస్టులు (04)కాగా, ఇందులో భాగంగా (34) దరఖాస్తులు రాగా, (32) మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. హెవీ వెహికల్ డ్రైవర్ పోస్టులు (20)కాగా, ఇందులో భాగంగా (47) దరఖాస్తులు రాగా, (44) మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం (54) పోస్టులకు గాను, (126) దరఖాస్తులు రాగా, (110) మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం, జనగామ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, ఉపాధి శాఖ అధికారి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

**ఐటీడీఏ పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆదేశం**

**భద్రాచలం,6/9/26**

**వుదయం ప్రతినిధి**



భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గిరిజన దర్బార్, సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాలకు సంబంధిత అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట తెలిపారు. సెప్టెంబర్ 07వ తేదీ సోమవారం నాడు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం మరియు సబ్ కలెక్టర్ కార్యాలయంలో గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని శాఖలకు చెందిన ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా సకాలంలో హాజరు కావాలని వారు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. గిరిజనులు, సాధారణ ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన వివిధ సమస్యలను లిఖితపూర్వకంగా ఫిర్యాదు రూపంలో అధికారులకు అందజేయాలని తెలిపారు. ఇలా చేయడం ద్వారా సంబంధిత శాఖల అధికారులు సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు భూమి సమస్యలు, అటవీ హక్కులు, పట్టాదారు పాసు పుస్తకాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, పెన్షన్లు, రేషన్ కార్డులు, తాగునీరు, విద్యుత్, రహదారులు, గృహ నిర్మాణం తదితర సమస్యలను గిరిజన దర్బార్ కార్యక్రమం ద్వారా నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. అదేవిధంగా సాధారణ ప్రజలు వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన తమ సమస్యలను ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుల రూపంలో అందజేయవచ్చని పేర్కొన్నారు.. గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు అవసరమైన వివరాలను అందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 07వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గిరిజనులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను లిఖితపూర్వకంగా అందజేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాలకు హాజరయ్యే అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో రావడంతో పాటు, గతంలో అందిన ఫిర్యాదులు,

వాటి పరిష్కార స్థితిగతులకు సంబంధించిన వివరాలను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలు ప్రజలకు, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో నివసించే గిరిజనులకు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు మంచి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. అందువల్ల సంబంధిత అధికారులు సకాలంలో హాజరై ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట స్పష్టం చేశారు.

## ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం**

**హనుమకొండ, సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి) :**



ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

## ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



**హనుమకొండ, సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి) :**

స్థానిక రెడ్‌క్రాస్ ప్రాణమ్ సెంటర్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. కొమురయ్య పెండ్యాల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బూర రామచందర్ సంధానకర్తగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ, గురువుల మార్గదర్శకత్వంలోనే తాను వైద్యుడిగా స్థిరపడ్డానని గుర్తు చేసుకుంటూ తన చిన్ననాటి ఉపాధ్యాయులకు ప్రణామాలర్పించారు. సభాధ్యక్షులు కొమురయ్య పెండ్యాల మాట్లాడుతూ.. భారత రత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప తత్వవేత్తగా, దేశ రెండో రాష్ట్రపతిగా అందించిన సేవలు అమోఘమని, ఉపాధ్యాయ లోకానికి ఆయన సదా ఆదర్శనీయులని పేర్కొన్నారు. గురు పూజోత్సవం రోజున విద్యారంగానికి సేవలు అందించిన 12 మంది సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

టీచర్స్ డే సందర్భంగా నిర్వహించిన క్యారమ్స్ డబుల్స్ పోటీల్లో విజేతలైన వి. అశోక్ రెడ్డి, వి. సాంబయ్య (విన్నర్స్), బూర రామచందర్, రంగరాజు గోవర్ధన్ (రన్నర్స్)లకు ముఖ్య అతిథి చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. సెంటర్‌కు రిటైర్డ్ ఎమ్ఆర్‌ఓ పి.వి. శ్రీనివాసరావు రెండు క్యారమ్ బోర్డుల సెట్లను, రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్ఐ మట్టపల్లి భిక్షపతి ఒక క్యారమ్ బోర్డు సెట్‌ను స్ట్రైకర్, లైట్ డూమ్‌లు స్వచ్ఛందంగా విరాళంగా ప్రకటించారు. దాతలకు కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గిరబోయిన రాజేందర్ ధన్యవాద సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో దాదాపు 65 మంది సీనియర్ సిటిజన్లు, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 30 సంవత్సరాలు నిండాయి... కామ్రేడ్ శ్యామల వెంకటరెడ్డికి విప్లవ జోహార్లు

**భద్రాచలం,సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి) :**




30సంవత్సరాలు నిండాయి. ఈరోజు సెప్టెంబర్ 6. కామ్రేడ్ శ్యామల వెంకటరెడ్డి గారికి విప్లవ జోహార్లు. 13 సంవత్సరాలు నరహంతకుల హిట్ లిస్టులో ఉంటూనే అత్యంత ధైర్యసాహసాలతో మన్యంలో ఎర్రజెండాను, పేదల ఉద్యమాన్ని సమున్నతంగా నిలబెట్టావు. 1985లో హత్యకు గురైన భీష్మారావు, చంద్రరావు గార్ల మరణం వల్ల ఉద్యమానికి లోటు రాకుండా ఉండటానికి పూర్తికాలం విప్లవకారుడిగా వచ్చేశావు. చిన్నల్లో చిన్నవి, పెద్దల్లో పెద్దవి అనే తేడా లేకుండా అందరినీ కలగలుపుకుపోయిన దీశాలివి. మాకు అత్యంత సన్నిహితుడివి. మీతో నిర్మాణ, రాజకీయ, సైద్ధాంతిక అంశాలపై, ప్రజలు-ఆదివాసీల సమస్యలపై సుదీర్ఘ చర్చలు, వాదోపవాదాలు, ఉద్యమాల రూపకల్పన చేసిన రోజులు ఇంకా కళ్లముందు కనిపిస్తున్నాయి. రైతు ఉద్యమ మిలిటెంట్ నాయకుడివైనా వ్యవసాయ కార్మికుల పోరాటాలకు, నిర్బంధం వచ్చిన సమయంలో కూడా కొండంత అండగా నిలబెట్టావు. పట్టణంలో కూడా పార్టీ విస్తరణ కోసం మీ అండ, తోడ్పాటు ఎంతో ఉంది. ఇంకా చాలా మీ గురించి మరోసారి అవకాశం కల్పించుకుని నేటి తరానికి సోషల్ మీడియా వేదికగా వివరించాల్సిన అవసరం ఉంది. అమరవీరుల స్ఫూర్తి ఇంకా విడవటంలేదు. అనేక ఆటుపోట్ల మధ్య మీరంతా గుర్తుకు వస్తున్నారు. మీ భౌతికకాయాల వద్ద పిడికిళ్లు ఎత్తి చేసిన బాసలకు, ప్రతిజ్ఞలకు ఇంకా కట్టుబడే ఉన్నాము... ఉంటాము. కన్నీళ్లు ఉబికి వస్తున్నాయి. . మన పూర్వీకులు, మనం నిర్మించుకున్న ఉద్యమం, ప్రాంతం ఇప్పుడు పోలవరం ముంపు పేరుతో పాలకవర్గాలు ముక్కలు చేసేశాయి. అక్కడి పార్టీ ముంపు ప్రజల కోసం పోరాటాలు చేస్తున్నది. , పేదల సంక్షేమం కోసం ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. కామ్రేడ్ శ్యామల వెంకటరెడ్డి గారి పోరాట స్ఫూర్తి, త్యాగం, ఉద్యమ పట్ల ఆయన చూపిన అంకితభావం నేటి తరానికి ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తూనే ఉంటుంది. కామ్రేడ్ శ్యామల వెంకటరెడ్డి గారికి విప్లవ జోహార్లు... అమరవీరులకు ఎర్ర జోహార్లు.

## రైతుల సాగునీటి కల సాకారం



రాజీవ్ శాంతినగర్ ఎత్తిపోతల పథకం

అనంతగిరి సెప్టెంబర్ 06 వుదయం

మండల పరిధిలోని శాంతినగర్ సమీపంలో రూ.54 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణంలో ఉన్న రాజీవ్ శాంతినగర్ ఎత్తిపోతల పథకం పనులను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి, పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ ఎత్తిపోతల పథకం అందుబాటులోకి వస్తే పరిసర ప్రాంతాల రైతులకు సాగునీటి వసతి మరింత మెరుగుపడి వ్యవసాయానికి ఎంతో ప్రయోజనం చేకూరనుందని నాయకులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. మంత్రి తో పాటు కోదాడ శాసనసభ్యురాలు పద్మావతి రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా పోలీసు అధికారి నర్సింహా, నీటిపారుదల శాఖ ప్రధాన ఇంజనీర్ నాగభూషణం, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల భక్తుల కోసం డార్మెంటరీ నిర్మాణం

**భద్రాచలంలో రూ.1.50 కోట్ల వ్యయంతో డార్మెంటరీ నిర్మాణాలకు భూమి పూజ : భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**

**భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాచలం, 6/9/26 వుదయం ప్రతినిధి**



వచ్చే ఏడాది 2027 జూన్ జులై నెలలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు భద్రాచలం వచ్చే భక్తుల సౌకర్యార్థం డార్మెంటరీ హాల్ నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నామని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు. గోదావరి పుష్కరాల కోసం భద్రాద్రి జిల్లాలోని దక్షిణ అయోధ్యగా పేరు ప్రఖ్యాతలు గడించిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంకు విచ్చేసే భక్తుల కొరకు ఈ డార్మెటరీ హాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా భద్రాచలంలోని అమ్మ సత్రం ప్రాంతం వద్ద దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్ల వ్యయంతో "డార్మెంటరీ జి ప్లస్ వన్ భవన్" నిర్మాణానికి ఆదివారం భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించగా ముఖ్యఅతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని మాట్లాడారు. గోదావరి పరివాహక ప్రాంతాలలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు భక్తులు హాజరవుతారని, ముఖ్యంగా భద్రాచలం పుణ్యక్షేత్రానికి దేశ నలుమూలల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారని తెలిపారు. భక్తులకు కనీస వసతులను కల్పించే ఉద్దేశంలో భాగంగా వారి వసతి కొరకు దేవాదాయ శాఖ తరపున ఈ డార్మెటరీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పది రోజులకు ఒకసారి అధికారులతో సమీక్ష సమావేశం ఈ పుష్కర పనులపై నిర్వహిస్తామని, అధికారులు ఇది గమనించి పని చేయాలని తెలిపారు. అనంతరం భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే గోదావరి పుష్కరాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తుందని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాలలో ప్రారంభించిన ఘాట్ నిర్మాణాలతో పాటు డార్మెంటరీ నిర్మాణాలను సకాలంలో త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏడు జిల్లాలో గోదావరి పుష్కర పనులు కొనసాగుతున్నాయని, ముఖ్యంగా భద్రాచలంలో జరుగుతున్న పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఈ.ఓ దామోదర్, సర్పంచ్ పూనం కృష్ణ, ఉప సర్పంచ్ రత్నం కవిత, వార్డు సభ్యులు రమణ, కారం దుర్గారావు, వాణి తదితరులు పాల్గొన్నారు.

## జామియా మసీద్ లో బహిరంగ సభ పోస్టల్ ఆవిష్కరణ



**కల్లూరు,సెప్టెంబర్ 6 (ఉదయం ప్రతినిధి)**

ముస్లింల ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన కొత్తగూడెం క్లబ్లో బస్టాండ్ ప్రక్కన మగ్రిబ్ సమాజ్ అనంతరం జిల్లా స్థాయి రెండవ గొప్ప బహిరంగ సభ జరగనున్నట్లు కల్లూరు మండల సదర్ ఎండి హనీఫ్ మసీదు కమిటీ సదర్ సయ్యద్ రావూఫ్ సయ్యద్ అలీ ఎస్ డి అమీరుద్దీన్ ఎస్కే సిరారుద్దీన్లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జన్మదిన మసీదులో ఈ మేరకు ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో జరుగునున్న జిల్లా స్థాయి బహిరంగ స భను జయప్రదం చేయాలని పోస్టర్లు ఆవిష్కరించి వారు పిలుపునిచ్చారు మహమ్మద్ సందేశం అనే అంశంపై జరుగుతుందని ముఖ్య అతిథులుగా ఉత్తరప్రదేశ్ కు చెందిన ప్రముఖులు హజరత్ అబ్బాస్ మూలాన మహమ్మద్ సల్మాన్ జిజోర్ని నక్స్ బందీ సాహెబ్ ఢిల్లీకి చెందిన డాక్టర్ హఫీస్ ఉర్ ఉర్ రెహమాన్ సాహెబ్ హిందూ ముస్లిం జన్ ఏక్తా మంచ్ కాన్పూర్ కు చెందిన స్వామి లక్ష్మీ శంకరాచార్యులు హాజరుకానున్నట్లు వారు తెలిపారు హిందూ ముస్లిం క్రిస్టియన్ అన్ని సామాజిక వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు ఈ కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు షేక్ ముజాయిద్, ఎస్కే ఖాలీద్ ,ఎస్ డీ బాబా,గౌస్ ,ఎస్కే ఇర్ఫాన్ ,ఎస్ డి జావిద్ ,తదితరులు పాల్గొన్నారు.

## కోటయ్యగూడెంలో ఘనంగా శ్రావణ మాస బోనాలు



**చండూరు, సెప్టెంబర్ 6( వుదయం)**

:చండూరు మండలం పడమటితాళ్ల కోటయ్యగూడెంలో శ్రావణ మాస బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను అలంకరించి, ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పుర వీధులన్నీ భక్తుల శోభాయాత్రలు, శివసత్తుల పూనకాలతో ఉత్సవ వాతావరణం సంతరించుకున్నాయి.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాలెంక రాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు లభించాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో గ్రామ నాయకులు, ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ ఆదేశాలు

**మహబూబాబాద్, సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి) :**

రాష్ట్ర ఎన్నికల సంఘం (SEC) సూచనల మేరకు మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపల్ వార్డులలో ఓటరు జాబితాకు సంబంధించి అభ్యంతరాలు, చేర్పులు మరియు మార్పుల కోసం ఫారమ్ 6, 7, 8 ద్వారా ధరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు.

జిల్లా కలెక్టర్ గారి ప్రత్యేక ఆదేశాల మేరకు ఇనుగుర్తి, నరసింహారావుపేట, సిరోలు, డోర్నకల్, గూడూరు, మహబూబాబాద్ మండలాల్లో తహసీల్దారులు, ఎన్నికల అధికారులు, బూత్ లెవెల్ ఆఫీసర్లు (BLO) క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నారు. ఇదివరకే షెడ్యూల్ ప్రకారం నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి వివరాలు, అభ్యంతరాల ఫారమ్‌లను సేకరిస్తున్నారు. స్వీకరించిన దరఖాస్తులను ఎన్నికల నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## అసెంబ్లీ ప్రాంగణంలో ప్రభుత్వ విప్ కార్యాలయం ప్రారంభం..

**పెద్దపల్లి సెప్టెంబరు 06 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ గా నియామకమైన పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావుకి ప్రభుత్వం తరుపున తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో అధికారిక కార్యాలయం కేటాయించడం జరిగింది. ఆ కార్యాలయం ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు వేద పండితులు మధ్య ఆదివారం రోజున మంత్రోత్సవాలతో ప్రారంభం చేయడం జరిగింది. ప్రభుత్వ విప్ కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రమంత్రివర్యులుశ్రీ. దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, రామ గుండం

**వేద పండితుల మధ్య విప్ విజయరమణ రావుకి ప్రముఖుల శుభాకాంక్షలు..**



ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారు, ఎమ్మెల్సీ తానిపత్రి భాను ప్రసాద్ రావు పలువురు ప్రజా ప్రతినిధుల పాల్గొన్నారు. వారందరూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేకి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంటింటికి మొక్కల పంపిణీ...

**జగిత్యాల సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి)**

**ప్రతి ఇంట్లో ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలి...**

**తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు వాటర్ ట్యాంకుల నిర్మాణం... ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**



జగిత్యాల పురపాలక సంఘం ఆధ్వర్యంలో 14వ వార్డులో వన మహోత్సవం సందర్భంగా ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమంలో భాగంగా వార్డు మహిళలకు మొక్కలు పంపిణీ చేసిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అనంతరం ఫిల్టర్ బెడ్ దగ్గర 5 లక్షల రూపాయలతో గ్రీన్ షెడ్ నిర్మాణానికి భూమి పూజ చేసి నూతనంగా నిర్మిస్తున్న 15 లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల పట్టణాన్ని పచ్చదనంతో పరిశుభ్రతతో ఆదర్శ పట్టణంగా ఉంచడం అందరి బాధ్యత అని మున్సిపల్ వార్డులో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతి ఇంటి ముందు ఒక మొక్క పెంచితే మన పట్టణంలో పచ్చదనం పెరుగుతుందని వాతావరణ కాలుష్యం తగ్గుతుందని నీడని ఇస్తుందని అదేవిధంగా ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయడానికి నిర్మిస్తున్న వాటర్ ట్యాంకుల పనులను పరిశీలించాడం జరిగిందని నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం అందించాలని అధికారులను ఆదేశించారు 15 లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్ ధర్మ సముద్రం వద్ద 16 లక్షల వాటర్ ట్యాంక్ కొత్త బస్టాండ్ వద్ద 16 లక్షల వాటర్ ట్యాంక్ ఎస్ కే ఎన్ ఆర్ డిగ్రీ కళాశాల వద్ద 16 లక్షల వాటర్ ట్యాంక్ సరస్వతి గుట్ట పైన రాయికల్ పట్టణంలో తాగు నీరు కరువు తీర్చడం కోసం 16లక్షల లీటర్ల ట్యాంక్ నిర్మాణం ప్రైవేట్ భూమి తీసుకొని భవిష్యత్తులో తాగు నీటి ఇబ్బంది లేకుండా నిర్మాణం చేస్తున్నామన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు అందించడం జగిత్యాలను పచ్చని పట్టణంగా మార్చడానికి కృషి చేస్తానన్నారు ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో దళితులు బీసీ లు మైనార్టీ లకు అధిక ప్రాధాన్యత కలిగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ కమిషనర్ సత్య ప్రణవ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్ కౌన్సిలర్ స్వప్న గిరిధర్ టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ గిరి నాగభూషణం అడువాల లక్ష్మణ్ మాజీ కౌన్సిలర్ బాలే శంకర్ డిసిసి ఉపాధ్యకులు కుసరి అనిల్ నాయకులు రమణ రావు పంబాల రాము తాజోద్దీన్ శరత్ రావు ములసపు మహేష్ పవన్ క్రాంతి ప్రవీణ్ రావు నక్క గంగాధర్ శ్రీనివాస్ మల్లేష్ చంద్రయ్య రహీం శంకే మహేష్ నాయకులు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రంగస్థల కళాకారులకు అండగా ప్రభుత్వం నిలవాలి

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి) :**



ప్రాచీన రంగస్థల కళలను పరిరక్షిస్తూ వస్తున్న కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం చేయూతనివ్వాలని తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపెల్లి సంపత్‌గౌడ్ కోరారు. కరీంనగర్ సప్తగిరి కాలనీలోని కోదండరామాలయంలో ఆదివారం ఆయన అధ్యక్షతన వేదిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు.సమావేశంలో తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సావనపల్లి శ్రీనివాస్, నాయిని సత్యనారాయణ రెడ్డి, వీర్నపల్లి కిషన్, పెద్దపల్లి జిల్లాకు చెందిన తాళ్లపల్లి రాజేశం గౌడ్, రావుల సదానందం, బొంగోని శంకర్‌గౌడ్, సిద్దిపేట జిల్లాకు చెందిన చల్లగొండ స్వామిరావు, గూళ్ల మొగిలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తంగళ్లపల్లి మండల అధ్యక్షుడిగా ఏరెడ్డి వెంకటరెడ్డి, కోనరావుపేట మండల అధ్యక్షుడిగా తక్కళ్ల బాపురెడ్డి, వేములవాడ మండల అధ్యక్షుడిగా గరిగంటి చంద్రయ్య,చందుర్తి మండల అధ్యక్షుడిగా సిరిసిల్ల శంకర్, ఇల్లంతకుంట మండల అధ్యక్షుడిగా సుధగోని రాజమల్లు గౌడ్, వీర్నపల్లి మండల అధ్యక్షుడిగా నేరెళ్ల ముత్యం గౌడ్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడిగా జంగా రాంరెడ్డిని నియమించారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల అధ్యక్షుడిగా లేగల భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోనెల నరసయ్యను ఎంపిక చేశారు,పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా ఊటుకూరి శ్రీనివాస్‌గౌడ్, తాళ్లపల్లి రాములు, కొలిపాక సత్తిబాబు, కాల్వ శ్రీరాంపూర్ మండల కన్వీనర్‌గా అనుముల రాజిరెడ్డి, కో-కన్వీనర్లుగా గోనెసంజీవ్, పురుషోత్తం అనిల్‌ను నియమించారు.ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర సలహాదారు కూకట్ల తిరుపతి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రాజేశం గౌడ్, కళాకారులు తిప్పారపు ముత్యం పోలేరు, పురుషోత్తం రామచంద్రం, కల్వల చంద్రారెడ్డి, మంథని సరిత, కన్నం భూమయ్య, గోనె శ్రీనివాస్ రెడ్డి, తిప్పారపు శంకర్, తాళ్లపల్లి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

## యువ సమరభేరి సభ విజయాన్ని అందుకోవడంతో కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెల్లో భయం మొదలైంది..

**బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్**



**కరీంనగర్ సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి):**

కరీంనగర్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన విద్యార్థి, యువ సమరభేరి సభ అపూర్వ విజయాన్ని సాధించడంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో భయం మొదలైందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరి శంకర్ అన్నారు. సభ సక్సెస్ కాలేదంటూ మేయర్ కోలగాని శ్రీనివాస్ మాట్లాడటం బీజేపీ పార్టీ భయానికి నిదర్శనమని స్పష్టం చేశారు. రెండుసార్లు ఎంపీగా గెలిచిన బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. బిజెపి పార్టీ నగరపాలక సంస్థలో అధికారానికి వచ్చి ఆరు నెలలు గడిచిన కేంద్రం నుంచి ఒక్క రూపాయి నిధులు తీసుకురాకుండా, కేవలం జనరల్ ఫండ్స్‌తో ప్రారంభోత్సవాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఏళ్లు గడుస్తున్నా రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి చేయకపోవడమే బండి సంజయ్ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. మరోవైపు నగరంలో పారిశుధ్యం పడకేసిందని, మేయర్ గా కోలగాని శ్రీనివాస్ పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. అధికారులపై మేయర్‌కు నియంత్రణ లేదని విమర్శించారు.

నగర సమస్యలపై సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ప్రజావాణిలో వినతిపత్రం సమర్పిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుగ్గిళ్ళ జయశ్రీ- శ్రీనివాస్, షేక్ యూసుఫ్, మాజీ కార్పొరేటర్లు గందె మాధవి-మహేష్,నందెల్లి రమాదేవి, దిండిగాల మహేష్, కంసాల శ్రీనివాస్, ఎడ్ల అశోక్, బోనాల శ్రీకాంత్, నాంపల్లి శ్రీనివాస్, నక్క కృష్ణ, జక్కని ఉమాపతి, నాయకులు గడ్డం ప్రశాంత్ రెడ్డి, సుంకిశాల సంపత్ రావు, నేతి రవివర్మ, గంగాధర చందు, పటేల్ సుధీర్ రెడ్డి, నారదాసు వసంతరావు,అరే రవి, తొంటి రాజేందర్, ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి, నయీమ్, చేతి చంద్రశేఖర్, మంతిని కిరణ్, పిట్టల శ్రీనివాస్, మిడిదొడ్డి నవీన్, చొక్కారపు చంద్రం మేచినేని పవన్, మహిళ నాయకురాల్లు కంజర్ల రేణుక, గంటల రేణుక, పలువురు బారసా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ప్రభుత్వ పూర్తి మద్దత్తు

**ధర్మపురి, సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి):**

**ధర్మపురిలో ఘనంగా ఆర్యవైశ్య సంఘం**

**నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం**

**సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర అభినందనీయం**

**మంత్రి లక్ష్మణ్ కుమార్**



రాష్ట్రంలో ఆర్యవైశ్యుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.ధర్మపురి మం డల,పట్టణ ఆర్యవైశ్య సంఘం నూత న కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్స వం ఆదివారం శ్రీ లక్ష్మీనరసింహ గార్డె న్స్‌లో ఘనంగా నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి అడ్లూరి హాజరయ్యారు. ఈ కార్యక్ర మంలో ధర్మపురి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సాయిని శ్రీనివాస్, పట్టణ సంఘం అధ్యక్షుడిగా పిన్న శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు మంత్రి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.సేవాభావానికి ప్రతీక ఆర్య వైశ్యులు సమాజంలో ఆర్యవై శ్యులు ఎక్కడ నివసించినా విస్తృతమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవతా దృక్పథాన్ని చాటుకుంటున్నారని మంత్రి కొనియాడారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా దివంగత కేఈ రోశయ్య అందించిన విశేష సేవ లూ, కాంగ్రెస్ పార్టీ ఆయనకు కల్పించిన అవకాశాలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు.ధర్మపురి నియోజ కవ ర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలి పించడం పూర్వజన్మ సుకృ తమని మంత్రి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. గెలుపొందిన నాటి నుంచి నియోజ కవర్గ ప్రజలు తనకు పూర్తి సహకారం అందిస్తున్నారని,ఎక్కడా ఇబ్బంది పెట్టకుండా ఆదరిస్తున్నారని తెలిపా రు. ప్రభుత్వానికి ఆర్యవై శ్యులు ఎల్ల ప్పుడూ అండగా ఉండాలని పిలుపు నిచ్చిన ఆయన, వైశ్యుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి తనవంతు పూర్తి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనబట్ల దినేష్,జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు, మెట్‌పల్లి పట్టణ పురపాలక సంఘం చైర్మన్ మైలారపు లింబాద్రి,మున్సిపల్ చైర్మన్ వేముల.నాగలక్షి రాజేష్,కౌన్సిలర్ పద్మ,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలుముల. లక్ష్మణ్,సీనియర్ నాయకులు గడ్డం. భాస్కర్ రెడ్డి, ఇనుగంటి. వినోద్ రావు,సొల్లా.భీమయ్య,జె.సుముఖ్, తెలం గాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అదనపు ప్రధాన కార్యదర్శి ముక్త శ్రీని వాస్,జగిత్యాల జిల్లా మాజీ అధ్యక్షులు,కార్యదర్శులు, ధర్మపురి నియోజ కవర్గంలోని వివిధ మండలాల అధ్యక్షులు,మాజీ అధ్యక్షులు కూరగాయల సంతోష్ కుమార్,మురికి.శ్రీనివాస్,ఎన్నికల కన్వీనర్ సాయిని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల చేతుల్లోనే హరిత భవిష్యత్తు

**- మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి):**




మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించినప్పుడే భావితరాలకు హరిత భవిష్యత్తును అందించగలమని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. బంగారిగూడలోని టీజీఎం ఆర్ఎస్ అండ్ జేసీ బాయ్స్-1, బాయ్స్-2 పాఠశాలల ప్రాంగణంలో మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వన్ మహోత్సవ్' సామూహిక మొక్కల నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చెట్ల పెంపకంతో వాతావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లాకలెక్టర్‌రాజర్షిషా, అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష సతీష్ పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ రోహిత్, మున్సిపల్ కమిషనర్ జగదీష్‌గౌడ్, డీఎండబ్ల్యూఎం షైక్ కలీమ్, కౌన్సిలర్లు స్వాతి మంగేష్, సరిత పెద్దమల్లయ్య, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు.

## బాసరలో రూ.354 కోట్లతో శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ సమగ్ర అభివృద్ధికి శ్రీకారం

**నిర్మల్ జిల్లా 6 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**

**రూ.20 కోట్లతో పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం:**

**మంత్రి జూపల్లి కృష్ణారావు**



తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా వచ్చే ఏడాది జూన్ 27 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో విస్తృత ఏర్పాట్లు చేపడుతోందని రాష్ట్ర మద్యం, ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పుష్కరాలకు ఏడాది ముందుగానే మౌలిక వసతులు, పుష్కర ఘాట్లు, ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఆదివారం బాసరలో పర్యటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పుష్కర ఘాట్ల నిర్మాణం, విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గోదావరి నదీమాతకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూ.354 కోట్లతో చేపట్టనున్న ఆలయ సమగ్ర అభివృద్ధి, నూతన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ప్రాంగణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. భవిష్యత్‌లో పెరగనున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌలిక వసతులను ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు.గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తుల సౌకర్యం, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుష్కర ఘాట్లను అవసరమైన మేరకు విస్తరించడంతో పాటు, కొత్త ఘాట్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టాలని అన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేక డ్రెస్సింగ్ రూములు, మరుగుదొడ్లు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధాన పుష్కర ప్రాంతాల్లో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అవసరమైన వైద్యులు, అత్యవసర మందులు, అంబులెన్స్‌లను ముందుగానే సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, దేవాదాయ, వైద్య, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పుష్కర ప్రాంతాల్లో నిరంతర పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని, భక్తులకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆలయ ఈవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏడాది ముందుగానే పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

## కక్ష సాధింపులు వెయ్యి కుట్రలు వెయ్యి కృతంత్రాల పాలన

**-కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన ఒక్క మోసం..**

**ఎన్నికల హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు: బాల్క సుమన్**

**మంచిర్యాల/ రామకృష్ణాపూర్/సెప్టెంబర్ 06(వుదయం ప్రతినిధి)**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ బాల్క సుమన్ తెలిపారు. క్యాతనపల్లిలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

**గత ప్రభుత్వ హయాంలో తెచ్చిన నిధులే తప్ప కొత్తగా ఏమీ లేదు**

తమ ప్రభుత్వ హయాంలో చెన్నూరు నియోజకవర్గానికి తీసుకొచ్చిన నిధులతోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని బాల్క సుమన్ పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని ఆరోపించారు. గతంలో మంజూరైన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనులనే తమ ఘనతగా చెప్పుకుంటున్నారని విమర్శించారు.

**45 వేల ఉద్యోగాల హామీ ఏమైంది?**

ఎన్నికల సమయంలో మంత్రి వివేక్ వెంకటస్వామి 45 వేల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని బాల్క సుమన్ గుర్తుచేశారు. ఇప్పటివరకు ఆ హామీ మేరకు ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారో ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే 45 వేల ఉద్యోగాల హామీపై శ్వేతపత్రం విడుదల చేయాలని మంత్రి వివేక్‌కు సవాల్ విసిరారు.

**ఆడపిల్లలకు స్కూటీల హామీ అమలు చేయాలి**



18 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని సుమన్ తెలిపారు. అయితే ఇప్పటివరకు ఒక్క స్కూటీ కూడా పంపిణీ చేయలేదని ఆరోపించారు. మహిళలు, యువతకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**సింగరేణి కార్మికుల సమస్యలపై సదస్సు**

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మందమర్రిలో సదస్సు నిర్వహిస్తున్నట్లు బాల్క సుమన్ తెలిపారు. సింగరేణి కార్మికుల సమస్యలు, వారి హక్కులు, పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నట్లు వెల్లడించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

**చెన్నూరులో వేల కోట్ల అభివృద్ధి జరిగింది: కొప్పుల ఈశ్వర్**

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. బాల్క సుమన్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన ఆధ్వర్యంలో చెన్నూరు నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం అనేక రంగాల్లో అభివృద్ధి సాధించి దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిచిందని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు.

**తరతరాలుగా పదవులు.. అభివృద్ధి మాత్రం శూన్యం**

గడ్డం వంశానికి చెందిన వారు తరతరాలుగా ఈ ప్రాంతం నుంచి ఎన్నికై వివిధ పదవులు పొందారని కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. అయితే ప్రజల కోసం చెప్పుకోదగ్గ స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలే సమాధానం చెబుతారని అన్నారు.

**చెన్నూరులో పరిశ్రమ ఏర్పాటు చేయాలి...**

చెన్నూరు ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి తన ఆర్థిక స్థోమతకు అనుగుణంగా చెన్నూరులో ఒక పరిశ్రమను నెలకొల్పి స్థానికులకు ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు రావాలని కోరారు.

**పార్టీలు మారే వివేక్‌కు కేసీఆర్, సుమన్‌పై మాట్లాడే నైతిక హక్కు లేదు..**

అధికారం కోసం పార్టీలు మారిన వివేక్ వెంకటస్వామికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బాల్క సుమన్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు మారడం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు.

**ఫ్యాక్షన్ రాజకీయాలకు చెక్ పెట్టాలి...**

చెన్నూరు నియోజకవర్గంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీ ఫ్యాక్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని బాల్క సుమన్ ఆరోపించారు. రాజకీయాలను ప్రజా సమస్యల పరిష్కారానికి ఉపయోగించాల్సిన అవసరం ఉందని, వ్యక్తిగత విమర్శలు, కక్షసాధింపు రాజకీయాలకు స్వస్తి పలకాలని అన్నారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించే విధానాలను విడనాడి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని బాల్క సుమన్ డిమాండ్ చేశారు. యువతకు ఉద్యోగాలు, మహిళలకు ఇచ్చిన హామీల అమలు, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఈ సమావేశంలో టీబీజీకేఎస్ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి, పట్టణ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, స్థానిక కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.ఇది కావాలంటే నేటిధాత్రి పత్రిక శైలిలో మరింత పవర్‌ఫుల్ హెడ్డింగ్‌లు, 2-3 సబ్‌హెడ్డింగ్‌లతో కూడా మార్చి ఇస్తాను.

## హామీలు ఎక్కడ? అమలు ఎప్పుడు? కాంగ్రెస్‌పై కోనప్ప ఫైర్...।

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తీవ్రస్థాయిలో విమర్శించారు. హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఆదివారం



బెజ్జూరు మండలంలోని బారేగూడ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి 'కాంగ్రెస్ బాకీ కార్డుల'ను పంపిణీ చేశారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో మాత్రం వెనుకడుగు వేస్తోందని కోనప్ప ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్, రైతు భరోసా, రైతులకు రూ.500 బోనస్, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా, కల్యాణలక్ష్మి పథకం లో భాగంగా తులం బంగారం వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, ఎన్నికల హామీలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోనప్ప అన్నారు. హామీల అమలు జరిగే వరకు ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, సర్పంచ్ లు ,మాజీ ఎంపీటీసీ లు, మాజీ కో ఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు కోనేరు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## పోలింగ్ కేంద్రాల పరిశీలన

### తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి)**

సెప్టెంబర్ 5, 6, 12, 13వ తేదీల్లో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్ ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదివారం దేవరకద్ర నియోజకవర్గంలో అడ్డాకల్ మండలం శక్రాపూర్, మూసాపేట మండలం జనంపేట, భూత్పూర్ మండలం పోతుగుట్ట తండాలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు. అడ్డాకల్ మండలం శక్రాపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 103, 104లను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, అక్కడ చేపట్టిన ఏర్పాట్లతో పాటు కొనసాగుతున్న ఎన్నికల సంబంధిత కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం మూసాపేట మండలం జనంపేట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 81, 82, 83, 84లను పరిశీలించారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన పనులను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఓటరుకు అవసరమైన సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.భూత్పూర్ మండలం పోతుగుట్ట తండాలోని పోలింగ్ కేంద్రం 24ను కూడా అదనపు కలెక్టర్ తనిఖీ చేసి, ఎన్నికల సంబంధిత పనుల పురోగతిని సమీక్షించారు. ఓటర్ల జాబితా పనుల్లో ఎలాంటి లోపాలకు తావులేకుండా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ తనిఖీల్లో సంబంధిత మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు,ఏఈఆర్ఓలు, ఆర్ఐలు, బీఎల్ఓ సూపర్వైజర్లు, జీపీఓలు, పీఎస్‌లు, సర్పంచ్‌లు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహశీలి అవార్డు గ్రహీత వెంకటేశం కు సన్మానం



**మెదక్ జిల్లా వుదయం నిజాంపేట,**

వంజరి కుల బంధువుల అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని స్నేహశీలి అవార్డు గ్రహీత ఎదుగని వెంకటేశం అన్నారు.

ఈ సందర్భంగా రామాయంపేట వంజరి సంఘం పట్టణ అధ్యక్షుడు నవాత్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు అవార్డు గ్రహీత ఎదుగని వెంకటేశంను శాలువాతో ఘనంగా సన్మానించారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తున్న వెంకటేశం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి సేవలందించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వంజరి కుల సంఘం సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి భరోసా



- **రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**

**వెల్దండ సెప్టెంబర్ 6 (వు దయం)**

**పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసా కల్పిస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు ఆదివారం 23,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును వార్డు సభ్యులు ఆనంద్ కి అందజేశారు.**పేద, సామాన్య కుటుంబాలకు అండగా నిలుస్తూ ప్రతి ఆపదలోనూ ప్రజల వెంట ఉంటూప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా కృషి చేస్తూప్రజా సేవే లక్ష్యంగా గోలి శ్రీనివాస్ రెడ్డి ముందుకు సాగుతున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్,BRS నాయకులు సతీష్,కృష్ణ,భారత్ తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి ప్రజల అభివృద్ధి కోసం చివరి వరకు నిలబడతా

**సంగారెడ్డి వుదయం**

: సంగారెడ్డి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం చివరి వరకు పోరాడుతానని జనసేన పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ సాయి కీర్తన అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే జనసేన పార్టీని ఆదరించాలని ఆమె పిలుపునిచ్చారు.



సంగారెడ్డి నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలు పలు సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ, వాటికి శాశ్వత పరిష్కారం లభించడం లేదని సాయి కీర్తన పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు వంటి అనేక అంశాల్లో నియోజకవర్గం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని ఆమె విమర్శించారు.ప్రజల సమస్యలను కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తు చేసుకునే రాజకీయాలకు స్వస్తి పలకాలని ఆమె అన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడటమే జనసేన పార్టీ లక్ష్యమని తెలిపారు."సంగారెడ్డి ప్రజల అభివృద్ధి కోసం చివరి వరకు నిలబడతా. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతా. మార్పు కోసం జనసేన పార్టీని ఆదరించండి. తెలంగాణలో రాబోయేది జనసేన పార్టీనే" అని సాయి కీర్తన అన్నారు.

సంగారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు జనసేన పార్టీకి ప్రజలు అండగా నిలవాలని ఆమె కోరారు.

### విద్యుత్ ప్రమాదాలు జరగకుండా

## అప్రమత్తంగా ఉండాలి

- **నారాయణపేట డి ఈ రాజు నాయక్**

**నారాయణపేట సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి)**



నారాయణపేట జిల్లా పరిధిలోని వివిధ మండ లాల్లో ఉన్న గణేష్ మండ పాల నిర్వహాకులకు విద్యుత్ శాఖ ఆపరేషన్ డిఈ రాజు నాయక్ పలు సూచనలుచేశారు .వినాయక చవితి సందర్భంగా జిల్లా ప్రజలు అత్యంత భక్తి తో ఎంతో వైభవంగా గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తి శ్రద్ధలతో 11 రోజులు పాటు గణపయ్యాకు పూజ లు చేసి నిమజ్జనం చేస్తారు. అంతకంటే ముందు జిల్లా కేంద్రం తో పాటు వివిధ మండలాల్లో ప్రజలు వినా యక చవితి సందర్భంగా గణపయ్యకు ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేస్తారు .ఈ మండపాలను వేసే క్రమంలో తీసుకోవా ల్సిన జాగ్రత్తల పై విద్యుత్ శాఖ ఆపరేషన్ డివిజనల్ ఇంజనీర్ రాజు నాయాక్ కొన్ని సూచనలు చేశారు.

గణేష్ మండపాల నిర్వ హాకులు మొదట తీసుకో వాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు. నాణ్యమైన విద్యుత్ తీగలు కలిగిన (వైర్) 6 ఎం.ఎం. కోర్ సర్వీస్ వైర్ ను తీసుకోవా లి. ఐ.ఎస్.ఐ. మార్కు కలిగిన నాణ్యమైన విద్యు త్ వైర్లను వాడాలన్నారు. అలాగే ఏత్తేన పెద్ద పెద్ద వినాయక విగ్రహాలు కాకుం డా చిన్న విగ్రహాలను తీసు కున్నట్లయితే స్థానిక విధు ల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అందరికీ సౌకర్యవంతం గా ఉంటుం దని విద్యుత్ శాఖ డి.ఈ. రాజు నాయాక్ తన అభి ప్రాయాన్ని వ్యక్తం చేశారు. పదకోండు ఫీట్లు పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేసి నట్లయితే ఆ ప్రతిమలను రోడ్లపై తరలించడానికి చాలా సమయం తో పాటు,రవాణా చేసేందుకు పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ సిబ్బంది కి అధనపు భారం అవుతుం దన్నారు. అలాగే ప్రజల రాకపోకల కు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పెద్ద విగ్ర హాలనుత రలించేసమయంలో ఇరుకైన రోడ్లపై చాలా ఇబ్బందులు తలేత్త వచ్చు న్నారు. గణేష్ మంటపాల నిర్వాహకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఈ విగ్రహాల విషయంలో అధికారుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. మండపాల దగ్గర విద్యుత్ షాక్ తగ లకుండగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యు త్ బోర్డులను నాణ్యమైన బోర్డులను చిన్న పిల్లలకు అందకుండ ఏర్పాటు చేయాలని అన్నారు. రేకుల షెడ్డు వేసేవారు వర్షం నీళ్ళు విద్యుత్ వైర్లకు , బోర్డు లోకి నీరు వచ్చిన ట్లయితే విద్యుత్ ప్రమాదా లు జరిగే అవకాశం ఉంటుందన్నారు. వాటిని జాగ్రత్తగా పై కప్పులు ఉండేవిధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించా రు.గణేష్ మండపాల దగ్గర అధ్యక్షులు ఉపాధ్యక్షుడు, మొత్తం బాడి ఫోన్ నెంబర్ల ను మండపం దగ్గర అందు బాటులో ఉండేవిధంగా ఓ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మండపాల దగ్గర పోలిసు శాఖ, విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నెంబర్ లతో కూడిన బోర్డు లు ఏర్పాటు చేసినట్లయితే నిర్వహాకులపై భారం ఉండ దన్నారు. ఏలాంటి సమా చారం ఉన్న ప్రజలు వెంటనే సంబంధిత శాఖ అధికారులకు ఫోన్ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కావున నిర్వాహకులు విద్యుత్ అధికారుల సూచనలను పాటించాల్సిందిగా కోరారు.

## పేపర్‌లో వార్త వస్తే పట్టించుకోరా..?

- **రాతపూర్వకంగా దరఖాస్తు ఇస్తేనే పరిశీలిస్తాం".. డీపీఓ తీరుపై విమర్శలు**
- **కొండాపూర్‌లో నెలలుగా ఎంపీఓ పోస్టు ఖాళీ.. పంచాయతీ సమస్యలకు దిక్కెవరు?**
- **మల్కాపూర్ నిర్మాణంపై ఆరోపణలు.. బాధ్యత కింది స్థాయి అధికారులదేనంటున్న జిల్లా అధికారి!**

**సంగారెడ్డి ,వుదయం :**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన పత్రికా కథనాలకే అధికారులు స్పందించకపోతే.. ఇక సామాన్యుల సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి? సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు రాతపూర్వకంగా దరఖాస్తు తప్పనిసరా? అనే ప్రశ్నలు సంగారెడ్డి జిల్లాలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.ప్రజా సమస్యలపై పత్రికల్లో వరుస కథనాలు వచ్చినప్పటికీ జిల్లా స్థాయి అధికారులు వాటిపై కనీసం విచారణకు ఆదేశించకుండా వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) చేసినట్లు పేర్కొంటున్న "పేపర్లో వస్తే స్పందించాలా? రోజుకు వంద వార్తలు వస్తాయి.. అలాగైతే ఉద్యోగం చేయలేను" అనే వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి.

**నెలలుగా ఎంపీఓ లేడు.. పంచాయతీల పరిస్థితి ఏంటి?**


కొండాపూర్ మండలంలో మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) పోస్టు నెలలుగా ఖాళీగా ఉన్నట్లు సమాచారం. కీలకమైన మండల స్థాయి అధికారి అందుబాటులో లేకపోవడంతో గ్రామ పంచాయతీల్లో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు, ఫిర్యాదులు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ, నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు వంటి అంశాల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవైపు గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతుంటే.. మరోవైపు వాటిని పర్యవేక్షించాల్సిన వ్యవస్థలోనే కీలక పోస్టు ఖాళీగా ఉండటం పంచాయతీ పరిపాలనపై అనుమానాలకు తావిస్తోంది.

**మల్కాపూర్ నిర్మాణం.. అధికారుల బాధ్యత ఎవరిది?**

మల్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇంటి నిర్మాణానికి సంబంధించి అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారన్న ఆరోపణలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. దస్తావేజుల్లో ఉన్న విస్తీర్ణానికి, నిర్మాణం జరిగిన విస్తీర్ణానికి తేడా ఉందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ వ్యవహారం చర్చకు వచ్చింది.ఈ అంశంపై జిల్లా పంచాయతీ అధికారిని వివరణ కోరినప్పుడు.. "ఇది కింది స్థాయి అధికారులు చూసుకోవాల్సిన విషయం" అన్నట్టుగా స్పందించడం మరింత ప్రశ్నలకు కారణమైంది.ప్రశ్న ఒక్కటే.. జిల్లా స్థాయిలో పర్యవేక్షణ బాధ్యత ఉన్న అధికారులకు పత్రికల్లో వెలువడిన అంశాలపై వివరాలు తెలుసుకునే బాధ్యత లేదా? కింది స్థాయి అధికారులు చర్యలు తీసుకున్నారా లేదా అని తెలుసుకోవడం కూడా ఉన్నతాధికారుల పరిధిలోకి రాదా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**పేపర్‌లో వార్త.. ఫైల్‌లో దరఖాస్తు.. అప్పుడే విచారణా?**

ప్రజల సమస్యను అధికారులు గుర్తించేందుకు తప్పనిసరిగా రాతపూర్వక ఫిర్యాదు చేయాలా? పత్రికల్లో వచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులు స్వయంగా వివరాలు సేకరించకూడదా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.పత్రికల్లో ప్రచురితమయ్యే ప్రతి వార్తపై విచారణ చేయడం సాధ్యం కాకపోయినా.. ప్రజా ప్రయోజనానికి సంబంధించిన తీవ్రమైన ఆరోపణలు



వెలువడినప్పుడు కనీసం సంబంధిత అధికారుల నుంచి నివేదిక కోరడం, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడం అధికారుల కనీస బాధ్యత అని ప్రజలు అంటున్నారు.

**"రోజుకు వంద వార్తలు" కాదు.. ఒక్కో వార్త వెనుక ఒక్కో సమస్య!**

"రోజుకు వంద వార్తలు వస్తాయి" అనే ధోరణితో ప్రజా సమస్యలను పక్కన పెడితే.. ఆ వార్త వెనుక ఉన్న బాధితుడి పరిస్థితి ఏమిటన్నదే అసలు ప్రశ్న.

మల్కాపూర్ నిర్మాణంపై వస్తున్న ఆరోపణలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.అదే సమయంలో కొండాపూర్ మండలంలో ఖాళీగా ఉన్న ఎంపీఓ పోస్టును వెంటనే భర్తీ చేసి గ్రామపంచాయతీల పరిపాలనను గాడిలో పెట్టాలని కోరుతున్నారు.ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు..సమస్యను చెప్పిన వారినే ప్రశ్నిస్తారా?

పత్రికల్లో వచ్చిన వార్తకు స్పందించకపోతే.. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపేది ఎవరు?ఇప్పుడు ఈ ప్రశ్నలకు పంచాయతీ శాఖ ఉన్నతాధికారులే సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది... దీనిపై జిల్లా పరిపాలన అధికారి సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బెజ్జంకిలో కాంగ్రెస్ భారీ ర్యాలీ

- **కేసీఆర్ రాజీనామా చేయాలి.. రసమయి భాష మార్చుకోవాలి**
- **కాంగ్రెస్ మండల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్**

**బెజ్జంకి, సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి)**

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజీనామా చేయాలని, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తన భాషను మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా లింగాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాకుండా తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. దళితుడు స్పీకర్‌గా ఉన్న అసెంబ్లీకి హాజరుకాకపోవడం దళితులను అవమానించడమేనని విమర్శించారు.

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణపై రసమయి బాలకిషన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అధికారం కోల్పోయిన బాధతోనే రసమయి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు, రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు, రుణమాఫీ, ఉచిత ఎరువులు, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆరోగ్యశ్రీ నిధులు, బీసీ బంధు, మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, ఇంటికో ఉద్యోగం వంటి హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఉచిత విద్యుత్, వ్యవసాయానికి ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,



మహిళా సంఘాలకు బస్సులు, పెట్రోల్ బంకులు, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు, పేదలకు సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేశామని, బీసీ కులగణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్ల కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్‌దేనని అన్నారు. తెలంగాణలో ప్రజా పాలన కొనసాగుతోందని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు.

బీఆర్ఎస్ నాయకులు ప్రజలు సంతోషంగా ఉండటం చూడలేకనే నిరసనలు చేస్తున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమై మళ్లీ అధికారంలోకి వస్తుందని లింగాల శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### రాజగోపాల్‌రెడ్డి..

## మాట మారిందా? లెక్క మారిందా?

- **నాడు రేవంత్‌పై రుసరుసలు.. నేడు 'విభేదాలే లేవు'!**
- **మంత్రి పదవి డిమాండ్ నుంచి సర్దుబాటు స్వరం వరకు**
- **కొండా సురేఖ ఎపిసోడ్ తర్వాత కొత్త రాజకీయ సమీకరణాలా?**

**వికారాబాద్ సెప్టెంబర్ 6 (వుదయం బ్యూరో)**




తెలంగాణ కాంగ్రెస్‌లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తాజా వైఖరి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై, నిధుల కేటాయింపుపై, తనకు మంత్రి పదవి ఇవ్వకపోవడంపై ఘాటుగా స్పందించిన రాజగోపాల్‌రెడ్డి.. ఇప్పుడు మాత్రం రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని చెప్పడం ఆసక్తిని రేపుతోంది. గతంలో అసంతృప్తి వ్యక్తం చేసిన అదే నాయకుడు ఇప్పుడు సీఎంతో సఖ్యతా సంకేతాలు ఇవ్వడం వెనుక రాజకీయ లెక్కలేంటన్న ప్రశ్న తెరపైకి వచ్చింది.

**నాడు.. మంత్రి పదవిపై పట్టుదల**

కాంగ్రెస్‌లోకి వచ్చినప్పటి నుంచి మంత్రి పదవి తనకు హామీ ఇచ్చారని రాజగోపాల్‌రెడ్డి పలుమార్లు చెప్పారు. ఇతరులకు పదవులు దక్కుతున్నా తనను ఎందుకు పక్కన పెడుతున్నారని ప్రశ్నించారు. మునుగోడుకు తగిన ప్రాధాన్యత, నిధులు లభించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిస్థితి మారకపోతే తీవ్రంగా స్పందిస్తానని హెచ్చరించారు.

**'బాంబు' నుంచి సీఎం సీటు సంకేతాల వరకు**

2026 ప్రారంభంలో ఆయన వ్యాఖ్యలు మరింత ఘాటుగా మారాయి. నిధుల విషయంలో అన్యాయం జరిగితే "బాంబు పేలుస్తా" అంటూ హెచ్చరించారు. మంత్రి పదవి దక్కకపోతే భవిష్యత్తులో సీఎం పదవిని లక్ష్యంగా చేసుకుంటానన్న తరహా వ్యాఖ్యలు కూడా రాజకీయ కలకలం రేపాయి. దీంతో రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి కేవలం మంత్రి పదవికే పరిమితమా? లేక పార్టీలో తన రాజకీయ పరిధిని పెంచుకునే వ్యూహమా? అన్న చర్చ సాగింది.

**మధ్యలో.. విమర్శలతో పాటు వివరణలు**

నిధుల కేటాయింపు, ప్రభుత్వ పనితీరు, ముఖ్యమంత్రి వ్యవహారశైలిపై రాజగోపాల్‌రెడ్డి బహిరంగంగా మాట్లాడారు. అయితే అదే సమయంలో సీఎంను వ్యక్తిగతంగా విమర్శించడం లేదని వివరణ ఇచ్చారు. దీంతో ఆయన రాజకీయ వైఖరిలో ఒకవైపు ఒత్తిడి.. మరోవైపు పూర్తి స్థాయి ఘర్షణకు దూరంగా ఉండే ధోరణి కనిపించింది.

**నేడు.. ఒక్కసారిగా మారిన స్వరం**

తాజాగా రాజగోపాల్‌రెడ్డి "రేవంత్‌రెడ్డిని ఎప్పుడూ దూషించలేదు.. ఒకట్రెండు అంశాల్లో మాత్రమే విభేదించాను.. ఇప్పుడు ఎలాంటి విభేదాలు లేవు" అని స్పష్టం చేశారు. మునుగోడుకు అభివృద్ధి నిధులు వస్తున్నాయని పేర్కొంటూ సీఎం కార్యక్రమాలకు కార్యకర్తలతో హాజరవుతానని చెప్పడం గత వైఖరితో పోలిస్తే స్పష్టమైన మార్పుగా కనిపిస్తోంది.

**కొండా సురేఖ ఎపిసోడ్.. అధిష్ఠానం వైపే చూపు**

కొండా సురేఖ వ్యవహారంలోనూ రాజగోపాల్‌రెడ్డి పార్టీ అధిష్ఠానం నిర్ణయమే తుది నిర్ణయమని పేర్కొన్నారు. పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలన్న ధోరణి వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించిన ఆయన.. ఇప్పుడు అధిష్ఠానం నిర్ణయాన్ని ముందుకు తేవడం రాజకీయంగా గమనించదగ్గ పరిణామం.

**నాడు–నేడు.. రాజకీయ లైన్**

నాడు: మంత్రి పదవిపై బహిరంగ డిమాండ్ | నేడు: అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్నాడు: మునుగోడు నిధులపై అసంతృప్తి | నేడు: నిధులు వస్తున్నాయని సానుకూల వ్యాఖ్య

నాడు: ప్రభుత్వంపై ఘాటు హెచ్చరికలు | నేడు: రేవంత్‌తో విభేదాలు లేవని వివరణ

నాడు: పోరాట స్వరం | నేడు: సర్దుబాటు స్వరం

**అసలు టర్న్ వెనుక లెక్కేంటి?**

రాజగోపాల్‌రెడ్డి వైఖరి ఎందుకు మారిందనే దానిపై అధికారికంగా స్పష్టత లేదు. అయితే మంత్రి పదవి అంశం మాత్రం కీలకంగా ఉంది. కేబినెట్ విస్తరణ చర్చల్లో ఆయన పేరు వినిపిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రితో నేరుగా ఘర్షణకు వెళ్లకుండా సానుకూల వైఖరి అవలంబించడం రాజకీయంగా ప్రయోజనకరమనే అంచనాలు ఉన్నాయి. మరోవైపు కాంగ్రెస్‌లో మారుతున్న అంతర్గత సమీకరణాలు, అధిష్ఠానం జోక్యం కూడా ప్రభావం చూపి ఉండవచ్చనే విశ్లేషణ ఉంది.

**రాజకీయ విశ్లేషణ**

రాజగోపాల్‌రెడ్డి తాజా వైఖరిని పూర్తి స్థాయి యూటర్న్‌గా ఇప్పుడే తేల్చడం తొందరపాటు. అయితే నాటి ఘాటు వ్యాఖ్యలతో పోలిస్తే నేటి సానుకూల స్వరం మాత్రం స్పష్టమైన రాజకీయ మార్పు. ఇది మంత్రి పదవి కోసం వ్యూహాత్మక సర్దుబాటా? పార్టీలో తన స్థానాన్ని బలోపేతం చేసుకునే ప్రయత్నమా? లేక భవిష్యత్ రాజకీయ లక్ష్యానికి ముందు వేసిన అడుగా? అన్నది తేలాల్సి ఉంది. మంత్రి పదవిపై అధిష్ఠానం నిర్ణయమే అసలు పరీక్ష. పదవి వస్తే సఖ్యత మరింత బలపడుతుందా? రాకపోతే మళ్లీ అసంతృప్తి బయటపడుతుందా? తెలంగాణ కాంగ్రెస్‌లో ఇప్పుడు అసలు ఆసక్తి ఇదే. మాట మారింది.. ఇక లెక్క ఎంత వరకు మారిందో చూడాలి.

## సృష్టిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

### ఎంపీ రఘునందన్ రావు

- **గజ్వేల్‌లో ఘనంగా ట్రస్మా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవం**
- **ఉపాధ్యాయుల రక్షణ చట్టం తెచ్చేందుకు కట్టుబడి ఉంటానని వెల్లడి**

**గజ్వేల్, సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి)**



సృష్టిలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు మార్పు చెందుతూ శిక్షణతో కూడిన విద్య ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానివ్వాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్‌లో సిద్దిపేట జిల్లా ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రదానోత్సవ' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇటీవల విద్యార్థుల చేతిలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు రూపా రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. నేటి కాలంలో ఉపాధ్యాయ వృత్తి కత్తి మీద సాములా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వకాలం నుండి గురువు స్థానానికి ఉన్న గౌరవాన్ని కాపాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు తీవ్రంగా శ్రమిస్తున్నారన్నారు. ఒకప్పుడు విద్యార్థులను దండించి సరైన మార్గంలో పెట్టేవారని, కానీ నేడు దండించే అధికారం లేకపోవడంతో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యాబుద్ధులు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల రక్షణకు చట్టాలు ఉన్నట్లే ఉపాధ్యాయుల రక్షణకు కూడా ప్రత్యేక చట్టం ఉంటేనే ఈ వృత్తికి మనుగడ ఉంటుందని, ఉపాధ్యాయ రక్షణ చట్ట రూపకల్పన కోసం తాను శ్రమిస్తానని హామీ ఇచ్చారు. నూతన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా సమానమైనదని స్పష్టం చేశారు.అనంతరం జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులను ప్రజాప్రతినిధులు, ట్రస్మా నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ చందన రాజలింగం, మాజీ ఎఫ్డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి ఇన్నారెడ్డి, కోశాధికారి ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడు సోమేశ్వర్ రెడ్డి, రాజు, గజ్వేల్ ట్రస్మా అధ్యక్షుడు మనోజ్ కుమార్ రెడ్డి, కార్యదర్శి సంతోష్‌కుమార్, ట్రెజరర్ విశ్వనాథ్, గజ్వేల్ ఎంఈఓ కృష్ణ, వివిధ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొల్లాపూర్ ఇన్చార్జిగా నియామకం

### తెలంగాణ రక్షణ సేన పార్టీ విస్తరణపై చిన్నంబావిలో సమీక్ష

- **పగిడాల శ్రావణి సుడిగాలి పర్యటన**

**చిన్నంబావి మండలం 06 ( వుదయం రిపోర్టర్ )**



చిన్నంబావి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో తెలంగాణ రాక్షణ సేన పార్టీ కొల్లాపూర్ నియోజక వర్గ ఇన్చార్జి పగిడాల శ్రావణి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను ఆమె ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ రంగంలో ఇబ్బందులు, స్థానికంగా నెలకొన్న ప్రజా సమస్యలపై ఆమె ప్రత్యేకంగా దృష్టి సారించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని పగిడాల శ్రావణి డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. రైతుల సమస్యలపై ప్రెస్‌మీట్ నిర్వహించిన పగిడాల శ్రావణి, రైతులు మరియు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మీడియా దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు అండగా నిలవడంతో పాటు, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆమె కోరారు. రైతు సమస్యలే ప్రధాన అజెండాగా ప్రజల పక్షాన తెలంగాణ రక్షణ సేన పోరాడుతుందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. చిన్నంబావిలో పగిడాల శ్రావణి పర్యటనకు స్థానికంగా ప్రాధాన్యత లభించింది. రైతులు, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిపై స్పందించడం ద్వారా ప్రజా సమస్యలపై తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆమె తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందచేసిన కేంద్ర మంత్రి కిషన్



**నారాయణపేట సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి)**

అనారోగ్యంతో చికిత్స పొందిన నారాయణపేట జిల్లా కేంద్రం దూల్ పేటకు చెందిన దత్తురావు ఆదివారం హైద్రాబాద్ లోని తన కార్యాలయంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి 60 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు.సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామా జీ మాట్లాడుతు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు కావడానికి సహకరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# పరిశుద్ధ కార్మికుని కుమార్తె కు ఎంబీబీఎస్ సీట్

- వైద్య విద్యా రంగంలో సాధించిన విజయం"
- కష్టాన్ని నమ్ముకుని కల నిజం చేసుకొన్నా అఖిల "
- శ్రామికుని బిడ్డకు ఎంబీబీఎస్ సీటు!

**కోహీర్ సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి )**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో కోహీర్ మున్సిపల్ ఒక పేద కుటుంబపు ప్రతిభ పాఠకులను, గ్రామీణ యువతను ఎంతగానో ఆకట్టుకుంటోంది.స్థానిక భీమ్‌నగర్ కాలనీకి చెందిన బైండ్ల రవికాంత్ గత 20 సంవత్సరాలుగా పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.తండ్రి పడుతున్న కష్టాన్ని, సమాజంలో ఆయన పడే శ్రమను కళ్లారా చూసిన కుమార్తె అఖిల చిన్ననాటి నుంచే చదువులో రాణించాలని నిశ్చయించుకుంది.తండ్రి వేమించిన చెమట బొట్టునే తన ఆయుధంగా మార్చుకుని, క్రమశిక్షణతో విద్యనభ్యసించింది.కొల్చారం.సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అఖిల 978 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకుంది. అనంతరం జాతీయ స్థాయి నీట్ (NEET) ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. తన పట్టుదల, కఠిన శ్రమ ఫలితంగా సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ (MBBS) సీటును దక్కించుకుంది.ఎటువంటి ఆర్థిక వెసులుబాటు లేకపోయినా, గురుకుల విద్యను సద్వినియోగం చేసుకుని ఈ ఘనత సాధించడం విశేషం. కష్టపడే తత్వానికి, అంకితభావానికి పేదరికం అడ్డంకి కాదని అఖిల తన విజయంతో నిరూపించింది.వైద్యురాలై సమాజానికి సేవ చేయడమే తన జీవిత లక్ష్యమని ఈ సందర్భంగా అఖిల తెలిపింది.ఒక సామాన్య పారిశుధ్య కార్మికుడి ఇంట్లో డాక్టర్ కాబోతున్న కూతురు ఉండటం ఆ కుటుంబానికే కాక కోహీర్ ప్రాంతానికే గర్వకారణంగా మారింది. అఖిల సాధించిన ఈ విజయం స్థానిక గ్రామీణ విద్యార్థులకు, నిరుపేద కుటుంబాలకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తోంది. ఆమె సాధించిన అద్భుత విజయాన్ని చూసి కాలనీ వాసులు, స్థానిక నాయకులు, అధికారులు ఆమెను అభినందించారు. సామాజిక, ఆర్థిక ఇబ్బందులను జయించి మెడికల్ సీటు సాధించిన అఖిల ప్రయాణం అందరికీ ఆదర్శప్రాయం.భవిష్యత్తులో అఖిల ఉత్తమ వైద్యురాలిగా ఎదిగి,
సమాజానికి మరింత సేవ అందిం

# హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

**(సెప్టెంబర్ 4 బషీరాబాద్ వుదయం) .**





గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు,420 హామీలు అమలు చేస్తామని మోసపూరిత మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఆరోపించారు. అంబేద్కర్ చౌరస్తా నుండి భారీగా తరలి వెళ్లి వివేకానందుని విగ్రహం దగ్గర సమావేశ ఏర్పాటు చేశారు.ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల దగా పాలనలో భాగంగా పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం, అధ్వానంగా మారిన రోడ్లపై నిరసన సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. టిఆర్ఎస్ హయంలోనే బషీరాబాద్ మండలం సమగ్రంగా అభివృద్ధి సాధ్యపడింది అన్నారు. ఇక్కడ నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే పేద విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేశానన్నారు. నాపరాతి గనుల్లో పనిచేసే కార్మికులను, గిరిజన తండా వాసులను దృష్టిలో ఉంచుకొని ఏదైనా ప్రమాదం వాటిల్లితే మెరుగైన వైద్యం అందించేందుకు ఆసుపత్రి స్థాయిని అప్డేట్ చేయడం జరిగిందన్నారు. ఇవన్నీ మీ బిడ్డ రోహిత్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నిధులు మంజూరు చేయించానని గుర్తు చేశారు. కాగా ఇప్పుడున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తానే చేయించినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ

**చెప్పిందే జరిగింది..**

మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, తాండూర్ ఎమ్మెల్యేగా గత ఎన్నికల ముందు గొంతు చించుకొని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతు బీమా, బందు ఉండవని చెప్పామన్నారు. ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా కెసిఆర్ హయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సంక్షేమ పథకాలను శ్రీకారం చుట్టగా... కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని తొలగించిందన్నారు. వచ్చే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో మీ గ్రామాల్లోకి వచ్చే ఓట్లు అడుగుతారని... అప్పుడు ఆరు గ్యారెంటీలపై ప్రశ్నించాలన్నారు.

**టిఆర్ఎస్ సర్పంచుల పై వివక్ష తగదు**

బషీరాబాద్ మండలంలోని అత్యధికంగా బిఆర్ఎస్ పార్టీ తరఫున సర్పంచులు గెలుపొంది ఉన్నారని, వారికి నిధులు కేటాయించడంలో వివక్షత చూపించినట్లయితే రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన బుద్ధి చెబుతారన్నారు. అభివృద్ధి పేరిట చేపట్టిన బిల్లులను నిలిపివేస్తే సహించేదే లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు (నర్సిరెడ్డి) పటేల్. 18 మంది సర్పంచులు సీనియర్ నాయకులు. పిఎసిఎస్ డైరెక్టర్ అశోక్ గౌతం. మాజీ మహిళా సర్పంచ్ మండల అధ్యక్షులు జయమ్మ నర్సింలు. యువ నాయకుడు తాహీర్ బాండ్. నాసిరు. వెంకట్ రెడ్డి.పార్టీ ఆయా సర్పంచులు,. మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## చారిత్రక ధర్మపురిలో రూ.10 కోట్లతో

# శ్రీ ఉగ్ర నరసింహ ఆలయ పునర్నిర్మాణం..

- ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి నేడు భూమి పూజ హాజరుకానున్న ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క

**ధర్మపురి సెప్టెంబర్06 (వుదయం ప్రతినిధి):**



దక్షిణ కాశీగా,ప్రసిద్ధ త్రిమూర్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న ధర్మపు రిలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ ఉగ్ర నరసింహ స్వామివారి ఆలయ పునర్నిర్మాణ పనులకు నేడు అంకురార్పణ జరగ నుంది. ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించ గా,నేడు రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క,మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించను న్నారు. ప్రస్తుత మున్న 990 చదరపు అడుగుల ఉగ్ర నరసింహ ఆలయాన్ని, భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రముఖ స్థపతుల ఆధ్వర్యంలో ఆగమ శాస్త్ర ప్రకారం పునర్ని ర్మించనున్నారు. ధర్మ వర్మ మహా రాజు పాలించిన ఈ క్షేత్రం, బహుమనీ సుల్తానుల దండ యాత్రల్లో ధ్వంసమై,తిరిగి 17వ శతాబ్దంలో పున రుద్ధరించబడి నట్లు శాసనాలు చెబుతున్నాయి.గోదావరి నది దక్షిణ వాహిని గా ప్రవహిస్తుండటంతో పాటు బ్రహ్మ, విష్ణు,మహేశ్వరులు కొలు వుదీరిన త్రిమూర్తి క్షేత్రంగా ధర్మ పురి ప్రసిద్ధి చెందింది. అలాగే ఇక్కడ యమధర్మ రాజు ఆల యం ఉండటం దేశంలోనే విశేషం.
ఈ చారిత్రక కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కు మార్,పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు హాజరుకాను న్నారు.



# విద్యార్థి వికాసమే లక్ష్యంగా అంకితభావంతో బోధన

- రవీంద్రభారతిలో కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు అవార్డు ప్రధానం.

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 06(వుదయం)**




విద్యార్థుల సర్వతోముఖ వికాసమే లక్ష్యంగా అంకితభావంతో పనిచేస్తున్న రాయపోల్ మండలం కొత్తపల్లి ఎంపీయూపీఎస్ ఉపాధ్యాయులు జి. నాగరాజుకు జాతీయ స్థాయి 'భారత్ గురు రత్న అవార్డు-2026' లభించింది. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా సేవా ధర్మంగా భావిస్తూ విద్యార్థుల పట్ల ప్రేమ, శ్రద్ధ, సహనంతో ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కింది.సంప్రదాయ బోధనా పద్ధతులకు భిన్నంగా కృత్యాధార, అనుభవపూర్వక బోధనకు నాగరాజు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆటలు, బొమ్మలు, వివిధ రకాల బోధనాభ్యసన సామగ్రి వినియోగిస్తూ విద్యార్థులు భయరహిత వాతావరణంలో ఆనందంగా నేర్చుకునేలా ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థుల్లో అభ్యసన ఆసక్తిని పెంపొందిస్తూ, తరగతి గదిలో చురుకైన భాగస్వాములుగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషి ప్రత్యేక ప్రశంసలు అందుకుంది.విద్యార్థుల మనసులను ప్రేమతో గెలుచుకుంటూ, తల్లిదండ్రుల ఆదరణ పొందుతూ, తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్న నాగరాజు సేవలను గుర్తించిన శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపిక చేసింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి పైడి జయరాజ్ హాల్‌లో సెప్టెంబర్ 6న నిర్వహించిన 'భారత్ గురు రత్న అవార్డు-2026' ప్రదానోత్సవంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్, శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పట్నం కమల మనోహర్ చేతుల మీదుగా జి. నాగరాజు అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, విద్యాభిమానులు నాగరాజును అభినందిస్తూ, విద్యార్థుల అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషి మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

# ధర్మపురిలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరసన

- బాకీ కార్డుల పంపిణీ

**ధర్మపురి,సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి):**



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కి వచ్చి 1000 రోజులుపూర్తయిన సందర్భంగా, ఇచ్చిన హామీల అమలులో విఫలమైం దంటూ ధర్మపురి పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణ శాఖ ఆధ్వ ర్యంలో కూరగాయల మార్కెట్, నంది చౌక్,బస్టాండ్,15వ వార్డు లలో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు.
వెయ్యి రోజుల్లో ఆరు గ్యారంటీలు,420 హామీలను అమలు చేస్తామని మోసం చేశారని, 33 నెలల పాలనలో ప్రజలకు రావా ల్సిన బకాయిలను ఈ కార్డుల ద్వారా ప్రజలకు వివరించినట్లు నాయకులు తెలిపారు.మహిళ లకు నెలకు రూ.2500 చొప్పున 33 నెలలకు రూ.82 వేల,500 బాకీ.వృద్ధులు, బీడీ కార్మికులకు పెన్షన్ రూ.4000 చొప్పున రూ.66 వేలు బాకీ.దివ్యాంగులకు పెన్షన్ రూ.6000 చొప్పున రూ.66 వేలు బాకీ.కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం బాకీ.రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ మరియు వరి పంటకు రూ.500 బోనస్ బకాయిలు. నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, భృతి కింద రూ.1లక్ష 32 వేలు బాకీ. విద్యా ర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.12వేల కోట్లు,స్కూటీలు బాకీ.రైతు కూలీలు,ఆటో కార్మి కులకు సంవత్సరానికి రూ.12వేల చొప్పున బకాయిలు ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమార్, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, నాయకులు సంగి శేఖర్, పెరుమాండ్ల ఎల్లగౌడ్, చిర్నెని నర్సయ్య, చుక్క రవి, బండారి అశోక్, తరాల కార్తీక్, అనంతుల లక్ష్మణ్, మురికి శ్రీనివాస్, బాకీ శేఖర్, జెట్టి రాజన్న, నక్క రాజేందర్, సంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎక్కడ

- చిన్నగొట్టిముక్లలో బాకీ కార్డులు పంపిణీ చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**శివ్వంపేట,వుదయం:**



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మాజీ మంత్రి, నర్సాపూర్ సునీతాలక్ష్మారెడ్డి విమర్శించారు. శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమణ గౌడ్ ఆధ్వర్యంలో ప్రజలకు బాకీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను గుర్తు చేస్తూ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు నెలకు రూ.2,500 నగదుసాయం, పింఛన్లు, రైతులకు సంబంధించిన హామీలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద తులం బంగారం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు ఇచ్చిన
హామీలు తుంగలో తొక్కిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేయడానికే బాకీ కార్డులు అని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చెల్లించాల్సిన బాకీలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడమే కార్యక్రమం ఉద్దేశమని ఆమె తెలిపారు. ఇంటింటికీ వెళ్లి కార్డులను పంపిణీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమణ గౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, జడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, సర్పంచ్ నారాయణరావు, ఉప సర్పంచ్ పాపయ్య చారి, వివిధ గ్రామాల సర్పంచులు కొమురయ్య, తేజస్విని రాజేందర్ నాయక్, బేగరి నర్సయ్య, బీఆర్ఎస్ నాయకులు కాంతారావు, నరసింహారెడ్డి, బిక్షపతి రెడ్డి, కుంట లక్ష్మణ్, రేణు కుమార్, లక్ష్మీనర్సయ్య, బోళ్ల ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రామాయంపేట నియోజకవర్గ పునరుద్ధరణకు జర్నలిస్ట్ ల రిలే దీక్షలు : బీజేపీ మద్దతు

**రామాయంపేట,సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి )**

రామాయంపేట నియోజకవర్గాన్ని తిరిగి పునరుద్ధరించాలనే డిమాండ్‌తో నిజాంపేట మండల కేంద్రంలో పాత్రికేయ మిత్రులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు భారతీయ జనతా పార్టీ నాయకులు మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు.
ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ రామాయంపేట నియోజకవర్గ పునరుద్ధరణ కోసం జరుగుతున్న ఉద్యమానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గ పునరుద్ధరణకు సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, నిజాంపేట బీజేపీ మండల అధ్యక్షుడు పప్పుల సిద్ధిరామిరెడ్డి, పాత్రికేయ మిత్రులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ ఇంధన వనరుల

# వినియోగాన్ని పెంచాలి

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు...
- శబాష్పల్లిలో ఈవీ చార్జింగ్ స్టేషన్ ను ప్రారంభిస్తున్న ఎంపి రఘునందన్రావు.

**శివ్వంపేట, వుదయం**

పెరుగుతున్న ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగాన్ని ప్రజలు విస్తృతంగా చేపట్టాలని మెదక్ ఎంపీ రఘునందన్రావు సూచించారు. ఆదివారం శబాష్పల్లి శివారులో అయ్యవారి షాధుల్ల ఏర్పాటు చేసిన ఆర్జీఎన్ ఈవీ ఛార్జింగ్ స్టేషనన్ను జిల్లా పార్టీ అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దపులి రవితో కలిసి ఎంపీ ప్రారంభించి మాట్లాడారు. వివిధ దేశాల్లో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా అంతర్జాతీయ మార్కెట్ లో క్రూడాయిల్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్రజలను ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు మళ్లిస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం రూ.70 వేల వరకు సహాయం అందిస్తోందని ఎంపీ పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ తో పాటు ఎలక్ట్రిక్ వాహనాలను విరివిగా వినియోగించాలని సూచించారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే ప్రతి కుటుంబం ఎలక్ట్రిక్ వాహనం వినియోగించే స్థాయికి చేరుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బ్రాహ్మణపల్లి వద్ద రైలు రాకపోకల వల్ల తరుచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురుకుంటున్నామని ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని ఎంపిని ప్రజలు కోరడంతో వెంటనే రైల్వే అధికారులతో మాట్లాడారు. త్వరలోనే ఫ్లైఓవర్కు శంఖుస్థాపన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అయ్యవారి యాదగిరి, అల్లీపూర్ సర్పంచ్ చింతకాయల కుమార్, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యాక్షులు రమేష్ గౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎరుకలి బిక్షపతి, నర్సాపూర్ పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, కొండల్రావు, అశోక్ సాదుల, మామిడి నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 34 ఏళ్ల విద్యా సేవకు 'శిక్షా రత్న–2026'

- వికాస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే. శ్రీనివాస్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం
- విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన సేవలకు గుర్తింపు | హరి విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానం

**వికారాబాద్ సెప్టెంబర్ 7( వుదయం బ్యూరో)**



విద్యా రంగంలో మూడు దశాబ్దాలకు పైగా అంకితభావంతో సేవలందించిన వికాస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే. శ్రీనివాస్కు ప్రతిష్ఠాత్మక 'శిక్షా రత్న-2026' అవార్డు లభించింది. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హరి విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యా రంగంలో విశేష సేవలు అందించిన వారికి ఈ పురస్కారాలను ప్రదానం చేశారు.హైదరాబాద్‌లోని హరి విశ్వవిద్యాలయం కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం నిర్వహించిన 'శిక్షా రత్న-2026' అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో కే. శ్రీనివాస్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యా కమిషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హరి విశ్వవిద్యాలయం ఉపకులపతి, రిజిస్ట్రార్‌తో పాటు పలువురు విద్యా రంగ ప్రముఖులు పాల్గొని అవార్డులను ప్రదానం చేశారు.

**34 సంవత్సరాల ప్రస్థానానికి అరుదైన గుర్తింపు**

వికారాబాద్ ప్రాంతంలో గత 34 సంవత్సరాలుగా విద్యా రంగంలో కొనసాగుతున్న శ్రీనివాస్, అధ్యాపకుడిగా, ట్యూటర్‌గా, ప్రిన్సిపాల్‌గా వివిధ హోదాల్లో సేవలందించారు. వేలాది మంది విద్యార్థులకు విద్యా బోధన అందిస్తూ వారి భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసిన ఆయన సుదీర్ఘ సేవలను గుర్తించిన 'శిక్షా రత్న-2026' ఎంపిక కమిటీ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపిక చేసింది.అవార్డు అందుకున్న సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. 34 సంవత్సరాల విద్యా సేవలకు ఈ పురస్కారం లభించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. కష్టపడి పనిచేసే వారికి లభించే అవార్డులు, గుర్తింపులు మరింత బాధ్యతతో పనిచేయడానికి రెట్టింపు ఉత్సాహాన్ని అందిస్తాయని అన్నారు.
విద్యార్థుల విద్యాభివృద్ధి, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం తన సేవలను కొనసాగిస్తానని శ్రీనివాస్ పేర్కొన్నారు. తనను 'శిక్షా రత్న-2026' అవార్డుకు ఎంపిక చేసిన హరి విశ్వవిద్యాలయం నిర్వాహకులకు, ఎంపిక కమిటీ సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.సుదీర్ఘ విద్యా ప్రస్థానానికి దక్కిన ఈ గౌరవంతో వికాస్ జూనియర్ కళాశాలలో హర్షం వ్యక్తమవుతోంది. శ్రీనివాస్‌కు లభించిన 'శిక్షా రత్న-2026' పురస్కారం వికారాబాద్ విద్యా రంగానికి కూడా గర్వకారణంగా నిలిచింది.



# ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్

- రూ.లక్షల విలువైన సొత్తు, స్కూటీ స్వాధీనం
- పోలీసుల సమయస్ఫూర్తిని అభినందించిన సీపీ రష్మీ పెరుమాళ్

**సిద్దిపేట, సెప్టెంబర్ 6 (వుదయం బ్యూరో)**

సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో వరుసగా ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ విద్యాసాగర్ వెల్లడించారు. దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన ఆస సుదర్శన్ (35) అనే డ్రైవర్, డబ్బుల కోసం గ్రామీణ ప్రాంతాల్లోని గుళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు.
గతంలో పలు మోటారు సైకిల్ దొంగతనాల కేసుల్లో జైలుకు వెళ్లిన నిందితుడు, ఇటీవల నాంచారుపల్లి, ఇర్కోడు, రాఘవాపూర్, బదనకల్ గ్రామాల్లోని ఆలయాల్లో హుండీలతో పాటు పలు గంటలను దొంగిలించి స్క్రాప్ షాపుల్లో విక్రయించాడు. ఈ నెల 5న బురుగుపల్లి ఎల్లమ్మ గుడి వద్ద మరో దొంగతనానికి యత్నిస్తుండగా పోలీసులు సమయస్ఫూర్తితో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి ఒక స్కూటీ, హెల్మెట్, రించ్ పానా, దొంగిలించిన కొన్ని గంటలను స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్న సీఐ, ఎస్ఐ డి.నవత, హెచ్‌సీ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు రాజు, రవికాంత్, మల్లేష్, నాగరాజు, ప్రవీణ్, రాకేష్, ప్రదీప్, మహేష్‌లను సీపీ రష్మీ పెరుమాళ్ అభినందించారు.

# కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ విమర్శలు అర్థరహితం..

- శంకర్ పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి..

**శంకర్ పల్లి సెప్టెంబర్ 06 (వుదయం)**



కాంగ్రెస్ ప్రభుత్వం దగా ప్రభుత్వం అంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు రాజకీయ దురుద్దేశంతోనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, మహిళల సంక్షేమం, యువతకు ఉపాధి, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పేరుకు పోయిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాం" అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమం-అభివృద్ధిని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన వారు.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు.శంకర్‌పల్లి మండలంలో కూడా సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే యాదయ్య అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, గ్రామాలు, మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని పేర్కొన్నారు.ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.. ఎవరిది మాటల ప్రభుత్వం, ఎవరిది చేతల ప్రభుత్వమో ప్రజలకు తెలుసు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షాన నిలిచి పని చేస్తోంది. ప్రతిపక్షాల విమర్శలకు ప్రజల అభివృద్ధే మా సమాధానం అని బొల్లారం వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

# చక్కని ఆరోగ్యం

## గుండె జబ్బుల ముప్పును తెలుసుకునేందుకు ఉపయోగపడే అద్భుతమైన టెస్ట్ ఇది..



గుండె ఆరోగ్యం గురించి తెలుసుకోవాలంటే సాధారణంగా కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకోవడం తెలిసిందే. ముఖ్యంగా ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్), హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్), ట్రైగ్లిజరైడ్స్, మొత్తం కొలెస్ట్రాల్ స్థాయిలను పరిశీలిస్తారు. అయితే కొలెస్ట్రాల్ స్థాయిలు సాధారణంగా ఉన్నప్పటికీ కొందరిలో గుండె జబ్బుల ముప్పు ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో రక్తంలోని కొలెస్ట్రాల్‌ను మోసుకెళ్లే హానికరమైన కణాల సంఖ్యను అంచనా వేసే అపోబీ (ApoB) పరీక్ష మరింత సమాచారం అందిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. అపోబీ అంటే అపోలిపోప్రొటీన్ బీ. రక్తంలో ఉండే ధమనులను అడ్డుకునే అవకాశం ఉన్న కొలెస్ట్రాల్ మోసే కణాలను ఈ పరీక్ష అంచనా వేస్తుంది. చెడు కొలెస్ట్రాల్‌తో పాటు ఇతర ధమనుల్లో ఫలకం (ప్లాక్) ఏర్పడటానికి కారణమయ్యే లిపోప్రొటీన్ కణాల్లో ఒక్కో కణానికి ఒక అపోబీ ప్రొటీన్ ఉంటుంది. అందువల్ల రక్తంలో ఇలాంటి కణాలు ఎన్ని ఉన్నాయో తెలుసుకోవడానికి అపోబీ పరీక్ష ఉపయోగపడుతుంది. సాధారణ లిపిడ్ ప్రొఫైల్‌లో మొత్తం కొలెస్ట్రాల్, ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్), హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్), ట్రైగ్లిజరైడ్స్ వంటి అంశాలను కొలుస్తారు. దీని ద్వారా రక్తంలో ఎంత కొలెస్ట్రాల్ ఉందో తెలుసుకునే వీలు ఉంటుంది. అయితే అపోబీ పరీక్ష మాత్రం ఆ కొలెస్ట్రాల్‌ను మోసుకెళ్తున్న కణాల సంఖ్యపై దృష్టి పెడుతుంది. అందువల్ల సాధారణ కొలెస్ట్రాల్ పరీక్ష కంటే గుండెకు సంబంధించిన ప్రమాదాన్ని మరో కోణంలో అంచనా వేయడానికి ఇది సహాయపడుతుంది. కొన్ని సందర్భాల్లో ఎల్‌డీఎల్ స్థాయి సాధారణంగా ఉన్నప్పటికీ అపోబీ స్థాయి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అంటే రక్తంలో కొలెస్ట్రాల్ పరిమాణం సాధారణంగా కనిపించినా, ధమనుల్లో ఫలకం ఏర్పడటానికి కారణమయ్యే కణాల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అందువల్ల ఇలాంటి పరిస్థితుల్లో అపోబీ పరీక్ష గుండె జబ్బుల ముప్పును గుర్తించడంలో ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మధుమేహం, మెటబాలిక్ సిండ్రోమ్, ఊబకాయం, అధిక ట్రైగ్లిజరైడ్స్ వంటి సమస్యలు ఉన్నవారిలో అపోబీ పరీక్ష ద్వారా అదనపు సమాచారాన్ని పొందవచ్చు. అలాగే చిన్న వయసులోనే కుటుంబంలో గుండె జబ్బులు వచ్చిన చరిత్ర ఉన్నవారికి కూడా ఈ పరీక్ష ఉపయోగపడే అవకాశం ఉంది. కాబట్టి కొలెస్ట్రాల్ రిపోర్ట్ సాధారణంగా ఉందని మాత్రమే గుండె జబ్బుల ముప్పు పూర్తిగా లేదని భావించకూడదు. మధుమేహం ఉన్నవారు, ఊబకాయం ఉన్నవారు, మెటబాలిక్ సిండ్రోమ్ ఉన్నవారు, ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉన్నవారు, కుటుంబంలో ముందుగానే గుండె జబ్బులు వచ్చిన చరిత్ర ఉన్నవారు, ఇప్పటికే స్టాటిన్స్ వంటి కొలెస్ట్రాల్ తగ్గించే మందులు తీసుకుంటున్నవారు అపోబీ పరీక్ష గురించి వైద్యుడిని సంప్రదించవచ్చు. లిపోప్రొటీన్ (ఎ) స్థాయిలు పెరిగినవారికి కూడా ఈ పరీక్షను పరిగణనలోకి తీసుకోవచ్చు. అపోబీ స్థాయిని సాధారణంగా మిల్లీగ్రాములు ప్రతి డెసిలీటర్ (mg/dL)లో కొలుస్తారు. చాలా మంది పెద్దలకు 90 mg/dL కంటే తక్కువ స్థాయిని కోరదగినదిగా పరిగణిస్తారు. గుండె జబ్బుల ముప్పు ఎక్కువగా ఉన్నవారిలో 80 mg/dL కంటే తక్కువ స్థాయిని లక్ష్యంగా పెట్టుకోవచ్చు. ఇప్పటికే గుండె జబ్బులకు చాలా ఎక్కువ ముప్పు ఉన్నవారిలో 65 mg/dL కంటే తక్కువ స్థాయిని లక్ష్యంగా చేసుకునే సందర్భాలున్నాయి. 90 నుంచి 119 mg/dL మధ్య స్థాయిలను పెరిగినవిగా, 120 mg/dL లేదా అంతకంటే ఎక్కువ స్థాయిని అధికంగా పరిగణించవచ్చు. అయితే వ్యక్తి వయసు, ఇతర ఆరోగ్య సమస్యలు, మొత్తం గుండె జబ్బుల ముప్పును బట్టి లక్ష్య స్థాయిలు మారుతాయి. అపోబీ స్థాయిలను నియంత్రించేందుకు జీవనశైలిలో కొన్ని మార్పులు సహాయపడతాయి. మెడిటరేనియన్ తరహా ఆహారం తీసుకోవడం, పీచుపదార్థాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం, బరువును నియంత్రణలో ఉంచుకోవడం, ధూమపానాన్ని మానేయ డం, మధుమేహాన్ని మెరుగ్గా నియంత్రించడం వంటివి అందులో ఉన్నాయి.

## ప్రొటీన్లతో అలసట మాయం!



ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులతో క్షణం తీరిక ఉండదు. మరోవైపు ఆఫీసులో ఒత్తిడి, అలసటతో సతమతమవుతాం. ఇలాంటి బిజీ లైఫ్‌స్టైల్‌తో ఎదురయ్యే అలసటను దూరం చేసుకొని చురుగ్గా మారాలంటే ప్రొటీన్లు నిండిన ఆహార పదార్థాలను రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలని చెబుతున్నారు నిపుణులు. ప్రొటీన్లతో నిండిన బాదంపప్పు, పిస్తా, అక్రోట్.. వంటి గింజలను ప్రతిరోజూ మితంగా తీసుకోవడం మంచిది. అవి గుండెకు మేలు చేస్తాయట. సలాడ్లు, ఉడికించిన కూరగాయలతో కూడా వీటిని కలుపుకొని తినొచ్చు. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

కండరాల నిర్మాణానికి తోడ్పడే ప్రొటీన్లు పాలు, పాల పదార్థాల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటు అదుపులో ఉంచడానికీ తోడ్పడతాయట. ఈ క్రమంలో తక్కువ కొవ్వులుండే పాల పదార్థాలను తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

సోయాబీన్స్‌లో ప్రొటీన్ల మోతాదు ఎక్కువ. వీటిని సోయా పాలు, సోయా పేస్ట్, టోఫూ రూపంలోనూ తీసుకోవచ్చు. అయితే ఇవి కొంతమందికి పడకపోవచ్చు. అలాంటి వారు వీటిని తీసుకునే విషయంలో వైద్యులను సంప్రదించాలి. బఠాణీలు, రాజ్మా, బీన్స్, చిక్కుళ్లు, ఇతర కూరగాయల్లోనూ ప్రొటీన్ ఉంటుంది. చేపల్లో ప్రొటీన్లతో పాటు గుండెకు మేలు చేసే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలూ ఎక్కువగానే ఉంటాయి.

మాంసాహారంలోనూ ప్రొటీన్లు మెండుగా ఉంటాయి. అయితే వీటిలో కొవ్వులు కూడా ఎక్కువగా ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవాలంటున్నారు నిపుణులు. కోడిగుడ్డులో కూడా ప్రొటీన్ ఉంటుంది. కానీ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్న వారు, గుండెజబ్బులు.. వంటి సమస్యలున్న వారు డాక్టర్ సలహా తీసుకున్న తర్వాతే వీటిని ఆహారంలో చేర్చుకోవాలి.


## జీరో క్యాలరీలు అని చెప్పి కృత్రిమ స్వీటెనర్లను అధికంగా ఉపయోగిస్తున్నారా.. అయితే జాగ్రత్త..

కృత్రిమ స్వీటెనర్లను చక్కెరకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలుగా చాలామంది భావిస్తుంటారు. ముఖ్యంగా బరువు తగ్గాలని కోరుకునేవారు, మధుమేహం లేదా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవాలనుకునేవారు వీటిని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అయితే వీటిని దీర్ఘకాలం తీసుకోవడం వల్ల కలిగే ప్రభావాలపై తాజాగా నిర్వహించిన ఓ అధ్యయనం కొన్ని కీలక విషయాలను వెల్లడించింది. కృత్రిమ స్వీటెనర్ల వినియోగం టైప్-2 మధుమేహం, మెటబాలిక్ సిండ్రోమ్ వంటి సమస్యల ముప్పుతో సంబంధం కలిగి ఉంటుందని పరిశోధన సూచించింది. ఫ్రాంటియర్స్ ఆఫ్ న్యూట్రిషన్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ మెటా-విశ్లేషణలో అమెరికా, యూరప్, జపాన్‌కు చెందిన సుమారు 7.2 లక్షల మంది పెద్దల సమాచారాన్ని పరిశీలించారు. ఇందులో ఆరు వేర్వేరు అధ్యయనాల నుంచి సేకరించిన డేటాను విశ్లేషించారు. ముఖ్యంగా కృత్రిమ స్వీటెనర్లను పదేళ్లకు పైగా తీసుకున్నవారిలో టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం 31 శాతం అధికంగా ఉన్నట్లు అధ్యయనం గుర్తించింది. కృత్రిమ స్వీటెనర్లను తక్కువ క్యాలరీలు కలిగిన చక్కెర ప్రత్యామ్నాయాలుగా ఉపయోగిస్తారు. ఇవి డైట్ డ్రింక్స్, షుగర్-ఫ్రీ పానీయాలు, ప్రాసెస్డ్ ఫుడ్స్, కొన్ని పాల ఉత్పత్తుల్లో కూడా ఉంటాయి. అందువల్ల తాము తీసుకునే ఆహారంలో కృత్రిమ స్వీటెనర్లు ఉన్నాయా లేదా తెలుసుకోవడానికి ఉత్పత్తుల లేబుళ్లను పరిశీలించడం అవసరం. మధుమేహం లేదా రక్తంలో చక్కెర స్థాయిలకు సంబంధించిన సమస్యలు ఉన్నవారు చక్కెర వినియోగాన్ని తగ్గించేందుకు కృత్రిమ స్వీటెనర్లను ఎంచుకుంటారు. అయితే వీటిని ఎక్కువ కాలం తీసుకోవడం వల్ల శరీరంలోని జీవక్రియపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశంపై మరింత క్లినికల్ పరిశోధన అవసరమని నిపుణులు చెబుతున్నారు. కృత్రిమ స్వీటెనర్ల అధిక వినియోగం పేగుల్లోని సూక్ష్మ జీవుల సమతుల్యతను ప్రభావితం చేస్తుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. గట్ మైక్రోబయోమ్‌లో మార్పులు చోటుచేసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. శరీరంలోని సాధారణ జీవక్రియ ప్రక్రియలకు కూడా అంతరాయం కలిగే అవకాశం ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. పేగుల్లోని మంచి బ్యాక్టీరియా వైవిధ్యం తగ్గడం వల్ల శరీరంలో స్వల్పస్థాయి వాపు లేదా ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుంది. ఇది దీర్ఘకాలం కొనసాగితే క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీసి మధుమేహం, మెటబాలిక్ సిండ్రోమ్ వంటి జీవనశైలి సంబంధిత వ్యాధుల ముప్పును పెంచే అవకాశం ఉంటుంది. కృత్రిమ స్వీటెనర్లు ఆకలి, ఆహారం తీసుకోవాలనే కోరికను నియంత్రించే శరీర వ్యవస్థలపై కూడా ప్రభావం చూపిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఆకలి, శక్తి వినియోగాన్ని నియంత్రించడంలో ఘ్రెలిన్, లెప్టిన్ వంటి హార్మోన్లు కీలక పాత్ర పోషిస్తాయి. వీటి సంకేతాల్లో మార్పులు ఆహార ఎంపికలు, ఆకలి స్థాయిలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. మెటబాలిక్ సిండ్రోమ్ అంటే శరీరంలోని సాధారణ జీవక్రియ పనితీరులో ఏర్పడే సమస్య. ఇందులో రక్తంలో చక్కెర స్థాయిలు, నడుము చుట్టుకొలత, కొలెస్ట్రాల్, రక్తపోటు వంటి అంశాలు ప్రభావితమవుతాయి. ఈ పరిస్థితి ఉన్నవారిలో టైప్-2 మధుమేహం, గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అయితే కృత్రిమ స్వీటెనర్లు నేరుగా మధుమేహానికి కారణమవుతాయని ఈ అధ్యయనం నిరూపించలేదు.



## ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం లేదా చికిత్స కోసం ఏఐని వాడుతున్నారా..

ఆరోగ్యానికి సంబంధించిన సందేహాలకు సమాధానాల కోసం చాలామంది ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చాట్‌బాట్లను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల విషయంలో చికిత్స, దుష్ప్రభావాలు, రేడియేషన్ అవసరమా లేదా వంటి ప్రశ్నలకు ఏఐ ఇచ్చే సమాధానాలను కొందరు వైద్యుల సూచనలతో సమానంగా భావిస్తున్నారు. అయితే ఏఐ అందించే సమాచారం ప్రతి రోగి పరిస్థితికి సరిపోదని, వైద్య నిర్ణయాల్లో దానిపై పూర్తిగా ఆధారపడటం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల క్యాన్సర్ చికిత్సకు సంబంధించి ఏఐ రూపొందించిన సమాధానాలను తీసుకుని రోగులు వైద్యులను సంప్రదించే పరిస్థితులు పెరుగుతున్నాయి. ఒక రోగికి టార్గెటెడ్ థెరపీ ద్వారా ట్యూమర్‌ను నియంత్రించవచ్చని, రేడియేషన్ అవసరం లేదని, రేడియేషన్ వల్ల గుండెకు నష్టం లేదా భవిష్యత్తులో రెండోసారి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని ఏఐ సమాధానం ఇచ్చిన సందర్భాన్ని దీనికి ఉదాహరణగా చెప్పారు. అయితే ఈ వాదనల్లో ప్రతిదీ వేర్వేరు కారణాల వల్ల తప్పుదోవ పట్టించేవిగా ఉంటున్నాయి. క్యాన్సర్ చికిత్సలో టార్గెటెడ్ థెరపీ అనే పదాన్ని చాలామంది తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. టార్గెటెడ్ థెరపీ అంటే క్యాన్సర్ కణాల్లో ఉండే నిర్దిష్ట రిసెప్టర్‌ను లక్ష్యంగా చేసుకుని పని చేసే మందులను ఉపయోగించడం. ఉదాహరణకు హెచ్‌ఈఆర్2 పాజిటివ్ క్యాన్సర్‌లో ట్రాస్టుజుమాబ్ వంటి మందులు క్యాన్సర్ కణాలపై ఉండే నిర్దిష్ట లక్ష్యాలను గుర్తించి పనిచేస్తాయి. అయితే ఈ చికిత్స శరీరంలోని ప్రతిక్యాన్సర్ ప్రభావిత ప్రాంతాన్ని, ట్యూమర్ ఉన్న ప్రదేశాన్ని, చుట్టుపక్కల ప్రాంతాలను పూర్తిగా నియంత్రిస్తుందని అర్థం కాదు. రేడియేషన్ థెరపీ విషయంలోనూ ఇలాంటి అపోహలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో రేడియేషన్‌ను తొలగించే విషయంపై వైద్య రంగంలో చర్చలు జరుగుతాయి. ఉదాహరణకు వయసు ఎక్కువగా ఉన్న మహిళకు చిన్న పరిమాణంలో, లింఫ్ నోడ్స్‌కు వ్యాపించని, హార్మోన్ పాజిటివ్ క్యాన్సర్ ఉన్నప్పుడు రేడియేషన్ అవసరమా అనే నిర్ణయం రోగి పరిస్థితిని బట్టి మారుతుంది. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితుల్లో వయసు, క్యాన్సర్ లక్షణాలు, లింఫ్ నోడ్స్ పరిస్థితి, ఇతర ఆరోగ్య సమస్యలు వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. చాట్‌బాట్‌కు ఈ క్లినికల్ సందర్భాలను పూర్తిగా అర్థం చేసుకునే సామర్థ్యం ఉండదని నిపుణులు చెబుతున్నారు. వైద్య రంగంలోని కొన్ని అధ్యయనాలు కూడా ఏఐ సమాధానాల్లో ఇలాంటి పరిమితులు ఉంటాయని సూచించాయి. నిపుణుల మధ్య కూడా భిన్నాభిప్రాయాలు ఉన్న క్లిష్టమైన క్యాన్సర్ కేసులపై ఒక ఏఐ మోడల్‌ను పరీక్షించినప్పుడు, అది స్పష్టమైన సమాధానం ఇవ్వలేని పరిస్థితుల్లో కూడా నమ్మకంగా కనిపించే చికిత్సా ప్రణాళికలను అందించినట్లు ఒక అధ్యయనం పేర్కొంది. మరో అధ్యయనంలో రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన 60 ప్రశ్నలను పరిశీలించగా, చికిత్సకు సంబంధించిన ప్రశ్నల్లో మూడు ఏఐ మోడళ్ల సగటు కచ్చితత్వం 44 శాతంగా నమోదైంది. రేడియేషన్ థెరపీ దుష్ప్రభావాల గురించి ఏఐని అడిగితే గుండెకు నష్టం, రెండోసారి క్యాన్సర్ వచ్చే ప్రమాదం, లింఫ్ ఎడిమా, ఊపిరితిత్తుల నష్టం, నరాలకు సంబంధించిన సమస్యలు వంటి అనేక ప్రమాదాలను అది పేర్కొనే అవకాశం ఉంది. ఇవన్నీ వైద్యపరంగా గుర్తించిన దుష్ప్రభావాలే అయినప్పటికీ, వాటిలో కొన్ని దశాబ్దాల క్రితం ఉపయోగించిన పాత రేడియేషన్ పద్ధతులకు సంబంధించిన అధ్యయనాల నుంచి వచ్చినవే ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం రేడియేషన్ చికిత్సలో అధునాతన సాంకేతికత, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా రూపొందించే చికిత్సా ప్రణాళికలు, మెరుగైన అల్గారిథమ్స్, ఆధునిక చికిత్సా పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.



## అందానికి.. పసుపు నూనె!

అందాన్ని ద్విగుణీకృతం చేసుకోవడానికి వివిధ రకాల ఎసెన్షియల్ ఆయిల్స్ వాడడం మనకు అలవాటే! ఈ క్రమంలో పసుపు మొక్క వేళ్ల నుంచి తీసిన అత్యవసర నూనె వల్ల కూడా సౌందర్యపరంగా పలు ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..

సీబమ్ ఉత్పత్తి పెరగడం వల్ల చర్మంపై ఎక్కువ నూనె ఉత్పత్తై జిడ్డుగా మారుతుంది. తద్వారా ముఖంపై మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. సీబమ్ ఉత్పత్తిని క్రమబద్ధీకరించి.. జిడ్డుదనాన్ని తొలగించడంలో పసుపు నూనె కీలక పాత్ర పోషిస్తుంది. తద్వారా మొటిమల బెడద తగ్గే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు.

ఈ నూనెలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు.. చర్మానికి తేమనందించి పొడి చర్మ సమస్యను దూరం చేస్తాయట.



ఈ ఎసెన్షియల్ ఆయిల్ వల్ల చర్మానికే కాదు.. కురులకు కూడా చక్కని ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు నిపుణులు. చుండ్రుని నివారించడంతో పాటు జుట్టు రాలడాన్ని అరికట్టడంలోనూ ఇది ఉపకరిస్తుందట. అలాగే దీనిలో యాంటీ ఫంగల్ గుణాలు ఉండడం వల్ల ఇవి కుదుళ్లలో ఎలాంటి ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడతాయట. దీనికోసం ఈ నూనెను నేరుగా కాకుండా మనం ఉపయోగించే సాధారణ నూనె (కొబ్బరినూనె, బాదంనూనె..)లో కొన్ని చుక్కలు కలుపుకొని ఉపయోగించాలంటున్నారు నిపుణులు. ఈ నూనెలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. కాబట్టి వాపు నుంచి ఉపశమనం పొందడానికి కూడా ఈ ఆయిల్‌ను ఉపయోగించచ్చు. పాదాల్లో పగుళ్లను తగ్గించడానికి కూడా ఇది బాగా ఉపకరిస్తుందట. దీనికోసం కొబ్బరినూనె లేదా ఆముదంలో రెండు చుక్కల పసుపు నూనె కలిపి ఆ మిశ్రమంతో రోజూ పాదాలను మృదువుగా మర్దన చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల తక్కువ సమయంలోనే పగుళ్లు తగ్గడంతో పాటు పాదాలు మృదువుగా మారతాయట. ఇందులో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడతాయట. కొన్ని రకాల మచ్చలను నివారించే సౌందర్యోత్పత్తుల్లో కూడా ఈ నూనెను వాడతారు.

## ప్రొటీన్లను జీర్ణం చేయడంలో అద్భుతంగా పనిచేసే పైనాపిల్..



భోజనం తర్వాత పైనాపిల్ తినడం వల్ల జీర్ణక్రియకు కొంత మేలు జరిగే అవకాశం ఉందని నిపుణుల పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా ఇందులో ఉండే బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ప్రొటీన్లను చిన్న భాగాలుగా విడగొట్టడంలో సహాయపడుతుంది. అందుకే ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకున్న తర్వాత పరిమిత మోతాదులో పైనాపిల్‌ను ఆహారంలో భాగంగా చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. పైనాపిల్‌లో ఉండే బ్రోమెలైన్ ప్రొటీన్లను జీర్ణం చేయడంలో సహాయపడే ఎంజైమ్‌ల సమూహానికి చెందినది. మాంసం, చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు, పప్పులు వంటి ఆహారాల్లో ఉండే సంక్లిష్ట ప్రొటీన్లను జీర్ణక్రియ సమయంలో చిన్న పెప్టైడ్లు, అమైనో ఆమ్లాలుగా విడగొట్టడంలో ఇది సహాయపడుతుంది. ఇవి శరీరం సులభంగా గ్రహించగలిగే రూపాలేనని వారు చెబుతున్నారు. పైనాపిల్‌లో బ్రోమెలైన్ పండు భాగంలోనే కాకుండా దాని కాడలో కూడా ఉంటుంది. ఈ ఎంజైమ్ కారణంగానే పైనాపిల్‌ను జీర్ణక్రియకు సహాయపడే పండుగా పరిగణిస్తారు. అయితే పైనాపిల్ తినడం వల్ల జీర్ణక్రియ పూర్తిగా దాని మీదే ఆధారపడదు. జీర్ణాశయంలో విడుదలయ్యే ఆమ్లాలు, సహజ జీర్ణ ఎంజైమ్‌లతో కలిసి ఇది జీర్ణక్రియకు తోడ్పడుతుంది. భోజనం తర్వాత పైనాపిల్ తినడం వల్ల పెద్ద మొత్తంలో ఆహారం తీసుకున్నప్పుడు కలిగే కడుపు భారాన్ని కొంత తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా ప్రొటీన్లు అధికంగా ఉన్న భోజనం తర్వాత ఇందులోని బ్రోమెలైన్ ప్రొటీన్ల విచ్ఛిన్న ప్రక్రియకు తోడ్పడతాయి. అయితే దీనిపై వ్యక్తుల శరీర స్పందన, తీసుకునే పరిమాణం ఆధారంగా ప్రభావం మారే అవకాశం ఉంటుంది. పైనాపిల్‌లో బ్రోమెలైన్‌తో పాటు పీచు పదార్థం, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు కూడా ఉంటాయి. ఇవి పైనాపిల్‌ను పోషకాలు కలిగిన పండుగా మారుస్తాయి. కాబట్టి సమతుల ఆహారంలో భాగంగా పరిమిత మోతాదులో పైనాపిల్‌ను తీసుకోవడం వల్ల పలు ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

పైనాపిల్‌లోని పీచు పదార్థం పేగుల ఆరోగ్యానికి సహాయపడుతుంది. ఇది సాధారణంగా పేగు కదలికలు సక్రమంగా ఉండేందుకు తోడ్పడుతుంది. ఫలితంగా జీర్ణక్రియ సజావుగా సాగడానికి సహాయపడే అవకాశం ఉంటుంది. పైనాపిల్‌లో విటమిన్ సి కూడా సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరానికి అవసరమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. పైనాపిల్‌లోని ఇతర మొక్కల సమ్మేళనాలు కూడా దాని పోషక విలువలకు దోహదం చేస్తాయి. భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) ప్రకారం 100 గ్రాముల పైనాపిల్‌లో సుమారు 48 కిలోకేలరీల శక్తి, 86 గ్రాముల తేమ, 0.5 గ్రాముల ప్రొటీన్, 0.1 గ్రాముల కొవ్వు, 11-12 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 1.4 గ్రాముల పీచు పదార్థం ఉంటాయి. అలాగే కాల్షియం 20 మిల్లీగ్రాములు, ఫాస్ఫరస్ 9 మిల్లీగ్రాములు, ఐరన్ 0.3 మిల్లీగ్రాములు, పొటాషియం 147 మిల్లీగ్రాములు, విటమిన్ సి సుమారు 39 మిల్లీగ్రాములు ఉంటాయి. కొద్దిమొత్తంలో బీటా కెరోటిన్ కూడా లభిస్తుంది. అధిక ప్రొటీన్ ఆహారం తీసుకునే వారు, భోజనం తర్వాత అప్పుడప్పుడు కడుపు భారంగా అనిపించే వారు పైనాపిల్‌ను పరిమిత మోతాదులో తీసుకోవచ్చు. వ్యాయామం చేసే వారు కూడా సమతుల ఆహారంలో భాగంగా దీన్ని తీసుకోవచ్చు. వయసు పెరిగిన కొందరిలో జీర్ణక్రియకు సంబంధించిన ఇబ్బందులు ఉంటే కూడా పైనాపిల్ ఉపయోగపడే అవకాశం ఉంటుంది. అయితే పైనాపిల్‌ను ఎక్కువగా తినడం వల్ల కొన్ని ఇబ్బందులు కలుగుతాయి. దాని పుల్లని, ఘాటైన రుచి కారణంగా కొందరికి నోట్లో మంట లేదా చికాకు కలుగుతాయి. అందరికీ ఇది సరిపోదు. ముఖ్యంగా పైనాపిల్‌కు అలర్జీ ఉన్నవారు దీనిని తీసుకోకూడదు. బ్రోమెలైన్ సప్లిమెంట్లను మాత్రం వైద్యుల సలహా లేకుండా తీసుకోవడం మంచిది కాదు. పండుగా పైనాపిల్ తినడం, అధిక మోతాదులో బ్రోమెలైన్ సప్లిమెంట్లు తీసుకోవడం రెండూ ఒకే విషయం కాదు. అందువల్ల సప్లిమెంట్ల విషయంలో వైద్యుల సూచన పాటించడం అవసరం.

భోజనం తర్వాత సుమారు ఒక కప్పు తాజా పైనాపిల్ ముక్కలను తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే దీనిని మొత్తం ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా చూడాలి. తాజా పండ్లు, కూరగాయలు సమృద్ధిగా ఉండే సమతుల ఆహారంతో కలిపి తీసుకోవడం మంచిది. పైనాపిల్‌లోని బ్రోమెలైన్ సంక్లిష్ట ప్రొటీన్లను విచ్ఛిన్నం చేయడంలో సహాయపడే ఎంజైమ్‌గా పనిచేస్తుంది. భోజనం తర్వాత పరిమిత మోతాదులో పైనాపిల్ తీసుకోవడం జీర్ణక్రియకు తోడ్పడే అవకాశం ఉంటుంది. అయితే పైనాపిల్ ఏదైనా జీర్ణ సమస్యకు చికిత్స కాదని, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిని బట్టి దాని ప్రభావం మారే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## ఏకే-203 రైఫిళ్లకు మందుగుండు సామగ్రి సరఫరా

మనదేశంలో తయారవుతున్న ఏకే-203 అసాల్ట్ రైఫిళ్లకు స్వదేశీ పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసిన 7.62/39 ఎంఎం మందుగుండు సామగ్రిని సరఫరా చేయడానికి ఇండో-రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అయిదేళ్ల ఒప్పందంపై అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సంతకం చేసింది. ఒప్పందం ప్రకారం, ఏకే-203 కార్యక్రమానికి అవసరమైన చిన్న క్యాలిబర్ మందుగుండు సామగ్రిని అదానీ డిఫెన్స్ అయిదేళ్ల పాటు నిరంతరాయంగా సరఫరా చేయనుంది. ఈ ఒప్పందం ఇండో-రష్యన్ రైఫిల్స్ (ఐఆర్ఆర్‌పీఎల్) ద్వారా రైఫిల్ తయారీని, అదానీ డిఫెన్స్ ద్వారా మందుగుండు సామగ్రి తయారీని ఏకం చేస్తూ, భారత దేశ రక్షణ తయారీ వ్యవస్థలో ఏకే-203 కార్యక్రమానికి సంబంధించిన ఈ రెండు విభాగాలను అనుసంధానిస్తుంది.

# బిజినెస్

# ఈ వారం ఐపీఓలు ఇవే




ప్రైమరీ మార్కెట్‌లో ఈ వారమూ పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగ నుంది. 11 కంపెనీలు మొత్తం రూ.7,055 కోట్ల నిధుల సమీకరించ నున్నాయి. సెప్టెంబర్ 7-15 మధ్య దలాల్ స్ట్రీట్‌లో ఈ ఐపీఓలు సందడి చేయనున్నాయి. ఇందులో రెంటోమోజో, కరమ్‌తర ఇంజినీరింగ్, కనోహర్ ఎలక్ట్రికల్స్ వంటి కంపెనీలు ఉన్నాయి. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లను విక్రయించనున్నాయి. ఐపీఓ నిధులను వ్యాపార విస్తరణకు, రుణాల చెల్లింపులకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు పలు కంపెనీలు వినియోగించనున్నాయి. ఇక ఆ వివరాలను పరిశీలిస్తే..

ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ సెప్టెంబర్ 7న పబ్లిక్ ఇష్యూకు రానుంది. రూ. 351 కోట్ల నిధులను సమీకరించనుంది. సెప్టెంబర్ 9న ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది. ఒక్కో షేరు ధర 118-124గా కంపెనీ నిర్ణయించింది. కనోహర్ ఎలక్ట్రికల్స్ సెప్టెంబర్ 8న ఐపీఓకు వస్తోంది. రూ.1,056 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి 601-632. ప్రసోల్ కెమికల్స్ కూడా సెప్టెంబర్ 8న ఐపీఓకు రానుంది. ధరల శ్రేణి రూ.643-676గా కంపెనీ నిర్ణయించింది. రూ.500కోట్ల నిధులను సమీకరించనుంది. రూ.80 కోట్ల తాజా షేర్లు, రూ. 420 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయించనున్నారు. గ్లాస్ వాల్ సిస్టమ్స్ (ఇండియా) ఐపీఓ సెప్టెంబర్ 8న రూ.428 కోట్ల నిధుల సమీకరణకు ఐపీఓకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.172-182గా కంపెనీ నిర్ణయించింది. రెంటోమోజో సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.384-404 కంపెనీ నిర్ణయించింది. రూ.1,256 కోట్ల నిధులను సమీకరించనుంది. రూ.150 కోట్ల తాజా షేర్లు, రూ.1,106 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉండనున్నాయి. కరమ్‌తర ఇంజినీరింగ్ రూ.875 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంగా సెప్టెంబర్ 9న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. రూ.675 కోట్ల తాజా షేర్లు, రూ.200 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు ఉండనున్నాయి. ధరల శ్రేణి రూ.241-254 కంపెనీ నిర్ణయించింది. మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్ కూడా సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. రూ.805 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.322-339గా నిర్ణయించింది. ఇందులో రూ.320 కోట్ల తాజా షేర్లు, రూ.485 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ఆర్సిల్ కంపెనీ రూ.733 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 9న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఒక్కో షేర్ ధర రూ.132-139గా నిర్ణయించింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ ఐపీఓ సెప్టెంబర్ 9న ప్రారంభం కానుంది. రూ.427 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.139-146గా కంపెనీ నిర్ణయించింది.

స్టీమ్‌హౌస్ ఇండియా రూ.414 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ధరల శ్రేణి ఇంకా వెల్లడించలేదు. వీగాలాండ్ డెవలపర్స్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ సెప్టెంబర్ 10న ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 15న సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది. రూ.210 కోట్ల నిధులను ఐపీఓ నుంచి సమీకరించనుంది. ధరల శ్రేణి వెల్లడించాల్సి ఉంది.

## ఎస్‌బీఐలో కొత్తగా 12 వేల నియామకాలు!




ప్రభుత్వ రంగానికి చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) తన సేవలను మరింత విస్తరించనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 12 వేల నియామకాలతో పాటు (SBI hiring), కొత్తగా 250 బ్రాంచ్‌లను ప్రారంభించనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు.

ఈ ఏడాదే 11-12 వేల వరకు కొత్త నియామకాలు చేపట్టే ప్రణాళికలు ఉన్నాయని ఎస్‌బీఐ ఛైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడించారు. ముఖ్యంగా క్లరికల్, ఆఫీసర్ కేడర్లలో ఇవి ఉంటాయన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్, బ్యాంక్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌బీఐకి అత్యంత భారీ నెట్‌వర్క్ ఉందని, బ్యాంక్ సేవలను మరింత విస్తరించేందుకు కొత్తగా 200 - 250 బ్రాంచ్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. మార్చి 2026 నాటికి ఎస్‌బీఐలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలు దాటింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ బ్యాంక్ మొత్తం 25,633 మందిని రిక్రూట్ చేసుకుంది. మరోవైపు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రతిపాదిస్తున్న రూ.30వేల కోట్ల ఐపీఓ (IPO)లో ఎస్‌బీఐ, దాని అనుబంధ సంస్థ ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ సంయుక్తంగా 1 శాతం వాటాను విక్రయించనున్నాయి.

## వచ్చే జూన్ కల్లా సెన్సెక్స్ 89,000 పాయింట్లకు..



2027 జూన్ నాటికి బీఎస్ఈ సెన్సెక్స్ 89,000 పాయింట్లకు చేరుకుంటుందని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. ప్రస్తుతం ఉన్న స్థాయి నుంచి ఇది 16 శాతం అధికం. 'ఎ లాంగ్ వే అప్' పేరుతో విడుదల చేసిన నివేదికలో భారత్ సుదీర్ఘ కాల వృద్ధి చక్రంలోకి ప్రవేశిస్తోందని వ్యూహకర్తలు రిధమ్ దేశాయ్, నయంత్ పరేఖ్ పేర్కొన్నారు. ఇటీవలి మార్కెట్ ఒడుదొడుకులను వారు ఒక తాత్కాలిక విరామంగానే భావిస్తున్నారు. అయితే ఈ మార్కెట్ లక్ష్యాలు ముడి చమురు ధరలు, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని వారు తెలిపారు. 2027 జూన్ నాటికి మార్కెట్ పరిస్థితి బుల్ కేసులో ఉంటే గరిష్ఠంగా సెన్సెక్స్ 1,00,000 పాయింట్లకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. దీనికి ముడి చమురు ధర బ్యారెల్‌కు 75-80 డాలర్ల కంటే తక్కువగా ఉండాలి. కంపెనీల ఆదాయాలు ఏటా 19 శాతం వృద్ధి చెందాలి. బేస్ కేసులో (సాధారణ వృద్ధి) 89,000 పాయింట్లకు చేరొచ్చు. దీనికి ఆర్థిక స్థిరత్వం కొనసాగాలి. ప్రైవేటు పెట్టుబడులు పెరగాలి. కంపెనీల ఆదాయాలు ఏటా 16 శాతం వృద్ధి చెందాలి. బేర్ కేసులో (మార్కెట్ పతనం) సెన్సెక్స్ 66,000 పాయింట్లకు పడిపోయే అవకాశం ఉంది. ముడి చమురు ధర బ్యారెల్‌కు 120 డాలర్లను అధిగమించడం, అంతర్జాతీయ ఆర్థిక మందగమనం, కంపెనీల ఆదాయాల వృద్ధి 13 శాతానికి పడిపోవడం వంటివి పతనానికి కారణాలు కావొచ్చు. దేశంలో రుణాలు, పెట్టుబడులకు గిరాకీ పెరగడం వల్ల బ్యాంకింగ్ రంగం బాగా లాభపడుతుంది. ప్రభుత్వ మౌలిక సదుపాయాల వ్యయం, ప్రైవేటు కంపెనీల పెట్టుబడుల వల్ల పారిశ్రామిక రంగం పుంజుకుంటుంది. దేశీయంగా కొనుగోలు శక్తి, పట్టణ వినియోగం పెరగడంతో వినియోగ రంగం జోరందుకుంటుంది. అంతర్జాతీయంగా ఐటీ మందగమనం ఉన్నప్పటికీ, కృత్రిమ మేధ (ఏఐ) అప్లికేషన్ల గిరాకీ వల్ల ఇది ఊహించని విధంగా పుంజుకునే అవకాశం ఉంది. యుద్ధాలు, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో అడ్డంకులు మార్కెట్‌ను దెబ్బతీయొచ్చు. భారత్ ముడి చమురును భారీగా దిగుమతి చేసుకుంటుంది కాబట్టి ధరలు పెరిగితే కంపెనీల లాభాలు తగ్గుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వడ్డీ రేట్లను తగ్గించకపోతే మార్కెట్ వృద్ధి మందగించొచ్చు.

# 'పసిడి' రుణాల జోరు!



దేశ వ్యాప్తంగా బంగారు రుణాల మార్కెట్ శరవేగంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు ఆర్థిక ఇబ్బందుల్లో చివరి ప్రత్యామ్నాయంగా నిలిచిన ఈ రుణాలు, ఇప్పుడు రిటైల్ ఆస్తుల విభాగంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్నాయి. మోతీలాల్ ఓస్వాల్ నివేదిక అంచనా ప్రకారం.. 28 శాతం వార్షిక వృద్ధి రేటుతో ఈ రంగం 2028 మార్చి నాటికి రూ.30 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించనుంది. 2026 మార్చి నాటికి రూ.18.6 లక్షల కోట్లుగా ఉన్న ఈ మార్కెట్ పరిణామం, గృహ రుణాల తర్వాతి స్థానాన్ని ఆక్రమిస్తూ, రెండో అతిపెద్ద రిటైల్ ఆస్తి విభాగంగా నిలిచింది. వ్యక్తిగత రుణాల పోర్ట్‌ఫోలియోనూ ఇది అధిగమించడం విశేషం. 2026 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 50 శాతం వృద్ధికి పసిడి ధరలు 60 శాతం మేర పెరగడమూ ప్రధాన కారణం. భారతీయ కుటుంబాల దగ్గరున్న బంగారు నిల్వలే ఈ భారీ వృద్ధికి దోహదం చేస్తున్నాయి.

ఇళ్లల్లో ఉన్న పసిడి నిల్వలు దేశ రుణ లభ్యతను పెంచే వ్యూహాత్మక వనరులుగా మారుతున్నాయి. దేశంలోని కుటుంబాల వద్ద సుమారు 28,000 టన్నుల బంగారం ఉన్నట్లు అంచనా. దీని విలువ రూ.380-390 లక్షల కోట్ల మధ్య ఉంటుంది. ఈ భారీ నిల్వలో కేవలం 8 శాతం మాత్రమే వ్యవస్థీకృత మార్కెట్ పరిధిలోకి రావడం గమనార్హం. ఇదీ ఈ రంగానికి ఉన్న విస్తృత అవకాశాలను చాటుతోంది. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ సంస్థలు, అసంఘటిత రంగాలు తమ నిర్వహణ మూలధనం కోసం పసిడి రుణాలను ఎక్కువగా ఆశ్రయిస్తున్నాయి. మైక్రోఫైనాన్స్ వినియోగదారులు పొందే ఇతర రిటైల్ రుణాల్లో బంగారు రుణాల వాటా 18 శాతానికి చేరడం గమనార్హం. బంగారం రుణాల్లో మరో ఆసక్తికరమైన విషయమూ ఉంది. కొత్త రుణగ్రహీతలకంటే, పాత ఖాతాదారులే పదే పదే రుణాలు తీసుకోవడం మార్కెట్ సుస్థిరతపై సందేహాలను రేకెత్తిస్తోంది. ప్రస్తుత వృద్ధి కేవలం బంగారం ధరల పెరుగుదలపైనే ఆధారపడి ఉంటుంది తప్ప వినియోగదారుల సంఖ్యలో పురోగతి కనిపించడం లేదు. ముత్తూట్ ఫైనాన్స్, మణప్పురం ఫైనాన్స్ వంటి బంగారు రుణ సంస్థలూ ఇదే విషయాన్ని పేర్కొంటున్నాయి. ఈ రెండు సంస్థల ఉమ్మడి ఖాతాదారుల సంఖ్య 90 లక్షల వద్ద, బంగారం నిల్వలు 260-265 టన్నుల వద్దే ఉన్నాయి. పోర్ట్‌ఫోలియో విలువ పెరిగినా, వినియోగదారుల బలం విస్తరించకపోవడం పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు. 2022లో 75 శాతంగా ఉన్న పాత రుణాల పునరుద్ధరణ వాటా 2025 నాటికి 82 శాతానికి చేరడం వ్యవస్థాగత నష్టభయాన్ని సూచిస్తోంది. ఇది రుణ గ్రహీతలు మరింత అప్పుల ఊబిలోకి కూరుకుపోయే ప్రమాదాన్ని వెల్లడిస్తోంది. ఒకప్పుడు దక్షిణాది రాష్ట్రాలకే ఎక్కువగా పరిమితమైన బంగారు రుణాల వ్యాపారం ఇప్పుడు దేశ వ్యాప్తంగా విస్తరిస్తోంది. దేశవ్యాప్త సగటు వృద్ధి 50 శాతంగా ఉంటే, రాజస్థాన్‌లో 78 శాతం, మహారాష్ట్రలో 61 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 58 శాతం వృద్ధి నమోదైంది. ఈ భౌగోళిక విస్తరణ పసిడి రుణ రంగంలో సరికొత్త పోటీకి ఆస్కారం ఇస్తోంది..

పసిడి రుణ మార్కెట్‌లో నెలకొన్న ఈ పరిస్థితిని గమనిస్తున్న నియంత్రణ సంస్థలు నిబంధనలను ఎప్పటికప్పుడు కఠినతరం చేస్తున్నాయి. మార్కెట్ అదుపు తప్పకుండా చూసేందుకు ఆర్‌బీఐ పర్యవేక్షణ పెంచింది. విలువ ఆధారిత రుణం (ఎల్‌టీవీ) లెక్కింపు విధానం, రుణాల కాలపరిమితి, రుణ గ్రహీతల అర్హత ప్రమాణాలతో పాటు రుణ నిర్వహణపైనా కఠిన ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల మధ్య నిబంధనల సమన్వయం వల్ల అనారోగ్యకరమైన పోటీకి అడ్డుకట్ట వేయాలని ఆర్‌బీఐ భావిస్తోంది.

# క్రీడలు

## దులీప్ ట్రోఫీ ఫైనల్.. 'శత'క్కొట్టిన ఇషాన్ కిషన్



చెపాక్ స్టేడియం వేదికగా ఈస్ట్ జోన్, సౌత్ జోన్ మధ్య ఆదివారం దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఈస్ట్ జోన్ తొలి రోజు ఆట ముగిసేసరికి 4 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (111★; 135 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో ఆకట్టుకున్నాడు. వన్‌డౌన్ బ్యాటర్ శిఖర్ మోహన్ (85; 120 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ చేసే ఛాన్స్ మిస్ చేసుకున్నాడు. ఆరో స్థానంలో వచ్చిన కుమార్ కుశాగ్ర (63★; 75 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ శతకం సాధించాడు. అంతకుముందు ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (72; 86 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్), వైభవ్ సూర్యవంశీ (44; 37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 100 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి శుభారంభం అందించారు. అభిమన్యు ఈశ్వరన్ రనౌట్ కాగా.. సౌత్ జోన్ బౌలర్లలో చామ మిలింద్ 2, త్రిపురాణ విజయ్ ఒక వికెట్ పడగొట్టారు.

## పాక్ పనిపట్టేశారు




మహిళల క్రికెట్లో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్‌పై తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తున్న భారత జట్టు.. ఆసియా కప్‌లోనూ పైచేయి సాధించింది. శనివారం గ్రూప్-ఎలో తన చివరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. మొదట 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శ్రీ చరణి (4-0-7-3)తో పాటు ప్రేమ రావత్ (4-0-9-3), దీప్తి శర్మ (3.1-0-5-2) కూడా అద్భుత గణాంకాలు నమోదు చేయడంతో పాక్.. 18.1 ఓవర్లలో 55 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో ఓపెనర్లు మునీబా అలీ (13), షవాల్ జుల్ఫికర్ (14) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. అనంతరం పాక్ కెప్టెన్ ఫాతిమా సనా (3/17) ధాటికి భారత జట్టు కూడా తడబడింది. 29 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో సారథి హర్మన్‌ప్రీత్ (18 నాటౌట్; 18 బంతుల్లో 1×4, 1×6), దీప్తి శర్మ (12 నాటౌట్) మిగతా పని పూర్తి చేశారు. టోర్నీలో భారత్ ఇప్పటికే సెమీస్ చేరగా.. గ్రూప్-ఎలో రెండో బెర్తు కోసం పాక్, థాయ్‌లాండ్, హాంకాంగ్ పోటీలో ఉన్నాయి. తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌ను ఓడించిన పాక్, తన చివరి మ్యాచ్‌లో హాంకాంగ్‌పై గెలవకపోతే.. దాని అవకాశాలు సంక్లిష్టమవుతాయి. ఆసియా కప్‌లో భారత్‌తో ఇంతకుముందు ఏడు మ్యాచ్‌లాడి, ఆరుసార్లు ఓడిన పాక్.. శనివారం కూడా ఓటమి తప్పించుకోగలదనే అంచనాలు లేవు. అయితే ఆ జట్టు పోటీ అయినా ఇస్తుందా అని అంతా చూశారు. కానీ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాక్.. తొలి 4 ఓవర్లలో వికెట్ కోల్పోకపోవడంతో చెప్పుకోదగ్గ స్కోరే చేస్తుందనిపించింది. కానీ అయిదో ఓవర్లో పార్ట్‌టైం స్పిన్నర్ షెఫాలి వర్మ.. మునీబాను బౌల్డ్ చేయడంతో కథ మారిపోయింది.

అంతటితో పాక్ పతనానికి గేట్లెత్తేసినట్లయింది. మరో ఎండ్‌లో శ్రీ చరణి అద్భుతంగా బౌలింగ్ చేస్తూ రెండు ఓవర్లలో కేవలం 3 పరుగులే ఇచ్చి 3 వికెట్లు తీయడంతో పాక్ పనైపోయింది. ఆమె.. షవాల్, గుల్ ఫెరోజా (0), ఆయేషా (2)లను ఔట్ చేసింది. తర్వాత ప్రేమ, దీప్తి అందుకున్నారు. ఇద్దరూ పోటీ పడి వికెట్లు తీయడంతో పాక్ మరీ తక్కువ స్కోరుకే ఇన్నింగ్స్‌ను ముగించేసింది. 27 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయిన ఆ జట్టు.. ఇంకో 28 పరుగులకే ఆలౌటైంది. అనంతరం తొలి బంతికే సిక్సర్ బాదిన షెఫాలి (12) భారత ఛేదనను ఘనంగా ఆరంభించినా.. తర్వాతి ఓవర్లో పాక్ కెప్టెన్ ఫాతిమా సనాకు రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔటైపోయింది. ప్రతీక (4), స్మృతి (9)లను కూడా సనానే ఔట్ చేయడంతో భారత్ 29/3తో కాస్త ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో హర్మన్‌ప్రీత్, దీప్తినిలవడంతో భారత్ విజయం 8.4 ఓవర్లకే పూర్తయింది.

మునీబా (బి) షెఫాలి 13; షవాల్ ఎల్బీ (బి) శ్రీ చరణి 14; గుల్ ఫెరోజా (సి) నందని (బి) శ్రీ చరణి 0; ఆయేషా (సి) హర్మన్‌ప్రీత్ (బి) శ్రీ చరణి 2; సదాఫ్ (బి) ప్రేమ 3; ఫాతిమా సనా ఎల్బీ (బి) దీప్తి 0; ఏమాన్ ఫాతిమా రనౌట్ 5; హని (సి) నందని (బి) ప్రేమ 6; తుబా (స్టంప్డ్) రిచా (బి) దీప్తి 9; నష్రా (సి) రిచా (బి) ప్రేమ 0; సాదియా నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 3 మొత్తం: (18.1 ఓవర్లలో ఆలౌట్) 55; వికెట్ల పతనం: 1-27, 2-28, 3-29, 4-32, 5-35, 6-35, 7-45, 8-48, 9-54; బౌలింగ్: క్రాంతి గౌడ్ 2-0-9-0; నందని శర్మ 2-0-14-0; షెఫాలి వర్మ 3-0-10-1; శ్రీ చరణి 4-0-7-3; దీప్తి శర్మ 3.1-0-5-2; ప్రేమ రావత్ 4-0-9-3

షెఫాలి (సి) అండ్ (బి) సనా 12; స్మృతి ఎల్బీ (బి) సనా 9; ప్రతీక (సి) మునీబా (బి) సనా 4; హర్మన్‌ప్రీత్ నాటౌట్ 18; దీప్తి నాటౌట్ 12; ఎక్స్‌ట్రాలు 2 మొత్తం: (8.4 ఓవర్లలో 3 వికెట్లకు) 57; వికెట్ల పతనం: 1-13, 2-18, 3-29; బౌలింగ్: సాదియా ఇక్బాల్ 3-0-16-0; ఫాతిమా సనా 3-0-17-3; నష్రా సంధు 1.4-0-19-0; హని 1-0-4-0.

## బ్రో.. ఒక్కసారి స్కోరుబోర్డు చూసుకో..




ఆసియా కప్‌లో భారత్ వరుసగా విజయాలతో దూసుకుపోతోంది. శనివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను భారత్ చిత్తు చిత్తుగా ఓడించింది. ఆ జట్టును 18.1 ఓవర్లలో 55 పరుగులకే ఆలౌట్ చేసి ఈ స్వల్ప లక్ష్యాన్ని 8.4 ఓవర్లలో ఛేదించింది. భారత్ చేతిలో ఘోర ఓటమి చవిచూసినా పాక్ పోకడ మాత్రం తగ్గడం లేదు. మ్యాచ్ ముగిసిన అనంతరం ఆ జట్టు కోచ్ వహాబ్ రియాజ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆసియా కప్‌లో తమదే అత్యుత్తమైన టీమ్ అని వ్యాఖ్యానించాడు. 'ఈ ఆసియా కప్‌లో ట్రోఫీని గెలుచుకునే సత్తా పాకిస్థాన్‌కే ఉందని నేను ఇప్పటికీ నమ్ముతున్నాను. ఎందుకంటే ఇక్కడి పరిస్థితులు మాకు బాగా అనుకూలంగా ఉన్నాయి. భారత్‌తో మ్యాచ్‌లో చేసిన తప్పుల గురించి చర్చించుకుంటాం. ఆ తప్పులు మళ్లీ చేయకుండా ప్రయత్నిస్తాం'' అని వహాబ్ రియాజ్ పేర్కొన్నాడు. పాక్ కోచ్ వ్యాఖ్యలపై నెటిజన్లు సెటైరికల్‌గా స్పందిస్తున్నారు. ''అవును.. వాళ్లదే అత్యుత్తమ జట్టు. కానీ ట్రోఫీని సాధించడానికి వాళ్లకు మ్యాచ్‌లు గెలవాల్సిన అవసరం లేదు. ట్రోఫీని అందుకుని అక్కడి నుంచి పారిపోయేందుకు మోసిన్ నఖ్వీ లాంటి వాళ్లు ఉంటే చాలు'' అని ఓ నెటిజన్ కామెంట్ చేశాడు. ''మీడియా ముందుకు వచ్చే ముందు వాళ్ల స్కోరు బోర్డు చూడటం మర్చిపోయాడేమో.. అందుకే ఇలా మాట్లాడుతున్నాడు'' అని మరో యూజర్ రాసుకొచ్చాడు. 'వహాబ్ రియాజ్ మొదట సెలక్టర్.. ఆ తర్వాత సలహాదారు. ఇప్పుడు కోచ్. పాకిస్థాన్ క్రికెట్‌ను నాశనం చేసిన వారిలో ఇతను కూడా ఉన్నాడు. ఇలాంటి పదవులకు ఎలా అర్హత సాధిస్తారో నాకు అస్సలు అర్థం కావట్లేదు'' అని ఓ పాక్ అభిమాని కామెంట్ పెట్టాడు. ఈ ఆసియా కప్‌లో ఎనిమిది జట్లు పోటీ పడుతుండగా.. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. పాకిస్థాన్ ఇప్పటివరకు రెండు లీగ్ మ్యాచ్‌ల్లో ఒకటే (థాయ్‌లాండ్‌పై) గెలిచింది. దాయాది జట్టు చివర మ్యాచ్ హాంకాంగ్‌తో ఆడనుంది. అందులో గెలిస్తే పాక్ సెమీస్‌కు చేరుతుంది.

## షమిలో ఆకలి తగ్గలేదు

సీనియర్ ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమి టీమ్ ఇండియాకు దూరమై ఏడాదిన్నర కావస్తోంది. ఏ ఫార్మాట్లోనూ అతడిని భారత జట్టులోకి ఎంపిక చేయట్లేదు. అయినా 36 ఏళ్ల షమి ఆశలు కోల్పోకుండా దేశవాళీల్లో అన్ని ఫార్మాట్లలోనూ బరిలోకి దిగుతున్నాడు. నిలకడగా రాణిస్తూ మళ్లీ టీమ్ఇండియాలో చోటు సంపాదించాలని గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లోనూ అతను ఈస్ట్ జోన్ తరపున బరిలోకి దిగుతున్న నేపథ్యంలో ఆ జట్టు కెప్టెన్ ఇషాన్ కిషన్.. ఈ దిగ్గజ ఆటగాడి తపనను కొనియాడాడు. ''అతను భారత అత్యుత్తమ ఫాస్ట్‌బౌలర్లలో ఒకడు. తనది ఆటలో దిగ్గజ స్థాయి. బెంగాల్‌కు ఆడడం మొదలుపెట్టినప్పటి నుంచి స్థిరంగా రాణిస్తున్నాడు. టీమ్ఇండియా తరపునా అలాగే సత్తా చాటాడు. షమికి వయసు ఒక అంకె మాత్రమే. నిరంతరం కష్టపడుతూనే ఉంటాడు. తనలో ఆట పట్ల ఆకలి ఏమాత్రం తగ్గలేదు. కెప్టెన్‌గా తన తపనను దగ్గర్నుంచి గమనిస్తున్నా. వికెట్ల కోసం మరి కొన్ని ఓవర్లు వేయనా అని అడుగుతుంటాడు'' అని ఇషాన్ అన్నాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీ ఆడిన అయిదు రోజులకే ఆసియా క్రీడల్లో టీ20 మ్యాచ్‌లు ఆడడం సవాలే అని, కానీ ప్రొఫెషనల్ క్రికెటర్లుగా ఇలాంటి వాటికి సర్దుకోవాల్సిందే అని సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ అన్నాడు. ''అవును.. అయిదు రోజులు ఇక్కడ ఆడి, వెంటనే టీమ్ఇండియా తరపున టీ20ల్లో బరిలోకి దిగడం సవాలుతో కూడుకున్న విషయ మే. మేం దిల్లీ నుంచి జపాన్‌కు వెళ్లాక రెండు రోజుల ఖాళీనే ఉంటుంది. ఆ సమయంలోనే కొంత ప్రాక్టీస్ చేయాలి. మేం చాలా దేశవాళీ మ్యాచ్‌లు ఆడాం. ఎలాంటి పరిస్థితికైనా సర్దుకోవడం అలవాటు చేసుకున్నాం.



## సాత్విక్-చిరాగ్ జోడీకి చైనా మాస్టర్స్ టైటిల్




భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజు, చిరాగ్ శెట్టి చైనా మాస్టర్స్ సూపర్ సిరీస్ 750 టైటిల్‌ను దక్కించుకుంది. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో ప్రపంచ నం.5 సాత్విక్, చిరాగ్ జంట 11-21, 21-13, 21-17 తేడాతో హె జి టింగ్, రెన్ జియాంగ్ యు (చైనా) ద్వయాన్ని ఓడించి విజేతగా నిలిచింది. గంట 10 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో భారత జోడీ నిరాశపర్చింది. తర్వాత పుంజుకున్న భారత ద్వయం రెండు గేమ్‌ల్లో దూకుడుగా ఆడి చైనా జోడీని మట్టికరిపించింది. ఈ టోర్నీలో 2023, 2025లో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్, చిరాగ్ జంట మూడో ప్రయత్నంలో చైనా మాస్టర్స్ సూపర్ సిరీస్ 750 టైటిల్‌ను దక్కించుకుంది.




# తెలుగు చిత్రసీమలో మోక్షజ్ఞ తేజ తొలి అడుగు



**వుదయం సినిమా:** గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞ తేజ తెలుగు చిత్రసీమలో తన తొలి అడుగు వేయడానికి సిద్ధమయ్యారు. మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న డెబ్యూ సినిమాను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. నందమూరి కుటుంబానికి, అభిమానులకు ఇది మరో గొప్ప అధ్యాయానికి నాంది పలకనుంది.తన డెబ్యూ కోసం సరైన కథను ఎంచుకునేందుకు మోక్షజ్ఞ కావాల్సిన సమయం తీసుకున్నారు. పలు కథలను విన్న తర్వాత తనకు నచ్చిన కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి ప్రతిష్టాత్మక సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' చేస్తున్న దర్శకుడు వశిష్ట ఈ కథను సిద్ధం చేశారు. ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అందులోనూ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించనుండటంతో సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది.చిత్ర బృందం బాలకృష్ణ, మోక్షజ్ఞలను కలుసుకుని, యంగ్ లయన్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కొన్ని స్టిల్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ స్టిల్స్ మోక్షజ్ఞ స్టైలిష్‌గా, ఫిట్‌గా, చాలా హ్యాండ్సమ్ కనిపించడం అందరినీ ఆకట్టుకుంది. సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు మోక్షజ్ఞ ఇప్పటికే ఇంటెన్స్ గా ప్రిపేర్ అయ్యారు. కమర్షియల్ హీరోకు అన్ని అంశాల్లో శిక్షణ తీసుకుంటూ ఫిజికాలిటీ, పెర్ఫార్మెన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మోక్షజ్ఞ తేజ హీరోగా ఎంట్రీ ఇస్తుండటం, వశిష్ఠ దర్శకత్వం వహిస్తుండటం, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండటంతో ఈ కాంబినేషన్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మిగతా ఇతర నటీనటులు, టెక్నికల్ టీం వివరాలని మేకర్స్ వెల్లడించనున్నారు. నటీనటులు: నందమూరి మోక్షజ్ఞ తేజ

# #NBK111 పవర్‌ఫుల్ టైటిల్ 'దాదా'



**వుదయం సినిమా:** గాడ్ అఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్‌బస్టర్ మేకర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్ లో తెరకెక్కుతున్న స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ #NBK111, బాలయ్య పుట్టినరోజున "ఎంట్రీ ఆఫ్ ఆన్ ఎరా" అనే టైటిల్‌తో గ్లింప్స్ విడుదలైనప్పటి నుండి భారీ బజ్‌ను క్రియేట్ చేస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం టైటిల్‌ను పోస్టర్, పవర్ ఫుల్ గ్లింప్స్ ద్వారా ప్రకటించారు.#NBK111కు 'దాదా' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. బాలకృష్ణ పోషిస్తున్న పాత్ర స్వభావాన్ని ప్రజెంట్ చేసేలా ఈ టైటిల్ ఉంది. పోస్టర్‌లో బాలకృష్ణ మాస్ అవతార్‌లో కనిపించారు. సన్‌గ్లాసెస్, లెదర్ జాకెట్, మెడలో భారీ గోల్డ్ చైన్‌తో స్టైలిష్‌గా కనిపించిన ఆయన.. భుజంపై వెపన్‌తో రౌడీ, గ్యాంగ్‌స్టర్ తరహా వైబ్‌ను తీసుకొచ్చారు. ఆయన సీరియస్ ఎక్స్‌ప్రెషన్, కమాండింగ్ బాడీ లాంగ్వేజ్ క్యారెక్టర్‌లోని పవర్‌ను మరింత ఎలివేట్ చేశాయి.టైటిల్ గ్లింప్స్ బాలకృష్ణ క్యారెక్టర్ పవర్, ఆరాను ప్రజెంట్ చేస్తూ, ఆయనను 'షేర్' (సింహం)గా సంబోధించే వాయిస్‌ఓవర్‌తో వీడియో ఓపెన్ అవుతుంది. పోలీస్ అధికారులు ఆయనను చుట్టుముట్టి ఛాతిలో కాల్చేస్తామని హెచ్చరిస్తారు. 'నాకు గురి పెట్టడానికి ఒంట్లో పొగరు వేలికి ట్రిగ్గర్ ఉంటే సరిపోదు.. బుల్లెట్స్‌కి బలుపు, గన్స్‌కి గట్స్ ఉండాలి' అని బాలయ్య చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ అదిపోయింది, ఈ సీక్వెన్స్ అభిమానులను, మాస్ ఆడియన్స్‌ను ఫుల్‌గా ఎంటర్‌టైన్ చేసేలా ఉంది.దర్శకుడు గోపీచంద్ మలినేని బాలకృష్ణను లార్జర్ దేన్ లైఫ్ మాస్ అవతార్‌లో ప్రజెంట్ చేశారు.

# 'కామ్రేడ్ కళ్యాణ్' టీజర్ లాంచ్ ఈవెంట్



**వుదయం సినిమా:** 'కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్' శ్రీ విష్ణు పీరియడ్ ఎలిమెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'కామ్రేడ్ కళ్యాణ్' తో అలరించబోతున్నారు. జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 9న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే గ్లింప్స్, పాటలతో ఆసక్తిని పెంచిన మేకర్స్.. తాజాగా సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 1992లో ఆంధ్రా–ఒడిశా సరిహద్దు నేపథ్యంలో 'కామ్రేడ్ కళ్యాణ్' కథ సాగుతుంది. ఇందులో శ్రీ విష్ణు థియేటర్ ఓనర్‌గా కనిపించారు. విప్లవ చిత్రాల దర్శకుడు ఆర్. నారాయణ మూర్తికి ఆయన వీరాభిమాని. ఆయన సినిమాలనే ఎక్కువగా థియేటర్‌లో ప్రదర్శిస్తుంటాడు. ఇలా సంతోషంగా, ఎలాంటి సమస్యలు లేకుండా సాగిపోతున్న అతని జీవితంలోకి ఓ ఒడియా అమ్మాయి వస్తుంది. ఆమెతో ప్రేమలో పడిన తర్వాత పరిస్థితులు అనూహ్యంగా మారుతాయి. చివరికి అతడిని నక్సలిజం వైపు నడిపించే పరిస్థితులు ఏర్పడతాయి.సీరియస్ బ్యాక్‌డ్రాప్ ఉన్నప్పటికీ దర్శకుడు జనకిరామ్ మారెళ్ల ఈ కథను ప్రధానంగా హ్యూమర్ యాంగిల్‌లో తెరకెక్కించినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. నక్సలిజానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలు మినహా.. టీజర్ అంతా లైట్‌హార్టెడ్, ఎంటర్‌టైనింగ్ టోన్‌లో సాగింది. సినిమాలో కామెడీ ప్రధాన బలంగా నిలుస్తోంది.శ్రీ విష్ణు మరోసారి 'కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్' అనే పేరుకు తగ్గట్టుగా తన కామెడీ టైమింగ్, ఈజీ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. థియేటర్ ఓనర్‌గా, ఆర్. నారాయణమూర్తి అభిమానిగా ఆయన పాత్రలో మంచి హ్యూమర్ కనిపించింది. ముఖ్యంగా సత్య, సుదర్శన్‌లతో శ్రీ విష్ణు చేసే సన్నివేశాలు టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.ఒడియా అమ్మాయి పాత్రలో మహిమా నంబియార్ ఆకట్టుకున్నారు. రాధికా శరత్‌కుమార్ తన పాత్రలో మంచి కన్విక్షన్‌తో కనిపించారు. షైన్ టామ్ చాకో సీరియస్ అవతార్‌లో కనిపించగా, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రలో కనిపించారు.సినిమాటోగ్రాఫర్ సాయి శ్రీరామ్ ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని గ్రామీణ అందాలను అద్భుతంగా చూపించారు. పచ్చని ప్రకృతి, సహజమైన పరిసరాలు సినిమాకు మంచి విజువల్ రిచ్‌నెస్‌ను తీసుకొచ్చాయి.

# డిసెంబర్ 4న 'లెగసీ'



**వుదయం సినిమా:** మాస్ కా దాస్ విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'లెగసీ' విడుదల తేదీ ఖరారైంది. ఇంటెన్స్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం డిసెంబర్ 4, 2026న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. సాయికిరణ్ రెడ్డి దైదా రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కలాహి మీడియా బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. యశ్వంత్ దగ్గుమాటి, సాయి కిరణ్ రెడ్డి దైదా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంజయ్ సాంబ్రాణి, వి.వి.ఎన్. ప్రసాద్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.చిత్ర విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఓ స్ట్రైకింగ్ రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. విశ్వక్ సేన్, ఏక్తా రాథోడ్ కనిపిస్తున్న ఈ కొత్త పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. దీంతో డిసెంబర్ 4న 'లెగసీ'తో విశ్వక్ సేన్ ఎలాంటి పవర్‌ఫుల్ అనుభూతిని అందించబోతున్నారనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరిగింది.'పిండం' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన సాయికిరణ్ రెడ్డి దైదా, 'లెగసీ'తో తన రెండో ఫీచర్ ఫిల్మ్‌ను తెరకెక్కిస్తున్నారు. అలాగే 'పిండం' తర్వాత కలాహి మీడియా నిర్మిస్తున్న రెండో చిత్రం కూడా ఇదే కావడం విశేషం.పవర్‌ఫుల్ పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న 'లెగసీ'లో అధికారం, కుటుంబం, ప్రేమ, ద్రోహం వంటి అంశాల మధ్య జరిగే ఆసక్తికర సంఘర్షణను ఆవిష్కరించనున్నారు. తన తండ్రి వదిలిన వారసత్వం కారణంగా ప్రమాదకరమైన ప్రపంచంలోకి అడుగుపెట్టిన ఓ యువకుడి ప్రయాణంలో విశ్వక్ సేన్ పాత్ర సాగుతుంది. ఈ చిత్రంలో ప్రముఖ హిందీ నటుడు కే కే మీనన్ అత్యంత శక్తివంతమైన ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో రావు రమేష్, సచిన్ ఖేడేకర్, మురళీ మోహన్, ఏక్తా రాథోడ్, రాజా రవీంద్ర, రాజీవ్ కనకాల, అనీష్ కురువిళ్ల, ఖుషీ రవి, కల్యాణి నటరాజన్, రవి కాలే, అమిత్ తివారీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.చిత్ర సాంకేతిక విభాగంలో సినిమాటోగ్రాఫర్‌గా జిజు సన్నీ, సంగీత దర్శకుడిగా గోవింద్ వసంత, ఎడిటర్‌గా శిరీష్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్‌గా రాజీవ్ నాయర్, యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా జాషువా పని చేస్తున్నారు.ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో శరవేగంగా జరుగుతోంది. పవర్‌ఫుల్ కథాంశం, విశ్వక్ సేన్ ఇంటెన్స్ పాత్ర, భారీ తారాగణం, ప్రతిభావంతమైన సాంకేతిక బృందంతో రూపొందుతున్న 'లెగసీ' డిసెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.

# "మారెమ్మ" ప్రీరిలీజ్



**వుదయం సినిమా:** మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ విలేజ్ యాక్షన్–డ్రామా 'మారెమ్మ'తో హీరోగా పరిచయం అవుతున్నారు. మంచాల నాగరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతుండగా, మోక్ష ఆర్ట్స్ సంస్థ ఈ సినిమాను భారీ స్థాయిలో నిర్మిస్తోంది. మయూర్ రెడ్డి బండారు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. టీజర్, ట్రైలర్ పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. సెప్టెంబర్ 10 ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకకు మాస్ మహారాజా రవితేజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ.. అందరికీ గుడ్ ఈవెనింగ్. ఈ సినిమా చూశాను. చాలా బాగుంది. రియల్ ఇన్సిడెంట్స్‌పై తీశారు. చాలా రూటెడ్‌గా ఉంది. తెలంగాణ మైసాపురం బ్యాక్‌గ్రౌండ్ చాలా బాగుంది. నాకు చాలా నచ్చింది. డెఫినెట్‌గా జనాలకి బాగా నచ్చుతుందని నమ్ముతున్నాను. ప్రశాంత్ విహారి పాటలు చాలా బాగున్నాయి. తనకి చాలా మంచి ఫ్యూచర్ ఉంది. అలాగే డీఓపీ ప్రశాంత్ వర్క్ చాలా బాగుంది. ఈ సినిమా నిర్మాతలు మయూర్ కుశాల్‌కి మంచి సక్సెస్, మంచి పేరు, డబ్బులు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. వాళ్లు మరిన్ని మంచి సినిమాలు తీయాలి. దీపా తెలుగు నేర్చుకుని చక్కగా మాట్లాడారు. వికాస్ అందులో చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేశాడు. తనకి ఆల్ ది వెరీ బెస్ట్. నాగరాజుకి ఇది ఫస్ట్ సినిమా అయినప్పటికీ చాలా అద్భుతంగా డైరెక్షన్ చేశారు.

# మండాడి ప్రీ రిలీజ్ ఈవెంట్..

**వుదయం సినిమా:** తమిళ్ హీరో సూరి, టాలీవుడ్ యంగ్ హీరో సుహాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఆసక్తికరమైన చిత్రం 'మండాడి'. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్‌పై మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ఎల్రెడ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తిస్తోంది. బోట్ రేసింగ్, యాక్షన్, ఎమోషన్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో 'మండాడి' ఒక ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా ఉండబోతుందనే అంచనాలు నెలకొన్నాయి. సెప్టెంబర్ 10 న ఈ సినిమా రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా శివ నిర్వాణ స్పెషల్ గెస్ట్ గా ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ★హీరో సుహాస్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇక్కడి దాకా వచ్చినందుకు చాలా హ్యాపీగా ఉంది. ఈ రోజు టీచర్స్ డే, నా టీచర్స్ అంతా నా ముందే ఉన్నారు. మీ అందరి సపోర్ట్ తో ఎన్నో ఫేజెస్ దాటుకుంటూ మండాడి వరకు వచ్చా. చిత్రయూనిట్ అందరి సపోర్ట్ వల్లనే సినిమా సక్సెస్ ఫుల్ గా పూర్తి చేశాము. హీరోయిన్ మహిమ, రవీంద్ర విజయ్, సూరి నటన ఈ సినిమాకు మెయిన్ అసెట్స్. సెప్టెంబర్ 10 న ఓ వినూత్న కంటెంట్ థియేటర్స్ లో చూడటానికి సిద్ధంగా ఉండండి అన్నారు.



# "అంతా రాములోరు చూస్కుంటారు" టైటిల్ గ్లింప్స్



**వుదయం సినిమా:** యంగ్ ప్రామిసింగ్ హీరో సంగీత్ శోభన్ నటిస్తున్న కొత్త సినిమా "అంతా రాములోరు చూస్కుంటారు". ఈ చిత్రంలో అనస్వర రాజన్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని శ్రీమతి శ్రావణి సమర్పణలో ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్, వి.జి.బి. ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ పై సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని, న్యూ యాస్పరెంట్ ప్రొడ్యూసర్ గిరిబాబు వల్లభనేని నిర్మిస్తున్నారు. ఎంటర్ టైనింగ్ లవ్ స్టోరీతో టాలెంటెడ్ డైరెక్టర్ పల్నాటి సూర్యప్రతాప్ రూపొందిస్తున్నారు. లక్ష్మీ భూపాల్ రైటర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ రోజు హైదరాబాద్ లో "అంతా రాములోరు చూస్కుంటారు" సినిమా టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ గిరిబాబు వల్లభనేని మాట్లాడుతూ – ఎంటర్ టైన్ మెంట్ తో కూడిన లవ్ స్టోరీతో మా "అంతా రాములోరు చూస్కుంటారు"ను నిర్మిస్తున్నాం. మా టైటిల్ లో ఉన్నట్లు అంతా రాములోరు చూసుకుంటారు. మా టీమ్ అందరికీ బెస్ట్ విశెస్ అందిస్తున్నా. అన్నారు.డైరెక్టర్ పల్నాటి సూర్యప్రతాప్ మాట్లాడుతూ – మా మూవీలో హీరో సంగీత్, హీరోయిన్ అనస్వర క్యారెక్టర్స్ మధ్య కెమిస్ట్రీ చాలా బాగుంటుంది. వీళ్ల పెయిర్ మనందరినీ మోటివేట్ చేస్తుంది. సినిమా చూస్తున్నప్పుడు ఒక మంచి జంట అనే ఫీల్ కలిగిస్తారు. సంగీత్, అనస్వర అంత బాగా ట్యూన్ అయ్యారు. ఈ కథను నమ్మి ఈ కథకు నేను న్యాయం చేయగలను అని నమ్మి నాకు కాల్ చేసిన ప్రొడ్యూసర్ ధీరజ్ కు థ్యాంక్స్ చెబుతున్నా. ఆయనను జీవితంలో మర్చిపోలేను. ప్రొడ్యూసర్ గిరికు కూడా థ్యాంక్స్. గోదావరి బ్యాక్ డ్రాప్ లో రూపొందించిన చిత్రమిది. రాజమండ్రికి కోనసీమకు అవతల సైడ్ తీశాము. అందుకే ఈ సినిమాలో ప్రాపర్ గోదావరి స్లాంగ్ కాకుండా ఆ స్లాంగ్ లోనే చిన్న వేరియేషన్ కనిపిస్తుంటుంది. అంతా రాములోరు చూస్కుంటారు అనే టైటిల్ మేము ఊరికే పెట్టలేదు. దాని వెనక కాన్సెప్ట్ ఉంది. మీ సపోర్ట్ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా. అన్నారు.

# తెలుగు చిత్ర నిర్మాతల మండలి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మన ప్యానెల్

**వుదయం సినిమా:** తెలుగు చిత్ర నిర్మాతల మండలి 2026 ఎన్నికలలో మన ప్యానల్, ప్రోగ్రెసివ్ ప్యానల్ పోటీ చేయగా మన ప్యానల్ నుండి సి కళ్యాణ్ గారు ఏకగ్రీవంగా ప్రెసిడెంట్ గా ఎన్నుకోబడ్డారు. అలాగే అదే మన ప్యానల్ నుండి చదలవాడ శ్రీనివాస రావు గారు కోశాధికారిగా ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్ గా మన ప్యానెల్ నుండి మోహన్ వడ్లపట్ల గారు, ప్రోగ్రెస్ ప్యానెల్ నుండి దామోదర ప్రసాద్ గారు ఎన్నికయ్యారు. అలాగే జాయింట్ సెక్రటరీలుగా మన ప్యానల్ నుండి అమ్మిరాజు గారు, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ గారు గెలిచారు. ఈసీ సభ్యులుగా ప్రోగ్రెసివ్ ప్యానల్ నుండి ముగ్గురు అనగా మైత్రి రవి గారు, నిరంజన్ రెడ్డి గారు, డిఎస్ రావు గారు గెలవగా మన ప్యానెల్ నుండి 12 మంది పద్మిని గారు, ఎషియన్ సునీల్ గారు, మోహన్ గౌడ్ గారు, శివలెంక కృష్ణప్రసాద్ గారు, దానయ్య గారు, వంశీ నందిపాటి గారు, పల్లి కేశవ రావు గారు, శ్రీనివాసరావు గారు, పుల్లారావు గారు, బాపిరాజు గారు, ఆర్ కె కౌడ్ గారు,నయీం గారు గెలిచారు. ప్రస్తుతం సెక్రటరీ పోస్టు గురించి కేసు కోర్టులో ఉండటంతో వారి ఎన్నికల ఫలితాలను ఒక సీల్డ్ కవర్లో ఎన్నికల అధికారి దుర్గా ప్రసాద్ గారు శీల్ చేసి కోర్టులో అప్పగించనున్నారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.